# ఆమెరికా బుజ్జిపండు

\- జ్యోతిర్మయి



శ్రీ

కౌముది

మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 75

కౌముది మాసపత్రికలో జనవరి 2013
నుంచి డిసెంబర్ 2013వరకూ
సీరియల్ గా వచ్చిన గల్పికలు

**బుజ్జిపండు అమెరికాలో పుట్టి పెరుగుతున్న తెలుగు కుర్రాడు. వాడి బుజ్జిపొట్టలో ఎప్పుడూ ఎన్నో సందేహాలు. తెలుగుతనం కాపాడుకోవాలనుకునే అమ్మా, నాన్నా - బయట ఎక్కడి కెళ్ళినా వివిధ జాతుల పిల్లలతో సహవాసం, మధ్య మధ్యలో సంస్కృతీ సంప్రదాయం అంటూ అమ్మా నాన్నలు తీసుకెళ్ళే కార్యక్రమాలూ.. వెరసి వాడికి అన్నీ అనుభవాలే, అన్నీ వింతలూ విడ్డురాలే! అలాంటి అమెరికా బుజ్జిపండు అనుభవాల సంపుటి మీకోసం!**

# నేనే పెద్ద!!

**బుజ్జిపండు నిద్ర లేచి కళ్ళు తెరవగానే** గోడ మీద స్టిక్ మాన్ కనిపించాడు. బ్లైండ్స్ లోనుండి వెలుతురు లంబకోణంలో రెండు గీతలుగా పడడం వల్ల తోలు బొమ్మలాటలోని కొయ్య బొమ్మలా అనిపిస్తోందది. పండుకు ఆ స్టిక్ మాన్ అంటే చాలా ఇష్టం. ఆ పక్కనే రాత్రి పార్టీ నుండి ఇంటికి తెచ్చిన హాపీ న్యూ ఇయర్ అని రాసున్న బెలూన్ గోడకు అనుకుని ఫాన్ గాలికి ఊగుతోంది. ఆవేళ కొత్త సంవత్సరమని అప్పుడు గుర్తొచ్చింది పండుకు. కొయ్య బొమ్మకు "హాపీ న్యూ ఇయర్ స్టిక్ మాన్" అని శుభాకాంక్షలు చెప్తూ మంచం దిగాడు పండు. రెస్ట్ రూమ్ కి వెళ్లి పళ్ళు తోముకుని హాల్లోకి వెళ్ళేసరికి వాళ్ళక్క ప్రత్యూష, అమ్మ వైష్ణవి ఇచ్చిన పాలు తాగుతూ కిచెన్ కౌంటర్ దగ్గర కూర్చుని వుంది. వైష్ణవి పండుకు కూడా కప్పులో పాలు పోసి చాకొలేట్ పౌడర్ కలిపి ఇచ్చింది.

"ఇవాళ కొత్త సంవత్సరం మొదలైంది కదా! గుడికెళ్దాం త్వరగా తయారవ్వండి." అంటూ పిల్లలిద్దరికీ చెప్పింది వైష్ణవి.

బుజ్జిపండు గదిలోకి వెళ్లగానే వైష్ణవి కూడా వెనుకే వచ్చి అరలో మడత పెట్టి వున్న కుర్తా పైజమా తీసిచ్చింది. చిన్నచిన్న పూసలు కుట్టిన నీలం రంగు కుర్తా, గంధం రంగు పైజమా చాలా అందంగా వున్నాయి. అవెంతందంగా వున్నా వాటికుండే పూసలు దారాలు గుచ్చుకుంటాయని అలాంటి బట్టలు అస్సలు నచ్చవు పండుకు. పైగా అవేసుకుని రెస్ట్ రూమ్ కి వెళ్ళాలంటే వాడికి ఎవరో ఒకరు సహాయం చెయ్యాల్సిందే.

"మామ్ డు ఐ హావ్ టు వేర్ దిస్?" మొహం విసుగ్గా పెట్టి అడిగాడు.

"గుడికెళ్తున్నాం కద నాన్నా, అలాంటి బట్టలే వేసుకోవాలి" చెప్పింది వైష్ణవి.

ఇంకోసారైతే గొడవ పెట్టేవాడేమో కాని నిన్నరాత్రి అమ్మ "కొత్త సంవత్సరం రోజు ఎలా వుంటే సంవత్సరమంతా అలాగే వుంటుంది" అని చెప్పడం గుర్తొచ్చి, అమ్మతో గొడవ పెట్టుకోవడం ఇష్టం లేక,

"గుడి నుండి ఇంటికి వచ్చిన వెంటనే విప్పేస్తాను." కొంచెం కోపంగా చెప్పేసి బాత్ రూమ్ లోకి వెళ్ళాడు.

స్నానం పూర్తిచేసి టవల్ చుట్టుకుని గదిలోకి వచ్చి కుర్తాను అటూ ఇటూ తిప్పి చూశాడు పండు. చొక్కా కంటే చాలా పొడవుగా వుందది. టీ షర్ట్ వేసుకున్నట్లుగా ముందు చేతులు రెండూ లోపల పెట్టి వేసుకోవాలని చూశాడు. చేతులు లోపలకు వెళ్ళాయి కాని తల బయటకు రాలేదు. పండుకు లోపల ఏమీ కనిపించలేదు, వాడికి బోలెడు భయం వేసింది. "అమ్మా అమ్మా" అంటూ గట్టిగా కేకలు పెట్టాడు. ఏమైందోనని వైష్ణవి హడావిడిగా వెళ్ళేసరికి డాన్స్ చేస్తున్న కుర్తా కింద కాళ్ళు కనిపించాయి, పిల్లాడు కనిపించలేదు. కుర్తా కిందకు లాగి సరి చేసి ఆ తరువాత పైజమా కూడా వేసింది. తల శుభ్రంగా తుడిచి నున్నగా దువ్వి "బంగారు కొండలా వున్నా"వంటూ ముద్దు పెట్టుకుంది. పండు అక్కేమైనా వచ్చిందేమోనని తలుపు వైపు చూశాడు. అమ్మ అలా ముద్దు పెట్టుకోవడం వాడికి చాలా ఇష్టం కాని, ఆ విషయం ఎవరికీ తెలియడం ఇష్టం లేదు. తెలిస్తే వాడ్నెక్కడ చిన్నవాడనేస్తారోనని భయం.

"నువ్వెళ్ళి టివి చూస్తూండు నాన్నా, ఈలోగా నేను అక్కను రెడీ చేస్తాన"ని చెప్పి గదిలోంచి బయటకు వెళ్ళింది వైష్ణవి.

వైష్ణవి అలా వెళ్ళగానే పండు అద్దం దగ్గరకు వెళ్లి నిలబడి చూసుకున్నాడు, అద్దంలో వున్నది తను కాక వేరే ఎవరోలా కనిపించింది. చేత్తో జుట్టు కొంచెం చెరిపేసుకుని, అటూ ఇటూ తిరిగి చూసుకున్నాడు. వాడు నడుస్తుంటే చెమక్ చెమక్ మని పూసలు మెరవడం నచ్చింది. ఒక పూసను లాగి చూశాడు. అది ఏకంగా చేతిలోకే వచ్చేసింది. 'అమ్మొస్తుందేమో తిడ్తుందిప్పుడు' అనుకుని జాగ్రత్తగా తిరిగి పెట్టడానికి ప్రయత్నించాడు. అది ఊడి పడిపోతుంది కాని దాని స్థానంలోకి వెళ్ళడం లేదు. ఒకసారిలాగే పూసలు లాగేసి వాటిని క్విక్ ఫిక్స్ పెట్టి అంటిస్తే ఆ విషయం ఎలా కనిపెట్టేసిందో ఏమో అమ్మ వాడికి బోలెడు బోలెడు నీతులు చెప్పేసింది. ఈసారి గప్ చిప్ గా ఆ పూసను తీసుకెళ్ళి చెత్తబుట్టలో పడేశాడు. ఏం తెలియనట్లుగా వెళ్ళి సోఫాలో కూర్చుని కార్టూన్ పెట్టుకున్నాడు. ఈలోగా ప్రత్యూష కూడా పట్టులంగా, రెండు జడలు వేసుకుని తయారయి వచ్చింది. వాడికి ప్రత్యూష అక్కలా కనిపించలేదు. మొన్న చూసిన తెలుగు సినిమాలో ఎవరో అమ్మాయిలా ఫన్నీగా కనిపించింది.

అరగంట తరువాత నలుగురూ కారులో గుడికి బయలు దేరారు.

"గుడిలో అల్లరి చేయకూడదు బుద్ధిగా వుండాలి." చెప్పింది వైష్ణవి.

"ఫోర్త్ టైం" అంటూ పండు చెవిలో చెప్పింది ప్రత్యూష.

ఇద్దరూ కిసుక్కున నవ్వారు. పిల్లలెందుకు నవ్వుతున్నారా అని వెనకకు చూసిన అమ్మతో "అమ్మా, ఇవాళ ఏ గాడ్ పుట్టినరోజు?" అడిగాడు పండు.

"ఏ దేవుడిదీ కాదు కొత్త సంవత్సరం కదా ఈ రోజు దేవుడికి మొక్కుంటే సంవత్సరమంతా మంచే జరుగుతుంది. దేవుడి దగ్గర చక్కగా చదువు రావాలని దండం పెట్టుకోండి." చెప్పిందమ్మ.

"అమ్మా, ఇక్కడ మా బుక్స్ అన్నీ ఇంగ్లీష్లో వుంటాయి, సరస్వతీ దేవికి ఇంగ్లీష్ రాదుగా మరి మాకు చదువెట్లా తెప్పిస్తుంది." సందేహం వ్యక్తం చేశాడు పండు.

ప్రసాద్ రేర్ వ్యూ మిర్రర్ లోంచి పండును చూసి నవ్వుతూ "దేవతలకు అన్ని భాషలూ వస్తాయి. నువ్వు దండం పెట్టుకో నీకు బాగా చదువొచ్చేలా చేస్తుంది" చెప్పాడు నాన్న.

"దండం పెట్టుకుంటే ఇకనుండి కుమాన్ వర్క్ చెయ్యక్కర్లేదా?" ఆశగా అడిగాడు పండు.

"నువ్వు కుమాన్ చేస్తే ఇంకా బాగా లెక్కలు వస్తాయి." చెప్పిందమ్మ. ఇంకా బాగా ఎందుకు రావాలో అర్థం కాలేదు పండుకు.

మాటల్లోనే గుడి దగ్గరకు వచ్చేశారు. కారు దిగి చెప్పులు గుడి బైట అరలో పెట్టి అక్కడే వున్న కుళాయిలో నీళ్ళు తిప్పి కాళ్ళు కడుక్కుని లోపలకు వెళ్ళారు. లోపల గణపతికి, వెంకటేశ్వర స్వామికి, సీతారామంజనేయులకు, శివుడికి వేరు వేరుగా చిన్న చిన్న మందిరాలున్నాయి. ఒకమూలగా నవ గ్రహాలున్నాయి.

ప్రదక్షణాలు మొదలు పెట్టగానే శివుడి గుడి దగ్గరున్న పూజారి "అమ్మా, నవగ్రహాలను బయటేసి ప్రదక్షణం చెయ్యండి" అని చెప్పాడు.

పండు నాన్న వెనుకే దండం పెట్టుకుని నడుస్తూ నాన్న చేసినట్లుగానే గుడిగోడల మీద వున్న విగ్రహాలను తాకి కళ్ళకద్దుకుంటూ, "నాన్నా గాడ్స్ అందరిలో ఏ గాడ్ పవర్ ఫుల్?" అనడిగాడు.

"అందరూ మహిమ గలవాళ్ళే ఎవరి మహత్యం వాళ్ళది. ఒక్కోదానికి ఒక్కో దేవుడు. సరస్వతీ దేవి చదువిస్తుంది, లక్ష్మీ దేవి ధనం అంటే డబ్బులిస్తుంది. అలాగన్నమాట." చెప్పాడు ప్రసాద్.

"ఓ ఒక్కో దానికి ఒక్కో దేవుడుంటాడా, మరి బట్టలకు, రోడ్లకు దేవుడెవ్వరు?" గోడమీద చెక్కివున్న అమ్మవారి కాళ్ళు తాకి కాళ్ళ కద్దుకుంటూ అడిగాడు పండు.

"వాటికి దేవుడుండదు నాన్నా" చెప్పింది వైష్ణవి.

అమ్మ వైపు అపనమ్మకంగా చూశాడు. "రోజూ బట్టలు వేసుకోవాలా! మరి మంచి మంచి బట్టలు దేవుడే కదా ఇవ్వాలి. వాటికి దేవుడే లేకపోవడం ఏమిటి?" అని ఆలోచిస్తుంటే వాడికి మొన్న టివిలో చూసిన రోడ్డు ప్రమాదం గుర్తొచ్చింది. రోడ్డు దేముడు లేకపోబట్టి అలా ప్రమాదం జరిగిందని ఆలోచిస్తూ

"నాన్నా మనం వాటన్నిటికీ దేవుణ్ణి పెట్టుకుందాం" అని చెప్పాడు.

"దేముడిని మనం పెట్టుకోవడం ఏమిటి? ఎలా పెడతాం దేముడిని" అన్నాడు పండుతో అంతకంటే ఏం చెప్పాలో ఆ క్షణంలో తోచలేదు ప్రసాద్ కు.

"ఈ కొత్త గుడి కట్టినప్పుడు దేవుళ్ళందరినీ ఇండియా నుండి తెచ్చుకోలేదూ, అలానే తెచ్చి పెట్టుకుందాం." అని చెప్పాడు.

ఈ లోగా మూడు ప్రదక్షిణాలు పూర్తవడంతో వెంకటేశ్వర స్వామి గుడి ముందు నిలబడ్డారు. అప్పటికే చాలామంది అక్కడ దేవుణ్ణి చూస్తూ మందిరానికి అటూ ఇటూ వరుసగా నిలబడి వున్నారు.

పూజారి దేవుడికి అభిషేకం చేస్తూ మంత్రాలు చదువుతున్నాడు. “అమ్మా ఇంకా ఎంతసేపు పూజ.” మెల్లగా అడిగాడు వైష్ణవిని.

“ఇంకొంచెం సేపు పడుతుంది, మాట్లాడకుండా నిలబడు.” చెప్పింది వైష్ణవి.

పండు అక్కడే నిలబడి దిక్కులు చూడడం మొదలు పెట్టాడు. కొంతమంది ఆడవాళ్ళు ఓ పక్కగాకూర్చుని పువ్వులు కడుతూ వున్నారు. లైన్లో నిలబడిన వాళ్ళు కొంతమంది కళ్ళు మూసుకుని వుంటే మరికొంతమంది పెదవులు కదుపుతూ శబ్దం రాకుండా ఏదో చదువుతున్నారు. దూరంగా వున్న టేబుల్ మీద ప్రసాదం ట్రేలు రెండు కనిపిస్తున్నాయి.

“అక్కా ప్రసాదం ఎప్పుడు పెడతారు?” మెల్లగా ప్రత్యూష చెవి దగ్గరకొచ్చి అడిగాడు పండు.

పండు ఎంత మెల్లగా అడిగినా అది వైష్ణవికి వినిపించి, నోటి మీద వేలు పెట్టికుని మాట్లాడవద్దన్నట్లు సైగ చేసింది. పూజ పూర్తయిందనడానికి గుర్తుగా పూజారి గంట గణగణ వాయించి  నైవేద్యం పెట్టడానికి గర్భగుడిలోకి ప్రసాదం గిన్నె పట్టుకుని వెళ్ళి తలుపులు దగ్గరగా వేశాడు.

“నాన్నా పూజారి తలుపులు ఎందుకు వేశాడు?” లోపలేమైనా కనిపిస్తుందేమో నని తొంగి చూస్తూ సందేహం వ్యక్తం చేశాడు పండు.

“పెద్దవార్ని గౌరవించాలి, పూజారి గారిని ‘వేశాడు’ అనకూడదు, ‘వేశారు’ అనాలి” సరిదిద్దింది వైష్ణవి.

“దేవుడు  ఆ నేవేద్యం తింటాడు కదా అప్పుడు ఎవరూ చూడకూడదని వేశారు.” చెప్పాడు ప్రసాద్.

“పూజారి ఇంకా లోపలే వున్నారుగా ఆయన కూడా తింటారా?” నాన్న గబుక్కున పండు నోరు మూశాడు.

“ష్..మాట్లాడకుండా కళ్ళు మూసుకుని దండం పెట్టుకో” అంటూ సన్నగా కసిరిందమ్మ.

తరువాత ఆంజనేయ స్వామి గుడి దగ్గర ప్రత్యూష ఆంజనేయ స్వామి దండకం చదివింది. శ్లోకా క్లాసులకు రెండేళ్ళ నుండీ వెళ్తుందిగా ప్రత్యూషకి చాలా శ్లోకాలొచ్చు. పండు ఈ మధ్యే క్లాసులకు వెళ్ళడం మొదలు పెట్టాడు, తనకొచ్చిన “శుక్లాం బరదరం”, “తొండమునేక దంతము” శ్లోకాలు చదివాడు. శివుడి గుడి దగ్గర పూజారిని చూడగానే పండుకు అంతకు ముందు నవగ్రహాల గురించి ఆయన చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

“నాన్నా, ప్రదక్షిణం చేసేప్పుడు నవగ్రహాలను బయటేసి తిరిగమన్నారు. మనం మర్చేపోయాం ఒక్క గ్రహాన్ని కూడా బయటెయ్యలేదు.” కంగారుగా చెప్పాడు. అమ్మా, నాన్నా, అక్కడే వున్న పూజారి ఫక్కున నవ్వారు.

“బయటెయ్యమంటే బయట పడెయ్యమని కాదు నాన్నా, గుడి చుట్టూ ప్రదక్షణం చేసేప్పుడు నవగ్రహాలను వదిలి ఇవతల పక్క తిరగమని అర్థం. నవగ్రహాలకు వేరుగా ప్రదక్షణ చేయాలి.” అని చెప్పాడు ప్రసాద్.

“ఈ పెద్దవాళ్ళు ఏదీ అర్థం అయ్యేలా చెప్పరు“ అని మనసులో బోలెడు విసుక్కుని, వాళ్ళు నవ్వినందుకు సిగ్గుపడి లేచి దూరంగా సీతారాముల గుడి దగ్గరకు వెళ్ళాడు.

బాణాలు పట్టుకుని నిలబడిన రామలక్ష్మణులను తన్మయంగా చూస్తూ నిలబడ్డాడు పండు. ఆ బాణాలును, అంబుల పొదిని చూస్తూ తను కూడా అడవిలో వేటకెళ్ళి ఠీవిగా బాణం వేస్తున్నట్లు ఊహించుకున్నాడు. వారి పాదాల దగ్గర నమస్కారం పెడుతూ నిలబడిన హనుమంతుణ్ణి చూస్తూ "పాపం ఈ దేముడు కోతి తల పెట్టుకున్నాడు. చిన్నప్పుడు స్కూల్లో ఫ్రెండ్స్ టీజ్ చెయ్యలేదా" అమ్మనడగాలనుకుంటూ వాళ్ళ దగ్గరకు వెళ్ళేసరికి అమ్మ చిన్న ప్లేట్లో పొంగలి, పులిహోర ప్రసాదం పెట్టిచ్చింది. ప్రసాదం చూడగానే అడగాలనుకున్న విషయం మరచిపోయాడు పండు. నాన్నకు పులిహోరలో వేసిన పచ్చిమిరపకాయాలంటే చాలా ఇష్టం, ఎప్పుడూ పండు ప్లేట్లో మిరపకాయలు కూడా తీసేసుకుంటాడు. పచ్చి మిరపకాయలు నాన్నకివ్వడానికి పండు తన ప్లేట్ వైపు చూశాడు, ఒక్క మిరపకాయ లేదు. తనకే కాదు అక్కప్లేట్లో, అమ్మ ప్లేట్లో కూడా లేదని గమనించి, ప్లేట్ పట్టుకునే ప్రసాదం వున్న టేబుల్ దగ్గరకు వెళ్ళి చూశాడు.

"అమ్మా వీళ్ళు పులిహోరలో మిరపకాయలు వెయ్యడం మరచిపోయారు." అక్కడినుండే అరిచాడు.

అక్కడున్నవాళ్ళంతా వాణ్ణి చూసి నవ్వగానే ఈ సారి పండుకు నిజంగానే బోలెడు కోపం వచ్చింది. ఈ పెద్దాళ్ళకు నవ్వడం తప్ప వేరే పనిలేదు అనుకుంటూ కోపంగా అమ్మ దగ్గరకు వచ్చాడు. ప్రసాదం తినకుండా ప్లేట్ పక్కన పెట్టి తలొంచుకుని కూర్చున్న పండును చూసి నాన్నకు వాడు నొచ్చుకున్నాడని అర్థమైంది.

"నేను తినిపించనా నాన్నా" అంటూ ప్రసాదం ప్లేటు చేతిలోకి తీసుకున్నాడు ప్రసాద్. ఏం అక్కర్లేదన్నట్లుగా మొహం పక్కకు తిప్పుకున్నాడు పండు.

అమ్మ వాడి జుట్టు నిమురుతూ "దేముడికి చేసిన పులిహోరలో మిరపకాయలు వెయ్యరు నాన్నా." అని చెప్పింది.

"ఎందుకు దేముడు కారం తినడా?" అంటూ తనకు తెలియకుండా నాన్న వైపు తిరిగి నోరు తెరిచాడు పండు.

నాన్న స్పూన్తో పొంగలి నోట్లో పెడుతూ తినడని చెప్పాడు.

అయితే దేముడింకా చిన్నవాడే, అందుకేనన్నమాట అమ్మ పూజారి గారిని 'తిన్నారు' అని దేముడిని 'తిన్నాడు' అని చెప్పింది అనుకున్నాడు. "కారంగా వుండే ఆవకాయ ముక్కని కడుక్కోకుండా తినేస్తున్నాను దేవుడి కంటే నేనే పెద్ద" అనుకున్నాడు పండు.

●●●

# బొమ్మ ఆర్ట్

డ్రాయింగ్ పుస్తకం, రంగు పెన్సిళ్ళు, క్రేయాన్లు తీసుకొచ్చి కాఫీ టేబుల్ దగ్గర కూర్చున్నాడు బుజ్జిపండు. ఒక కాగితం మీద ముందుగా ఒక నిలువు గీత, దానికి పది అడ్డం గీతలు, ఒక్కో గీతకు అటో ఐదు, ఇటో ఐదు మొత్తం పది సున్నాలు చుట్టాడు. “అమ్మా, లుక్ లుక్...” పిలిచాడు పండు. కాఫీ తాగుతూ లాప్ టాప్ లో నెట్ బ్రౌజ్ చేస్తున్న వైష్ణవి, పండు వైపు చూసింది.

“ట్రీ డ్రా చేశాను బావుందా?” అడిగాడు.

బొమ్మ వైపు చూస్తూ “చాలా బావుంది నాన్నా” చెప్పింది వైష్ణవి.

పండు తృప్తిగా బొమ్మను చూసి ఒక్కో సున్నాకి ఒక్కో రంగు వేయడం మొదలెట్టాడు.

“అన్నట్టు, ఈ శనివారం రిత్విక్ పుట్టినరోజు నాన్నా....నువ్వు బొమ్మ వేయడం పూర్తవగానే మనం ‘టాయ్స్ రస్’ కి వెళ్ళి తన కోసం మంచి బొమ్మ కొందాం” చెప్పింది వైష్ణవి.

‘టాయ్స్ రస్’ పేరు వినగానే బుజ్జి పండు మొహం విప్పారింది. “నేను తరువాత రంగులు వేస్తాలేమ్మా... ఇప్పుడే వెళ్దాం” అంటూ ఉత్సాహంగా పైకి లేచాడు.

“సరే అయితే ఆ క్రేయాన్స్ అన్నీ సర్ది పెట్టేసి, అక్కను కూడా రమ్మని చెప్పు” లాప్ టాప్ మూసివేస్తూ చెప్పింది వైష్ణవి.

ప్రత్యూష రాగానే తను వేసిన బొమ్మ చూపించాడు.

“వావ్...అమ్మ డ్రస్సర్ మీదున్న గాజుల స్టాండ్ బొమ్మా..... బాగా వేశావు పండూ“ మెచ్చుకుంది.

తను, చెట్టు అంత బాగా వేస్తే అక్క గాజుల స్టాండ్ అనడం, అస్సలు నచ్చలేదు పండుకు.

“అమ్మా... ఇది గాజుల స్టాండ్ లాగా వుందా?” నిర్ధారణ కోసం వైష్ణవి నడిగాడు.

“చూస్తుంటే అలా కూడా ఉంది పండూ, నువ్వు మోడరన్ ఆర్ట్ కూడా వేస్తావా?” మోహంలో ఆశ్చర్యం కనిపించేలా జాగ్రత్త పడుతూ అడిగింది అమ్మ.

ఆ ప్రశ్నతో పండు మోహంలో పోయిన వెలుగు మళ్ళీ వచ్చింది.

“ఓ చెట్టు వేశావా...మరి ఈ గుండ్రంగా వున్నవన్నీ ఏమిటి?” అడిగింది ప్రత్యూష.

“అవన్నీ ఫ్లవర్స్. హండ్రడ్ ఫ్లవర్స్. నెక్స్ట్ వీక్ హండ్రెడ్త్ డే కదా మా టీచర్ ఏవైనా హండ్రడ్ ఉండేలా చెయ్యమన్నారు” చెప్పాడు.

"మీ స్కూల్ తెరిచి అప్పుడే వంద రోజులౌతోందా....సరే సరే, ఇక బయలుదేరుదాం?" కీ హోల్డర్ లోంచి కారు తాళాలు తీస్తూ పిల్లలతో చెప్పింది వైష్ణవి.

పండు కారు దిగగానే, వాళ్ళమ్మ పిలుస్తున్నా వినకుండా పరిగెత్తుకుంటూ వెళ్ళి షాపు ముందు నిలబడ్డాడు. తలుపు దానంతట అదే తెరుచుకుంది. ఎదురుగా పే....ద్ద డైనోసార్ తల అటూ ఇటూ ఊపుతూ అప్పుడప్పుడూ గట్టిగా అరుస్తూ కనిపించింది. లోపలకు వెళ్ళి ఆశ్చర్యంగా కొద్దిసేపు దాన్ని చూసి అక్కడినుండి ఇసుకలో, నీళ్ళలో ఆడుకునే బొమ్మలున్న వరుసలు దాటుకుంటూ, టెడ్డీ బేర్లున్న వరుస దగ్గర ఆగాడు పండు. అక్కడ తెల్లగా వున్న ఒక పెద్ద ఏనుగు బొమ్మను తీసుకొచ్చి

"అమ్మా ఇది చాలా బావుంది కదూ" అంటూ వైష్ణవికి చూపించాడు.

"అది మరీ చిన్న పిల్లలు ఆడుకునేది నాన్నా, రిత్విక్ కిప్పుడు మూడేళ్ళు కదా... ఆ వయస్సు పిల్లలు ఆడుకునే బొమ్మను చూద్దాం" చెప్పింది వైష్ణవి.

పండు మళ్ళీ దాన్ని వెనక్కి పెట్టేసి మెల్లగా "సారీ ఎలిఫెంట్, బట్ ఐ రియల్లీ లైక్ యు" అని దానికి మాత్రమే వినిపించేలా చెప్పి పక్క వరుసలోకి వెళ్ళాడు. అక్కడ అమ్మాయిల బొమ్మలు, వాటికి గౌన్లు, పిల్లలాడుకునే వంటగది సామాన్లు, కూరగాయలు... ఇంకా అలాంటివే చాలా ఉన్నాయి. పండుకు తెల్లని ఫ్రాక్ వేసుకున్న ఒక పాప బొమ్మ చాలా నచ్చింది. దాన్ని అరలో నుంచి తీసుకుని చేతిలో పట్టుకోగానే అది నిద్ర పోతున్నట్లుగా కళ్ళు మూసుకుంది. ఆశ్చర్యంగా చూసి దాన్ని మళ్ళీ నిలబెట్టగానే కళ్ళు తెరుచింది. రెండుసార్లు దాన్ని నిలువుగా అడ్డంగా తిప్పి "అమ్మా అమ్మా... ఈ బొమ్మ చూడు" ఉత్సాహంగా చూపించాడు అమ్మకు.

"రిత్విక్ కోసం ఇది తీసుకుందామా?" అడిగాడు.

"బాయ్స్ కి ఇలాంటి బొమ్మలు ఇవ్వకూడదు నాన్నా" చెప్పిందమ్మ.

"నాకిది చాలా నచ్చింది, పోనీ నేను కొనుక్కోనా?" అడిగాడు.

"నువ్విలాంటి బొమ్మ కొంటే నీ స్నేహితులు నిన్ను ఎగతాళి చేస్తారు, ఇదొద్దు ఇంకేదైనా కొనుక్కో".

"ఊహూ నేనిదే కొనుక్కుంటాను" బొమ్మను గట్టిగా పట్టుకొని చెప్పాడు.

"సరే నీ ఇష్టం" అందమ్మ.

అక్కడి నుండి కార్లు, విమానాలు వున్న వరుస దగ్గరకు వెళ్ళారు. అక్కడ అరలో వున్న మిలటరీ ట్రక్కు నొకదాన్ని చూపిస్తూ "పండూ, అది బావుంది కదూ" అంది ప్రత్యూష. ఈలోగా పక్కనుండి "హాయ్" అన్న పిలుపు వినిపించింది. పక్కకు తిరగ్గానే విలియమ్ కనిపించాడు పండుకు.

"హాయ్ విలియమ్" ప్రతిగా తనూ పలకరించాడు.

"డిడ్ యు ఫినిష్ యువర్ ప్రాజెక్ట్?" అడిగాడు విలియమ్.

"ఆల్మోస్ట్. వాట్ అబౌట్ యు?"

"ఐ యాం డన్....డు యు లైక్ మై న్యూ ట్రాన్స్ ఫార్మర్?" అడిగాడు చేతిలోని బొమ్మను చూపిస్తూ.

"కూల్" చెప్పాడు పండు.

పండు చేతిలోని బొమ్మను చూస్తూ "నైస్ డాల్. హూజ్ దట్ ఫర్?" అడిగాడు విలియమ్.

"ఫర్ మై కజిన్".

ఈలోగా విలియమ్ ను వాళ్ళ అమ్మ పిలవడంతో బై చెప్పి వెళ్ళిపోయాడు. పండు తన చేతిలోని బొమ్మను పక్కనే వున్న టేబుల్ మీద పెట్టేశాడు.

శనివారం మధ్యాహ్నం అమ్మ చేసిన పాస్తా తినేసి, హాల్లో కూర్చుని బ్లాక్స్ తో పడవ చేస్తున్న పండుకు "బుజ్జి పండూ...." అన్న అక్క పిలుపు వినిపించింది. పండు వెళ్ళే సరికి, గులాబి పువ్వున్న నీలం రంగు హెయిర్ బాండ్ సరిచేసుకుంటూ డ్రస్సర్ ముందు నిలబడి వుంది ప్రత్యూష. ముదురు నీలం రంగు మీద గులాబి రంగు పువ్వులున్న ఫ్రాక్, కాళ్ళకు గులాబి రంగు స్టాకింగ్స్ వేసుకుని తయారయిన అక్కను చూసి

"వై ఆర్ యు వేరింగ్ దట్?" అడిగాడు పండు.

"సాయంత్రం పార్టీ గురించి మర్చిపోయావా?" చేతికి ఉన్న బ్రేస్ లెట్ ను మురిపెంగా చూసుకుంటూ గుర్తుచేసింది. "ఈ డ్రస్ కి ఏ షూస్ బావుంటాయి పండూ?" క్లోజెట్ ఓపెన్ చేసి షూస్ చూపిస్తూ అడిగింది. అక్కడ కాఫీ రంగు, నలుపు, ఎరుపు, గులాబి రంగుల్లో రకరకాల షూస్, ఇంకా బంగారం అద్దినట్లు మెరుస్తున్న చెప్పులు, మోకాళ్ళ వరకూ వుండే బూట్స్ వరుసగా పెట్టున్నాయి. వాటిలో ఎర్రగా వున్న షూస్ చూపించాడు. "నా...అవి మాచ్ అవ్వవు. ఈ పింక్ వి వేసుకుంటాను" అంటూ వాటిని బయటకు తీసింది.

అమ్మ కోసం హాల్లో, వంటగదిలో, భోజనాల గదిలోనూ వెతికాడు పండు. ఎక్కడా కనిపించక పోవడంతో చివరకు పడక గదిలోకి వెళ్ళాడు. మంచం మీద కూర్చుని గాజులు వేసుకుంటూ ఉంది వైష్ణవి. పక్కనే నిలబడి అమ్మ వైపు పరీక్షగా చూశాడు. నారింజ రంగు చీరలో చేతి నిండుగా అవే రంగు గాజుల వేసుకుని చాలా డిఫరెంట్ గా కనిపించింది.

"అమ్మా ఎవరెవరు వస్తున్నారు పార్టీకి?" అడిగాడు.

"నీ ఫ్రెండ్స్ చాలా మంది వస్తున్నారు నాన్నా" అంటూ గాజులు వేసుకోవడం అయిపోవడంతో మంచం మీద వున్న ఖాళీ నగల పెట్టెలు తీసి సొరుగులో పెట్టింది.

"శైలేష్ వస్తున్నాడా?" అడిగాడు.

"ఆ... శైలేష్ కూడా వస్తున్నాడు. నువ్వు కూడా రెడీ అయితే, మనం త్వరగా వెళ్ళి నీ ఫ్రెండ్స్ తో చాలా సేపు ఆడుకోవచ్చు" చెప్పింది వైష్ణవి.

పండు తన గదిలోకి వెళ్ళగానే మంచం మీద జీన్స్ పాంట్, షర్ట్ కనిపించాయి. క్లోజెట్ తలుపు తెరిచి అక్కడ వరుసగా హాంగర్లకు తగిలించి వున్న చొక్కాల్లో నుండి పువ్వుల చొక్కా తీసి వేసుకుని, అద్దంలో చూసుకుంటూ చేత్తో జుట్టు సరిచేసుకుని వచ్చి అమ్మ ఎదురుగా నిలబడ్డాడు.

"మంచం మీద తీసిపెట్టిన బట్టలు వేసికోలేదేం?" అడిగింది వైష్ణవి.

"ఆ చొక్కా మీద గీతలు తప్ప ఏమీ లేవు. ఆ చొక్కా రంగు కూడా తెల్లగా....ఏం బాలేదు." అన్నాడు.

"సరే...వెళ్ళి నాన్నను పిలిచిరా... బయలుదేరుదాం" చెప్పింది. పండు హాల్లోకి వెళ్ళే సరికి ప్రసాద్ టివి చూస్తూ ఉన్నాడు.

"నాన్నా త్వరగా డ్రస్ చేసుకో మనం పార్టీకి వెళ్దాం" తొందర పెట్టాడు.

"నేనెప్పుడో తయారయ్యాను... ఏం ఈ డ్రస్ బాగా లేదా?" తన షర్టు వైపు చూసుకుంటూ నవ్వుతూ అడిగాడు. నాన్న వేసుకున్న నిలువు గీతలున్న లేత నీలం రంగు చొక్కా, నల్ల పేంటు చూస్తూ తల అడ్డంగా నిలువుగా కాకుండా, మధ్య రకంగా వూపాడు పండు.

పార్టీ హాల్ లోపలకు వెళ్ళగానే తన ఫ్రెండ్స్ కోసం చూస్తూ హాలంతా తిరిగాడు. రంగు రంగుల బెలూన్స్ తో, స్ట్రీమర్స్ తో అలంకరించిన పార్టీ హాల్ చాలా నచ్చింది పండుకు. ప్రతి టేబుల్ మీద ఒక చిన్న ఫ్లవర్ వాజ్, దానిలో వున్న ఎర్ర గులాబీలు కూడా చాలా నచ్చాయి అతనికి. ఒక్కో టేబుల్ దాటుకుంటూ చివరకు వెళ్ళేసరికి కొంతమంది పిల్లలు పూసలతో బ్రేస్ లెట్స్, బాక్ పాక్ చెయిన్స్ చేస్తుండడం కనిపించింది. అక్కడి నుండి చూస్తే దూరంగా వైష్ణవి, ఆమె స్నేహితులు కనిపిస్తున్నారు. వాళ్ళను చూస్తుంటే పండుకు రంగురంగుల లైట్లతో వెలిగిపోతూ, బోలెడన్ని ఆర్నమెంట్స్ తో అలంకరించిన క్రిస్మస్ ట్రీ గుర్తొచ్చింది. ఈలోగా 'బెలూన్ మాన్' రావడంతో ఉత్సాహంగా అతని దగ్గరకు వెళ్ళాడు పండు.

పనీర్ చపాతి, కేక్ తినేసి కోక్ తాగుతూ, బెలూన్ మాన్ చేసిచ్చిన కోతి బొమ్మ పట్టుకుని, ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు పండు. వేదిక దగ్గరనుండి "వరవీణా మృదుపాణి..." అంటూ పిల్లలు పాడుతున్న పాట వినిపిస్తోంది. "తాం..ధిత్తోం.." అని వినిపించగానే వెనక్కి తిరిగి ఆ నాట్యం పూర్తయిన దాకా కళ్ళార్పకుండా చూశాడు పండు. పండుకు డాన్స్ అంటే చాలా ఇష్టం. పోయిన ఏడాది భరతనాట్యం నేర్చుకోవాలని టీచర్ దగ్గరకు వెళ్తే "ఇప్పుడు నేర్పిస్తే అమ్మాయిల్లా నడకా, వయ్యారం వచ్చేస్తాయి. అంత ఇష్టంగా ఉంటే పదిహేనేళ్ళ తరువాత నేర్పిద్దాం" అనేశారు టీచర్. ఆ మాటలు ఇప్పుడెందుకో గుర్తొచ్చాయి పండుకు.

"పండూ...ఇక వెళదాం నాన్నా నీ ఫ్రెండ్స్ కి బై చెప్పు" పండు దగ్గరకు వచ్చి చెప్పాడు ప్రసాద్. బుజ్జి పండుకు అప్పుడే ఇంటికి వెళ్ళాలని లేదు.

"శైలేష్ వాళ్ళింటికి వెళ్ళి , కొంచెం సేపు ఆడుకుని వెళ్దాం నాన్నా".

"ఇవాళ కాదులే నాన్నా. ఇంకోసారెప్పుడైనా వెళ్దాం."

"ప్లీజ్...కెన్ యు అల్ కం టు మై హౌస్" శైలేష్ కూడా అడిగాడు.

"ఇంటి దగ్గర చాలా పనుంది నాన్నా....రేపు పూజకు ఎలాగూ మీరు మా ఇంటికి వస్తున్నారుగా! అప్పుడు చాలాసేపు ఆడుకుందురు గాని" సర్ది చెప్పింది వైష్ణవి.

"పోనీ పండును మా ఇంటికి తీసుకెళతాను. రేపెలాగూ మీ ఇంటికి పూజకు వస్తాంగా అప్పుడు తీసుకొస్తాం" చెప్పాడు జగదీష్. అలాగే అని ప్రసాద్ ఒప్పుకోగానే "ఎస్" అనుకున్నాడు పండు.

"వేర్జ్ యువర్ బ్రదర్?" శైలేష్ వాళ్ళింటికి వెళ్ళగానే అడిగాడు పండు.

"హిజ్ అప్ స్టేర్స్" అంటూ మేడ పైకి తీసుకెళ్ళాడు శైలేష్. శైలేష్ వాళ్ళమ్మమ్మ బాబును అప్పుడే క్రిబ్ లో పడుకోబెడుతూ వుంది. బుజ్జి బుజ్జి కాళ్ళు చేతులు కదిలిస్తూ, బోసి నోటితో నవ్వుతున్న చిన్నబాబు చాలా అందంగా కనిపించాడు పండుకు. ప్రత్యూష కూడా వచ్చి వుంటే బావుండేదనుకున్నాడు. గదిలోంచి బయటకు వచ్చేప్పుడు మాత్రం, పండుకెందుకో లేత గులాబి రంగులో అందంగా ఉన్న కరీనా వాళ్ళ బుజ్జి చెల్లెలి గది గుర్తొచ్చింది. ఆ రోజంతా శైలేష్ తో కార్ రేసులు, వీడియో గేమ్స్ ఆడాడు. రాత్రి పడుకునేప్పుడు, రోజూ కథ చెప్పే నాన్న గుర్తొచ్చాడు పండుకు.

మరుసటి రోజు "ఇక బయలుదేరుదాం, షూస్ వేసుకోండి" అని జగదీష్ చెప్పినప్పుడు అప్పుడే మధ్యాహ్నం అయిందా అనుకున్నాడు పండు. కారు డ్రైవ్ వే లో ఆగిన వెంటనే కిందకు దూకి పరుగెత్తుకుంటూ వెళ్ళి కాలింగ్ బెల్ కొట్టాడు. తలుపు తెరుచుకోగానే, తీసిందెవెరో కూడా చూడకుండా "అక్కా... అక్కా..." అని పిలుస్తూ ఇంట్లోకి వెళ్ళిన పండుకు పట్టులంగా, జాకెట్ వేసుకుని, చేతినిండా గాజులతో, దేవుడి గదిలోనుండి బయటకు వస్తూ కనిపించింది ప్రత్యూష.

"వావ్ గోల్డ్ బెల్ట్, ....బట్, ఇదేంటి బెల్ట్ డ్రస్ పైన పెట్టుకున్నావు?" వచ్చిన విషయం మరచిపోయి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇది... అమ్మమ్మ పంపించింది. దీన్ని ఇలాగే పెట్టుకోవాల్ట" చెప్పింది.

"ప్రత్యూషా...ఎవరొచ్చారో చూడు" అన్న పిలుపు వినిపించగానే, అక్కను వెతుక్కుంటూ ఎందుకొచ్చాడో గుర్తొచ్చింది పండుకు. ప్రత్యూష చెయ్యి పట్టుకుని బాబు దగ్గరకు తీసుకొచ్చాడు. చిన్నబాబు చేయి పట్టుకుని మెల్లగా ఊపుతున్న ప్రత్యూష అరచేతి మీద ఎర్రని గీతలు చూసి

"అక్కా... వాట్స్ దట్?" ఆశ్చర్యంగా అడిగాడు.

ప్రత్యూష నవ్వి "అమ్మ, గోరింటాకు పెట్టింది. బావుందా?" రెండు అరచేతులూ దగ్గరగా పెట్టి చూపించింది.

"చాలా బావుంది" చెప్పి, రయ్యిన పరిగెత్తుతూ అమ్మ దగ్గరకెళ్ళి "అమ్మా, నాక్కూడా గోరింటాకు పెట్టవా?" అనడిగాడు పండు.

"అది మొగపిల్లలు పెట్టుకోరు నాన్నా" అని చెప్పి "సరే...పూజకు వేళవుతోంది, త్వరగా స్నానం చేసి అమ్మమ్మ పంపిన కొత్త బట్టలు తీసి పెట్టాను, అవేసుకుని రా" అంటూ తొందర పెట్టింది.

పండు తన గదిలోకి వెళ్ళే సరికి మంచం మీద కుర్తా పైజమా కనిపించాయి కాని, గోల్డ్ బెల్ట్ కనిపించలేదు. త్వరత్వరగా స్నానం చేసి బట్టలు వేసుకుని అమ్మ దగ్గరకు వచ్చి..

"అమ్మా నా గోల్డ్ బెల్ట్ ఇవ్వు" అన్నాడు.

"గోల్డ్ బెల్టా....గోల్డ్ బెల్టేమిటి?"

"అక్క వేసుకుంది కదా....అలాంటిది" గుర్తు చేసాడు పండు.

"అది గోల్డ్ బెల్ట్ కాదు నాన్నా.... దాన్ని 'వడ్డాణం' అంటారు. అది ఆడపిల్లలే పెట్టుకుంటారు" చెప్పింది వైష్ణవి. ఈ సంభాషణంతా వింటున్న వైష్ణవి స్నేహితులు ఫక్కుమని నవ్వారు. పండు చిన్నబుచ్చుకుని అక్కడ నుండి తన గదిలోకి వెళ్ళి పోయాడు. పూజ పూర్తయి హారతి కోసం పిలిచేవరకూ, శైలేష్ తో గదిలోనే ఆడుకుంటూ ఉండి పోయాడు. హారతిచ్చాక, వైష్ణవి ఆడవాళ్ళందరకూ బొట్టు పెట్టి ఒక్కో పాకెట్ ఇస్తుంటే, పిల్లలకైతే బర్త్ డేకి పెద్దవాళ్ళకు పూజలప్పుడు గుడీ బేగ్ ఇస్తారన్నమాట...అనుకున్నాడు పండు.

బుజ్జిపండు, శైలేష్ కొద్దిసేపు పెరట్లో ఆడుకుని లోపలకు వచ్చేప్పటికి ప్రత్యూష ఎక్కడా కనిపించలేదు. తన కోసం వెతుకుతూ గెస్ట్ రూమ్ దగ్గరకు రాగానే "నీ కూతురు మహాలక్ష్మిలా ఉంది వైష్ణవీ.... ఎంతైనా, ఇంట్లో ఆడపిల్ల వుంటే ఆ కళే వేరు" అని శైలేష్ వాళ్ళ అమ్మమ్మ అనడం వినిపించింది.

లోపలకు వెళ్ళకుండానే "అక్కా...అక్కా, వుడ్ యు లైక్ టు ప్లే విత్ అజ్?" అని కొంచెం గట్టిగా పిలిచాడు పండు .

ఆ మాటలు విన్న జగదీష్ "నిన్నటి నుండి ఆడుతూనే ఉన్నార్రా కాసేపిలా రండి" అని పిల్లల్ని పిలిచాడు. పిల్లలు ముగ్గురూ హాల్లోకి వెళ్ళి బుద్దిగా సోఫాలో కూర్చున్నారు. వాళ్ళ స్కూల్ గురించి అడగడం మొదలు పెట్టాడు జగదీష్. ఆ కబుర్లలో, కిందటి వారం స్కూల్లో జరిగిన కెరీర్ డే గురించి చెప్పారు పిల్లలు.

"మీకే ప్రొఫెషన్ అంటే ఇష్టం... పెద్దయ్యాక మీరేమవ్వాలనుకుంటున్నార్రా?" అడిగాడు జగదీష్.

శైలేష్ పైలెట్ అవుతానన్నాడు... ప్రత్యూష డాక్టర్ అవుతానన్నది. వాళ్ళ మాటలు వింటూ మౌనంగా ఉండిపోయాడు తప్ప తన గురించి ఏమీ చెప్పలేదు బుజ్జిపండు.



కౌముది

"నువ్వేం అవుతావు పండూ?" అడిగాడు జగదీష్.

"నేను... షాప్ ఓనర్ ని అవుతానంకుల్" మెల్లగా చెప్పాడు పండు.

"షాపా...ఓ..బిజినెస్ అన్నమాట. బావుంది బావుంది...ఇంతకీ ఏ షాప్ పెడతావు?"

"బాయ్స్ ఆల్" చెప్పాడు పండు.

"బాయ్స్ అల్... ఏముంటాయ్ అందులో?" ఆశ్చర్యంగా అడిగాడు జగదీష్. మిగిలిన వారు ఆసక్తిగా వింటున్నారు.

"మంచి డిజైన్స్ లో బుక్ కవర్స్, బైండర్స్, బాక్ పాక్స్, కలర్స్ కలర్స్ షూస్, టాయ్ కిచెన్, టాయ్ డిషెస్, బేబి డాల్స్, బాయ్స్ పెట్టుకొనే గోరింటాకు, గోల్డ్ బెల్లు, డిఫెరెంట్ మోడల్ డ్రెస్సెస్ ఫర్ బోయ్స్.... ఇంకా.... ఆ షాపులో 'బోయ్స్ ని విష్ణు మూర్తిలా వున్నావని' చెప్పాలనే పుస్తకాలు కూడా ప్రింట్ చేయిస్తా" సీరియస్ గా చెప్పేసి శైలేష్ తో కలసి ఆడుకోవడానికి వెళ్ళిపోయాడు పండు.

●●●

# స్పెల్లింగ్ బీ

రోడ్డు పక్కగా ఆగిన స్కూల్ బస్ దిగి ఇంటివైపు అడుగులు వేసారు బుజ్జిపండు, ప్రత్యూష. ఎడం పక్కనున్న రెండో ఇంటి లాన్లో గంతులు వేస్తున్న జూలీ వీళ్ళను చూసి సంతోషం వ్యక్తం చేస్తూ తోక ఊపింది. బుజ్జిపండు అటువైపు పరిగెత్తబోయి, ఆ ఇంటివారెవరూ లేకపోతే వాళ్ళ లాన్ లోకి వెళ్లకూడని వాళ్ళమ్మ చెప్పిన విషయం గుర్తొచ్చి హాయ్ జూలీ అంటూ దూరం నుండే చెయ్యి ఊపాడు. వీధి మలుపు తిరగ్గానే వరండాలో నిలబడి ఇటువైపే చూస్తున్న వైష్ణవి కనిపించింది. పండు పరిగెత్తుకుంటూ వచ్చి బేగ్ వైష్ణవి చేతిలో పెట్టి "మామ్ ఐ నీడ్ టు గో టు ది రెస్ట్ రూమ్" అంటూ హడావిడిగా లోపలకు పరిగెత్తాడు.

రెస్ట్ రూమ్ కి వెళ్ళిన పని పూర్తవగానే ప్యాంటు పైకి లాగి బటన్ పెట్టుకుని చేతిని సోప్ డిస్పెన్సర్ కింద పెట్టి గట్టిగా నొక్కాడు పండు. లేతనీలం రంగు సబ్బు చుక్కలు చుక్కలుగా అరచేతిలో పడింది. కుళాయి తిప్పి వేడి నీళ్ళలో చేతులు కడుగుతూ అద్దంలో చూసుకున్నాడు. జుట్టు కొంచెం నుదుటి మీద పడుతూ వుంది. తడి చేత్తో జుట్టు పైకి తోసాడు, రెండు పాయలు నిటారుగా నిలబడ్డాయి. నిన్న టివిలో చూసిన జాక్సన్ స్పైక్స్ గుర్తొచ్చాయి వాడికి. జాగ్రత్తగా కొంచెం కొంచెం జుట్టు పైకి లేపుతూ స్పైక్స్ చేసాడు.

" పండూ త్వరగా రా? " అమ్మ గొంతు వినిపించింది. హాండ్ టవల్ తీసుకుని తల తుడుచుకుని కొళాయి ఆపేసి బయటకు వచ్చాడు. షూస్ విప్పి స్టాండ్ లో పెట్టి వంటగదిలోకి వచ్చి అక్క పక్కనున్న బార్ స్టూల్ మీద కూర్చున్నాడు. పిల్లలిద్దరికీ మధ్యాహ్నం చేసిన బ్రౌనీలు ప్లేట్లో పెట్టి ఇచ్చింది వైష్ణవి.

"అమ్మా టుడే ఇన్ మై క్లాస్..." అంటూ పండు కబుర్లు మొదలు పెట్టగానే వైష్ణవి తెలుగులో చెప్పమని గుర్తుచేసింది.

"ఫైర్ ఫైటర్ వచ్చాడు" అంటూ వాక్యం పూర్తిచేసాడు.

"ఎందుకు నాన్నా... మీ స్కూల్లో ఫైర్ వచ్చిందా?"

"ఇవాళ కెరీర్ డే కదా! ఇంకా కెప్టన్, లాయర్ కూడా వచ్చారు. యు నో వాట్ వాళ్ళందరూ మా ఫ్రెండ్స్ పేరెంట్స్".

"వచ్చి ఏం చేశారు నాన్నా?" రెండు కప్పుల్లో పాలు పోసి చాక్లెట్ పౌడర్ కలిపి పిల్లల దగ్గర పెడుతూ అడిగింది.

"వాళ్ళ జాబ్స్ గురించి చెప్పారు. ఫైర్ ఫైటర్స్ కి అస్సలు స్లీప్ ఉండదట. రాత్రంతా అలా ఫైర్ ప్రూఫ్ జాకెట్లు వేసుకునే వుంటార్ట. నిద్రొస్తే కూడా అలా స్టాండింగ్ పొజిషన్ లోనే స్లీప్ చేస్తార్ట. ఫైర్ స్టేషన్ కి కాల్ రాగానే ట్రక్ లో ఎక్కి రయ్యని వెళ్ళిపోతార్ట. ఇంకా వాళ్ళు డిన్నర్ కూడా నిలబడే చేస్తార్ట." కళ్ళు పెద్దవి చేసి చెప్పాడు.

"అబ్బో అయితే ఆ జాబ్ చాలా కష్టమే. కాని వాళ్ళు ఎంత మందిని సేవ్ చేస్తారో చూడు, రియల్లీ గ్రేట్ కదా!"
"వాళ్ళకు బోలెడు సాటిస్ ఫాక్షన్ ఉంటుందటమ్మా. పెద్దైతే నేను ఫైర్ ఫైటర్ అవుతా." అంటూ కుర్చీ దిగి పైపుతో నీళ్ళు కొడుతున్నట్లుగా యాక్షన్ చేస్తూ ఇల్లంతా తిరగడం మొదలెట్టాడు. వాడి మాటలకు అమ్మకు నవ్వొచ్చింది. పండును చిన్నప్పుడు ఎవరైనా "పెద్దయ్యాక నువ్వేం అవుతావని" అడిగితే "అక్కవుతా" అనేవాడు. అప్పట్లో అక్కంటే అంత అరాధన వాడికి, ప్రత్యూష చేసే పనులన్నీ చేసేవాడు. ఆ తరువాత ఆకాశంలో ఎగిరే పక్షిని చూసి "పక్షౌతా" అనేవాడు, తరువాత 'ఆస్ట్రోనాట్', ఆ తరువాత 'టీచర్', ఇప్పుడేమో ఫైర్ ఫైటర్.

"ఫైర్ ఫైటర్ అవ్వాలంటే బోలెడు బలముండాలి, నువ్వీ పాలు తాగావనుకో నీకు చాలా బలమొస్తుంది " అని పండుతో చెప్పింది వైష్ణవి. పండు వచ్చి కూర్చోగానే తల తడిగా వుండడం గమనించి "తల తడుపుకున్నావా? " తల మీద చెయ్యి పెట్టి చూస్తూ అడిగింది.

"నేను వెట్ చెయ్యలా...అదే వెట్ అయ్యింది. " అమ్మ చెయ్యి తీసేస్తూ చెప్పాడు.

"ఎలా తడిచింది? "

"ఇందాక పైప్ తో ఫైర్ ఆఫ్ చేసాను కదా అప్పుడు తల మీద నీళ్ళు పడ్డాయి. "

"హౌ కం పండూ..యు వర్ జస్ట్ ప్రిటెండింగ్ " ఆశ్చర్యపోయింది ప్రత్యూష.

"ఫైర్ ఫైటర్స్ కి అలాగే తడుస్తుంది " ప్లేట్లో బ్రౌనీ వంక చూస్తూ చెప్పాడు.

అమ్మ నవ్వి " చిట్టితల్లీ ఏం చెప్పారు నాన్నా స్కూల్లో? " అని ప్రత్యూషను అడిగింది.

"నథింగ్"

"అసలేం చెప్పలేదా?"

"యూజువల్ స్టఫ్"

"అంటే?"

"అమ్మా...యు ఆర్ అస్కింగ్ టూమెని క్వొశ్చన్స్"

ఆ పూటకింకేమీ చెప్పదని అర్థమై, సర్లే ముందు పాలు తాగు గుర్తు చేసింది వైష్ణవి.

"దు ఐ హేవ్ టు డ్రింక్ మిల్క్ ఎవ్రీ డే?"

"యస్ అక్కా, యు హేవ్ టు డ్రింక్ " కప్పు పైకెత్తి పట్టుకుని తాగుతూ చెప్పాడు పండు.

"పోయినసారి వెల్ నెస్ విజిట్ కి వెళ్ళినప్పుడు.... " అంటూ వైష్ణవి మొదలెట్టగానే

"ఐ నో....బట్ ఐ హేట్ మిల్క్" విసుగ్గా మొహం పెట్టి పాలు తాగడం మొదలుపెట్టింది ప్రత్యూష.

పండు పాలు తాగేసి ఖాళీ కప్పును సింక్ లో పెట్టి వచ్చాడు.

"ఇవాళ మీకేం క్లాసులు లేవుగా... కొంచెం సేపు పార్క్ లో ఆడుకుని రండి".

"ఫస్ట్ ఐ వాంటు వాచ్ కార్టూన్, దెన్ ఐ ఇల్ గో టు ద పార్క్" రిమోట్ చేతిలోకి తీసుకుంటూ చెప్పాడు పండు.

"ఐ హేవ్ లాట్స్ ఆఫ్ హోం వర్క్" అంటూ స్కూల్ బాగ్ తీసింది ప్రత్యూష. అమ్మ ఆడుకోమంటే హోం వర్క్ చేస్తానంటున్న అక్కను చూస్తే బోలెడు ఆశ్చర్యం వేస్తుంది వాడికి.

కార్టూన్ చూసేప్పటికి చీకటి పడిపోతుంది. "ముందు పార్కు కు వెళ్ళిరా  తర్వాత కార్టూన్" అని వాడి చేతిలోని రిమోట్ తీసుకుంది వైష్ణవి.

పండు బయటకు రాగానే విలియం కనిపించాడు. ఇద్దరూ పరిగెత్తుకుంటూ పార్క్ దగ్గరకు వెళ్ళేసరికి స్టీవెన్, మోనికా, జాన్ ఇంకా అక్కడ చాలా మంది పిల్లలు ఆడుకుంటున్నారు. పండు నేరుగా జారుడు బల్ల దగ్గరకు వెళ్ళి మెట్ల మీదుగా

పైకెక్కి వంకలు తిరిగి పాములా ఉన్న ఆ బల్ల మీదనుండి తలక్రిందులుగా కిందకు జారాడు. అలా జారుతూ ఆకాశాన్ని చూడడమంటే చాలా ఇష్టం వాడికి. పక్క స్లైడ్ మీద స్టీవెన్ జారుడుబల్ల మీదనుండే పైకెక్కడం చూసి తను కూడా అలానే ఎక్కాలని ప్రయత్నిస్తుండగా, పైనుండి ఎవరో " హలో... " అనడంతో హడావిడిగా కిందకు జారి దూరంగా నిలబడ్డాడు. ఆ తరువాత మంకీ బార్స్ దగ్గరకు వెళ్ళి పైనున్న ఇనుప కమ్మీ అందిపుచ్చుకుని ఒక్కో కమ్మీ మార్చి మార్చి పట్టుకుంటూ ఆ చివర నుండి ఈ చివరకు వేగంగా వెళ్ళాడు. అలా రెండు సార్లు చేసి కిందకు దూకి ఎర్రగా కందిన అరచేతులను చూసుకున్నాడు. రెండు నిముషాలయ్యాక మళ్ళీ పైకెక్కి ఈ సారి కాళ్ళతో ఇనుప కమ్మీలు పట్టుకుని తల కిందులుగా వెళ్ళాడాడు. అక్కడి నుండి చూస్తే దూరంగా వాళ్ళమ్మ రావడం కనిపించింది. ఆవిడ దగ్గరకు రాగానే పిలిచి తన కొత్త విన్యాసం చూపించాడు. భలే చేస్తున్నావు పండూ. గుడ్ జాబ్ మెచ్చుకుంది వైష్ణవి. ఓ పదినిముషాలు అయ్యేక "చీకటి పడుతోంది ఇక ఇంటికి వెళ్దాం నాన్నా " అని అమ్మ పిలవడంతో "వన్ మినిట్ అమ్మా " అంటూ చివరిసారిగా జారుడు బల్ల మీద నుంచి జారి వచ్చి అమ్మతో కలసి ఇంటి దారి పట్టాడు.

"ఎవరైనా ఫోన్ చేశారా తల్లీ? " ఇంటికి రాగానే ప్రత్యూషను అడిగింది వైష్ణవి.

"సం బడీ కాల్డ్, బట్ ఐ డిడింట్ ఆన్సర్"

"దట్స్ బాడ్ మానర్స్, ఎస్టర్ డే వెన్ ద ఫోన్ రేంగ్ అమ్మా స్కోల్డెడ్ యు 'పక్కనే ఉండి ఫోన్ తియ్యవేంరా' బట్ టుడే యు డిడ్ ద సేం థింగ్" కోపంగా చెప్పాడు పండు.

"నేనే తియ్యొద్దన్నాను పండూ" అక్కనే సమర్థించిందమ్మ.

"సీ..." అంటూ నాలుక బయటపెట్టి తమ్ముడ్ని వెక్కిరించింది ప్రత్యూష.

నిన్ననే ఫోన్ తియ్యలేదని అక్కను తిట్టి, ఇవాళ తనే ఫోన్ ఎందుకు తియ్యొద్దన్నదో ఏమీ అర్థం కాలేదు పండుకు. "సం టైమ్స్ దీజ్ అడల్ట్స్ ఆర్ సో వియర్డ్" అనుకున్నాడు.

"ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేనే అక్కను తలుపు తీయ్యొద్దని, కనీసం ఫోన్ మోగినా కూడా ఆన్సర్ చెయ్యొద్దని చెప్పాను నాన్నా " చెప్పింది వైష్ణవి.

"ఫోన్ ఆన్సర్ చేస్తే ఏమౌతుంది? "

"పిచ్చోళ్ళకు ఇంట్లో చిన్నపాప ఒక్కర్తే ఉందని తెలిసిపోతుంది కదా! అందుకు. సరే...మీరిద్దరూ వెళ్ళి స్నానాలు చేసిరండి, అన్నం పెడతాను." తొందర పెట్టింది వైష్ణవి.

"గివ్ మీ డిన్నర్ ఫస్ట్. దెన్ ఐ ఇల్ టేక్ బాత్" అంటూ పండు కూర్చీ ఎక్కేశాడు.

"బయటంతా ఆడుకునొచ్చి చేతులు కూడా కడుక్కోకుండా అన్నం పెట్టమంటావా, యాక్కీ... ముందు స్నానానికి పద." పండును కుర్చీలోంచి కిందకు దించిందమ్మ.

"రైస్ అగైన్...కెన్ ఐ హేవ్ సంథింగ్ ఎల్స్ ఫర్ డిన్నర్" ప్రత్యూష నిరసన వ్యక్తం చేసింది.

"మధ్యాహ్నం ఏదో ఒకటి తింటారు. కనీసం సాయంత్రమన్నా అన్నం తినకపోతే ఎలా?"

"ఎవ్రీ డే యు మేక్ రైస్, ఇట్స్ బోరింగ్" పండు కూడా అక్కకు సాయం వచ్చాడు.

"పోనీ చపాతి చెయ్యనా? మీరు స్నానం చేసేలోగా చేసేస్తాను." అంటూ గోధుమపిండి డబ్బా అరలోనుండి తీసింది.

"ఐ డోన్ట్ లైక్ ఇండియన్ ఫుడ్" విషయం మరింత సూటిగా చెప్పేసింది.

"మీ టూ" అక్కకు వంత పాడాడు. .

"రేపు పాస్తా చేస్తాలే. నాన్న వచ్చే టైం అయింది పాపం బోలెడు ఆకలితో వస్తారు, స్నానం చేసి త్వరగా వచ్చేయండి" అంటూ వైష్ణవి చపాతీలకు పిండి కలపడం మొదలెట్టింది.

పండు స్నానం చేసి ఏరోప్లేన్ బొమ్మలున్న తెల్ల నైట్ డ్రస్ వేసుకుని హాల్లోకి వచ్చేసరికి మెయిల్ చూస్తున్న ప్రసాద్ కనిపించాడు. హాయ్ నాన్నా అంటూ వచ్చి ప్రసాద్ ఒళ్ళో కూర్చున్నాడు. డిన్నర్ రెడీ అంటూ వైష్ణవి పిలవడంతో ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళారు. ప్రత్యూష అప్పటికే టేబుల్ దగ్గర కూర్చుని ఉంది.

"ఇవాళ అన్నం వండలేదా? " డబ్బాలోని చపాతీలు చూస్తూ అడిగాడు ప్రసాద్.

"అన్నం కూడా వండాను. పిల్లలు రోజూ అన్నమేనా... అంటే వాళ్ళకోసం చేపతీలు చేసాను. వీళ్ళ వయసులో రోజుకు మూడు పూటలా మనం అన్నమే తినేవాళ్ళం. వీళ్ళకు రెండు రోజులు వరుసగా అన్నం తినడమంటే కష్టం. " పండు ప్లేట్లో చెపాతీలు పెడుతూ చెప్పింది వైష్ణవి.

"మీ అమ్మకు పాస్తా, పిజ్జా, బర్గర్, బొరిటో ఇవేమీ చెయ్యడం రాదా? " ప్రత్యూష సందేహం.

"మీ అమ్మ అనకూడదు నాన్నా, అమ్మమ్మ అనాలి " సరిదిద్దాడు ప్రసాద్.

"అమ్మమ్మకు అలాంటివి చెయ్యడం రాదు " చెప్పింది వైష్ణవి.

అమ్మ వైపు జాలిగా చూస్తూ పూర్ అమ్మ అనుకున్నాడు పండు.

"ఏం చేశార్రా ఇవాళ స్కూల్లో" ప్లేట్లో అన్నం వడ్డించుకుంటూ అడిగాడు ప్రసాద్.

పండు ఫైర్ ఫైటర్ కథ మొదటినుండి మళ్ళీ చెప్పాడు. ప్రత్యూష తన క్లాస్లో జరిగిన స్పెల్లింగ్ బీ గురించి చెప్తూ తనకందులో ఫస్ట్ ప్లేస్ వచ్చినట్లు చెప్పింది. అమ్మ, నాన్న ప్రత్యూషను అభినందించారు.

"స్కూల్ స్పెల్లింగ్ బీ ఎప్పుడుంటుంది నాన్నా?" ప్రత్యూషకు కూర వడ్డిస్తూ అడిగింది వైష్ణవి.

"ఇట్ విల్ బి ఇన్ ఎ మంత్. మై టీచర్ గేవ్ మీ థౌజండ్ వోర్డ్స్ టు స్టడి"

"పండూ మీ క్లాస్లో కూడా స్పెల్లింగ్ బీ జరిగిందా?" అడిగింది వైష్ణవి.

"ఏ...స్" పళ్ళెం లోకి చూస్తూ చెప్పాడు.

"నువ్వేలా చేశావ్ నాన్నా?" ఈ సారి ప్రశ్న ప్రసాద్ దగ్గర్నుండి.

"నాక్కూడా ఫస్ట్ ప్లేస్ వచ్చింది" మెల్లగా చెప్పాడు పండు. తల్లిదండ్రులిద్దరూ ఆశ్చర్యంగా మొహమొహాలు చూసుకున్నారు.

"ఫస్ట్ ప్లేస్ వస్తే ఆ విషయం ఇప్పటివరకు చెప్పలేదేం?"

"ఐ డోంట్ వాంట్ ఫస్ట్ ప్లేస్. దట్స్ వై ఐ డోంట్ వాంటు టెల్ యు." స్థిరంగా చెప్పాడు.

"ఎందుకని నీకు హాపీగా లేదా?" అయోమయంగా అడిగింది వైష్ణవి.

"నో.... ఐ డోంట్ వాంటు రీడ్ దోజ్ బోరింగ్ థౌజండ్ వోర్డ్స్. బట్, యు వోంట్ లిజన్. ఎనీవే యు ఆర్ గోన మేక్ మి స్టడీ అల్ దోజ్ డంబ్ వోర్డ్స్." మనసులో మాట చెప్పేసాడు పండు.

వైష్ణవి కోపంగా చూసింది. ప్రసాద్ వైష్ణవిని మాట్లాడొద్దన్నట్లుగా సైగ చేయండం పండు గమనించకపోలేదు. భోజనాలు ముగిశాక ప్రత్యూష సంగీత సాధన చేసి, స్పెల్లింగ్స్ చదువుతూ కూర్చుంది, పండు కొంచెం సేపు కార్టూన్ చూసి హోం వర్క్ చేశాడు.

ఆ రాత్రి పడుకునేప్పుడు పండుకు కథ చదివాక "నీకు స్పెల్లింగ్స్ అంటే ఇష్టం లేదా నాన్నా" అడిగాడు ప్రసాద్.

"స్పెల్లింగ్స్ ఇష్టమే కాని చదవడం ఇష్టం లేదు".

"మరి చదివితేనే కదా నీకు వచ్చేది. బాగా చదివి స్కూల్లో ఫస్ట్ ప్లేస్ తెచ్చుకున్నావనుకో అప్పుడు నీకందరూ వరుణ్ కి చెప్పినట్లుగా కంగ్రాట్స్ చెప్తారు. ఎంత సంతోషంగా ఉంటుందో చూడు" నచ్చచెప్పాడు ప్రసాద్. వరుణ్ పండుకంటే రెండేళ్ళు పెద్దవాడైనా, వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు. పోయినేడాది తనకు స్కూల్ స్పెల్లింగ్ బీలో ఫస్ట్ ప్లేస్ వచ్చింది.

"టుడే, హి డిడింట్ డు దట్ వెల్. హి లాస్ట్ ఇన్ ద ఫస్ట్ రౌండ్." చెప్పాడు పండు.

"అవునా ఎందుకూ టఫ్ వోర్డ్ వచ్చిందా?"

"కాదు నాన్నా వాడికి తెలిసీ చెప్పలేదట."

"ఎందుకూ?" ఆశ్చర్యపోయాడు నాన్న. పోయినేడాది వరుణ్ స్కూల్లోనే కాక కౌంటీ లెవల్లో కూడా బాగా చేశాడని పేపర్లో కూడా వేశారు. అలాంటిది ఎందుకలా చేశాడో నాన్నకు అర్థం కాలేదు.

"వాళ్ళమ్మ ఎవ్రీ డే స్పెల్లింగ్సే చదవమంటుందట. నో సాకర్, నో ప్లేయింగ్, నో కార్టూన్స్. ఐ డోంట్ వాంట్ టు దూ డట్. అ..ఆ.." తల అడ్డంగా తిప్పుతూ చెప్పాడు.

ప్రసాద్ కు సమస్య అప్పటికి అర్ధం అయింది. వరుణ్ వాళ్ళ అమ్మానాన్న ఇద్దరూ బాగా పోటీతత్వం వున్నవాళ్ళు. వాళ్ళ పిల్లలిద్దరూ అన్నిట్లోనూ ముందుండాలనుకుంటారు. దానికోసం పిల్లలను ఆట పాటలకు కూడా మానిపించేసి మరీ సాధన చేయిస్తారు. పర్యవసానం పిల్లలు ఉత్సాహంగా పాల్గొనే రంగాల్లో కూడా క్రమేణా ఆసక్తి తగ్గిపోతుందన్నమాట.

"నువ్వలా రోజంతా చదవక్కర్లేదు నాన్నా, నీ సాకర్, కార్టూన్స్ ఏమీ మానేయక్కర్లేదు కూడా. రోజుకో ట్వంటీ మినిట్స్ స్పెల్లింగ్స్ చదివితే చాలు." పండు జుట్టు సరిచేస్తూ చెప్పాడు నాన్న.

"నిఝంగానా" కళ్ళు పెద్దవి చేసి లేచి కూర్చుని అడిగాడు.

"నిజంగానే...అలా చదివి స్పెల్లింగ్ బీకి వెళ్ళు. నీకు ఏ ప్లేస్ వచ్చినా రాకపోయినా దట్ డజంట్ మాటర్, నువ్వు స్పెల్లింగ్స్ నేర్చుకోవడమే ముఖ్యం."

"డాడ్ యు ఆర్ ది బెస్ట్" అంటూ నాన్నను గట్టిగా కౌగిలించుకుని పడుకున్నాడు పండు.

●●●

# కల్చర్ అంటే!?

"భార్గవి ఆంటీ డాన్స్ ప్రోగ్రాం చేయిస్తున్నారట, నువ్వు కూడా పార్టిసిపేట్ చేస్తావని చెప్పాను పండూ" కొడుకుతో చెప్పింది భార్గవి.

"హూ ఎల్స్ ఆర్ డూయింగ్ ఇట్?"

"నీ ఫ్రెండ్స్ శైలేష్, ప్రవీణ్, అభి, స్వీటీ, యామిని"

"గాళ్స్ టూ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ... అమ్మయిలు కూడా"

"ఐ డోంట్ వాంట్ టు డాన్స్ విత్ గాళ్స్"

"అలా అనకూడదు నాన్నా, అందరూ కలసి చేస్తేనే బావుంటుంది."

"ఓ...కే" అయిష్టంగా ఒప్పుకున్నాడు.

శనివారం బుజ్జిపండు, వైష్ణవి, భార్గవి వాళ్ళ ఇంటికి వెళ్ళేసరికి మిగిలిన వాళ్ళు అప్పటికే వచ్చి వున్నారు.

"కిడ్స్, మీకోసం మంచి పాట సెలెక్ట్ చేశాను" చెప్పింది భార్గవి.

"ఈజ్ ఇట్ మహేష్ బాబూ'స్ సాంగ్?" అడిగింది రమ్య.

"ఇట్'స్ నాట్ మహేష్ బాబు'స్ సాంగ్, హిజ్ డాడ్'స్ సాంగ్"

"హో....." పిల్లలందరూ ఒక్కసారి నిట్టూర్చారు.

"కన్యాకుమారి మీనాకుమారి, నవారు మంచం నెల్లూరే, కెవ్వు కేక, రింగా రింగా ఈ పాటలన్నీ ఆల్రెడీ తీసేసుకున్నారట. అందుకని కొంచెం ట్రెండ్ మారుద్దామని పాత పాట సెలెక్ట్ చేసాను" అని పెద్దవాళ్ళతో చెప్పి, పిల్లల వైపు తిరిగి "ఇది చాలా బావుంటుంది, మీకా వీడియో చూపిస్తాను" అంటూ 'గుంతలకడి గుంతలకడి గుంతలకడి గుమ్మ' పాట యుట్యూబ్ లో పెట్టింది భార్గవి. పిల్లలో గంట డాన్స్ నేర్చుకున్నాక పండును తీసుకుని ఇంటికి బయలుదేరింది వైష్ణవి.

కారు ఆగిన వెంటనే కిందకు దూకి అక్కకోసం తుర్రున లోపలకు పరిగెత్తాడు పండు. తన గదిలో కూర్చుని హోమ్ వర్క్ చేస్తూ వుంది ప్రత్యూష.

"అక్కా అక్కా... గెస్ వాట్?" అంటూ ప్రత్యూష ఏమైనా చెప్తుందేమోనని ఆగాడు.

పుస్తకంలోనుంచి తల పైకెత్తి "వాట్ పండూ?" అంది.

"వు విల్ బి డాన్సింగ్ టుఎ సాంగ్."

"వాట్ సాంగ్?"

"ఆ...ఆ...ఐ ఫర్గాట్ ద సాంగ్, బట్ ఆల్ వుయ్ హావ్ టు డు ఈజ్ ఎక్సర్ సైజ్ అండ్ ఛేజింగ్ ది గాళ్స్"

"ఛేజింగ్ ద గాళ్స్...వాట్ కైండ్ ఆఫ్ డాన్స్ ఈజ్ దట్?" ఆశ్చర్యపోయింది.

"ఐ డోంట్ నో, ఇట్స్ ఫన్" భుజాలెగరేసాడు.

ప్రతి బుధవారం ఒక అరగంట ప్రాక్టీస్ ఒక గంట ఆటలు, శనివారం అయితే ఏకంగా మూడు నాలుగు గంటలు ఆటలే ఆటలు. పండుకు డాన్స్ ప్రాక్టీస్ లు చాలా నచ్చాయి.

"పండూ ఇవాళ డ్రెస్ రిహార్సిల్. ఈ డ్రెస్ వేసుకో" అంటూ నారింజ రంగు పేంటు, తెల్లని మాక్ నెక్ ఫుల్ హాండ్స్ టీ షర్ట్ ఇచ్చింది వైష్ణవి. ఆ షర్ట్ మీద అక్కడక్కడా ఆకుపచ్చరంగు అతుకులు వేసి దానిమీద తళుకులు అంటించి వున్నాయి. దాన్ని చూడగానే మొహం చిట్లించాడు పండు.

"ఐ డోంట్ లైక్ దిస్ డ్రెస్." అంటూ వాళ్ళ అమ్మ దగ్గరనుండి దూరంగా వెళ్ళాడు.

"డ్రస్ కలర్ ఫుల్ గా...ఇంత బావుంటే నీకెందుకు నచ్చలేదు?" అంటూ వాడి వెనకే వెళ్ళింది వైష్ణవి.

"అది చాలా వియర్డ్ గా వుంది. ఐ డోంట్ వాంట్ టు వేర్ ఇట్". సోఫా వెనుక దాక్కున్నాడు.

"చాలా బావుంది. వీడియోలో చూశ్శా ...ఆ సినిమాలో హీరో కూడా ఇలాంటిదే వేసుకున్నాడు. ఈ డ్రస్ కోసం ఎన్ని షాపులు తిరిగానో తెలుసా. కావలసిన షర్టు దొరక్కపోతే తెల్ల షర్ట్ తీసుకుని ఇవన్నీ నేనే కుట్టాను కూడానూ... ప్లీజ్ బంగారూ వేసుకోమ్మా" అంటూ బతిమలాడుతూ ఆ డ్రెస్ వేసింది వైష్ణవి.

"ఇట్ ఈజ్ టూ హాట్ అమ్మా" ఏడుపు మొదలుపెట్టాడు. ఈలోగా భార్గవి నుండి ఫోన్ వచ్చింది. వైష్ణవి మాట్లాడుతూనే గదిలోకి వెళ్ళి పండు రోజూ వేసుకునే బట్టలు తీసుకుని వచ్చింది.

"పండూ ఇవాళ డ్రెస్ రిహార్సల్ కాన్సిల్ అట" అంటూ నీరసంగా సోఫాలో కూర్చుంది.

"ఎస్..." అని అరుస్తూ పండు అమ్మ చేతిలో బట్టలు తీసుకున్నాడు. ఈ సంభాషణ అంతా వింటున్న ప్రసాద్ "ఏమైంది... ఎందుకు కాన్సిల్ అయిందిట" అని అడిగాడు.

మన కల్చర్ కి సంబంధించిన కార్యక్రమాలు ఉంటే బావుంటుందని అసోసియేషన్ వాళ్ళు ఫోన్ చేశార్ట."

"అమ్మయ్య ఇక ఈ రికార్డింగ్ డాన్స్ ఆపేస్తారన్నమాట. ఈసారి కొంచెం మంచి పాట చూడండి." ఉత్సాహంగా చెప్పాడు ప్రసాద్,

"ఈ పాట అలాగే వుంచి పిల్లల డ్రస్ మారుస్తానంది భార్గవి. మీ కాటన్ పంచె, ప్రత్యూష ఎరుపు కుర్తా తీసుకురమ్మంది" అంటూ పండును తీసుకుని బయటకు వెళ్ళింది.

భార్గవి వాళ్ళింటికి వెళ్ళగానే పండుకు పంచె కట్టింది వైష్ణవి. పేంట్ లాగే ఉండి కొంచెం వదులుగా ఉండంతో వాడికి కూడా నచ్చిందది.

"అమ్మా ఇదేం డ్రస్?" అద్దంలో చూసుకుంటూ అడిగాడు.

"దీన్ని పంచె అంటారు నాన్నా. ఇది ఇండియన్ ట్రెడిషనల్ డ్రస్"

"అంటే?"

"ఇండియాలో వాళ్ళు వేసుకునే డ్రస్" వివరించింది.

"ఇండియాలో పీపుల్ రోజూ ఇలాంటి డ్రస్సే వేసుకుంటారన్నమాట" అనుకున్నాడు పండు.

ఓ రోజు ఉదయం పండు బ్రేక్ ఫాస్ట్ టేబుల్ దగ్గరకు రాగానే వైష్ణవి ఇవాళ ఉగాది పండుగ నాన్నా, ముందీ ఉగాది పచ్చడి తిని తరువాత సీరియల్ తిను అంటూ స్పూన్తో కొంచెం పచ్చడి పెట్టింది. బెల్లం ఎక్కువేసిందేమో తియ్యగా ఉందది. మరికొంచెం కావాలని అడిగి పెట్టించుకుని తిని స్కూలుకు వెళ్ళిపోయాడు పండు. ఆ వచ్చే శనివారమే తెలుగు అసోసియేషన్ వారు వేడుకగా చేస్తున్న 'ఉగాది' పండుగ.

శనివారం సాయంత్రం వేడుకలు జరిగే ప్రదేశానికి వెళుతుండగా నాన్నా ఇట్స్ ఆల్రెడీ త్రీ ఓ క్లాక్ కంగారుగా చెప్పాడు పండు. ఏం ఫరవాలేదు నాన్నా ప్రోగ్రామ్స్ ఓ గంట ఆలస్యంగానే మొదలౌతాయి చెప్పాడు ప్రసాద్. కారు దిగి లోపలకు వెళ్ళగానే అందంగా అలంకరించిన టేబుల్ వెనుక ముగ్గురు అమ్మాయిలు నవ్వుతూ స్వాగతం పలికారు. ఒకమ్మాయి వీరిమీద పన్నీరు చల్లింది. తన చేతిమీద పడిన నీళ్ళను తుడిచేసుకున్నాడు పండు.

"పండూ స్మెల్ చూడు ఎంత బావుందో?" గుసగుసలాడింది ప్రత్యూష. చెయ్యి మొహం దగ్గర పెట్టుకుని వాసన చూసాడు. వాడికా వాసన చాలా నచ్చింది. ఈలోగా మరో అమ్మాయి వైష్ణవికి ఒక పుస్తకం, గులాబి పువ్వు ఇచ్చింది. తనకూ ఇస్తుందేమో అన్నట్లుగా అక్కడే ఆగాడు పండు.

ఆ అమ్మాయి పండును చూసి "హి ఈజ్ సో క్యూట్" అని నవ్వింది కాని ఏమీ ఇవ్వలేదు. ఆ అమ్మాయి తననలా అనడం అస్సలు నచ్చలేదు వాడికి. మరో అమ్మాయి ప్రసాద్ కి రెండు బాండ్ లు ఇచ్చింది.

పండు తనకు బాండ్ ఇవ్వమన్నట్లుగా చెయ్యి చాపాడు కాని ఆ అమ్మాయి "ఓన్లీ ఫర్ అడల్ట్స్ " అని మొహమాటం లేకుండా చెప్పేసింది. "నాట్ ఫెయిర్" అనుకుని అమ్మ చేతిలోని పుస్తకం తీసుకుని చూసాడు. ముఖ చిత్రం మీద వేసిన బొమ్మ వాడికి చాలా నచ్చింది. పైన రాసున్న దాన్ని చదవడానికి ప్రయత్నిచాడు, వాడికి ఏమీ అర్థం కాలేదు. పుస్తకం లోపలి పేజీల్లో చూసాడు. అక్కడక్కడా బొమ్మలు, కొన్ని కార్టూన్స్ కనిపించాయి, కాని అన్నీ తెలియని అక్షరాలే వున్నాయి.

"నాన్నా ..ఐ కుడుంట్ రీడ్ దిస్. వాట్ ఆర్ దీజ్? అక్షరాలను చూపిస్తూ అడిగాడు.

"అవి తెలుగు లెటర్స్ పండూ"

మళ్ళీ చదవడానికి ప్రయత్నించాడు. అర్థం కాలేదు. "వాట్స్ ఇన్ హియర్?" వేలు పెట్టి చూపించాడు.

"'వాహిని'...ఈ మగజైన్ పేరు" చెప్పింది వైష్ణవి.

ఓ తెలుగులో లెటర్స్ ఉంటాయా...అనుకుంటూ మళ్ళీ ఆ పుస్తకం వైపు చూశాడు. ఆ అక్షరాలేంటో నేర్చుకోవాలన్న ఆసక్తి కలిగింది వాడికి.

అక్కడనుండి వెళ్తుంటే ఒక టేబుల్ మీద ట్రేలో చిన్న చిన్న గ్లాసులు పెట్టున్నాయి. వాటిలో ఏదో చిక్కని పదార్థం ఉంది. "ఉగాది పచ్చడి తీసుకుంటారా?" ఆ టేబుల్ దగ్గరున్న అమ్మాయి అడిగింది. వైష్ణవి, ప్రసాద్ చెరో గ్లాసు తీసుకున్నారు. ఆ అమ్మాయి పిల్లలకు కూడా రెండు గ్లాసులు ఇవ్వబోయింది. " నో థాంక్స్" అని చెప్పింది ప్రత్యూష. పండు గ్లాసు తీసుకుని సందేహంగా దానివైపు చూస్తూ కొంచెం రుచి చూశాడు.

"యాక్ అమ్మా ఏం బాలా..."

టేబుల్ దగ్గరున్నమ్మాయి ఏదో పనున్నట్లు త్వరత్వరగా అక్కడినుండి వెళ్ళిపోయింది. వైష్ణవి వాడివైపు కొంచెం కోపంగా చూస్తూ "పండూ అలా అనొచ్చా.." అంది.

"నిజం అమ్మా యక్కీగా ఉంది"

"అలా చెప్పడం నైస్ కాదు." అంటూ వాడి చెయ్యి పట్టుకుని ముందుకు తీసుకుని వెళ్ళింది.

"వాడు చెప్పింది కూడా నిజమేగా" నవ్వాడు ప్రసాద్.

"మీరూరుకోండి పిల్లలకు చెప్పాల్సింది పోయి...." అంటూ ఈ లోగా ఆడిటోరియం కనిపించడంతో గేటు ముందున్నతనికి తన చేతికి వున్న బాండ్ చూపించింది.

నలుగురూ లోపలకు వెళ్ళి చీకటిలో తడుముకుంటూ ఖాళీగా ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు. వేదిక మీద వున్నతను తెలుగు భాష, సంస్కృతి గురించి ఇంగ్లీషులో వివరిస్తున్నాడు.

"అమ్మా ఆ అంకుల్ కి తెలుగు రాదా?" అడిగాడు పండు.

"ష్..." అంటూ మాట్లాడవద్దన్నట్లుగా సైగ చేసింది వైష్ణవి.

తరువాత కార్యక్రమం పిల్లలు డాన్స్. ఫోటోలు, వీడియో తీస్తున్నవాళ్ళు ముందు నిలబడడంతో పండుకు వేదిక కనిపించడం లేదు. లేచి నిలబడ్డాడు. వెనుక వున్న వాళ్ళకు కనిపించదని ప్రసాద్ వాడిని కూర్చోబెట్టాడు. కుర్చీలో కూర్చుని తల బాగా వెనక్కి వంచి చూశాడు. వెనుక గోడనుండి ఒక వెలుగు వస్తూవుండడం చూసి అది ఎక్కడవరకూ వెళుతుందో గమనించాడు. ఆ కాంతిపుంజాన్ని అందులో మెరుస్తూన్న చిన్నచిన్న వెలుగు కణాల్ని చూస్తూ కూర్చున్నాడు.

"పండూ లుక్ రామ్, లక్ష్మణ్, సీత ఆర్ ఆన్ ది స్టేజి" మెల్లగా చెప్పింది ప్రత్యూష. పండు కుర్చీలో ముందుకు వంగి ఆసక్తిగా చూసాడు. కథల్లో వాళ్ళు అలా వేదిక మీద కనిపించంతో వాడికి చాలా ఆశ్చర్యం వేసింది. వాళ్ళేం మాట్లాడుతున్నారో పండుకు అస్సలు అర్థం కాలేదు.

"నాన్నా వాళ్ళు ఏ లాంగ్వేజ్ మాట్లాడుతున్నారు? అడిగాడు పండు.

"తెలుగే పండూ"

పండుకు నమ్మకం కలగలా. నాన్న వేపు చూసి మళ్ళీ జాగ్రత్తగా విన్నాడు, అయినా అర్థం కాలేదు. అటూ ఇటూ చూసాడు అందరూ నిశ్శబ్దంగా చూస్తున్నారు. జేబులోంచి మెల్లగా చక్ లెట్ తీసి తింటూ రేపర్ ను గుండ్రంగా చుట్టడం మొదలెట్టాడు. చప్పట్ల శబ్దం వినిపించి తనూ చప్పట్లు కొట్టాడు. "చాలా బావుంది కదూ" అడిగింది వైష్ణవి. చేతిలోని రేపర్ వైపు చూసి అవునన్నట్లుగా తల ఊపాడు. గట్టిగా విజిల్స్, అరుపులు వినిపించడంతో ఎక్కడా అని చూశాడు. కొంతమంది కుర్చీల్లో నిలబడి ఉత్సాహంగా

అరుస్తున్నారు. పెద్దవాళ్ళు అలా అల్లరి చేయడం చాలా కొత్తగా అనిపించింది వాడికి. వాళ్ళు చూస్తున్నవైపు చూశాడు. అక్కడో అమ్మాయి చేయి ఊపుతూ ఉంది. ఆ అమ్మాయి ఏదో పాటకు డాన్స్ మొదలెట్టింది.

"అమ్మా ఆ అమ్మాయి షేం షేం బట్టలు వేసుకుంది" వైష్ణవికి చెవిలో చెప్పాడు.

"ష్...అలా అనకూడదు. ఆ అమ్మాయి పెద్ద హీరోయిన్ ఇండియా నుండి వచ్చింది." చెప్పింది వైష్ణవి.

పండుకేమీ నచ్చలేదా అమ్మాయి. అమ్మ సెల్ ఫోన్ తీసుకొని ఆడుకుంటూ కూర్చున్నాడు. ఆట పూర్తయి తల పైకెత్తేసరికి వేదిక నిండుగా కనిపించింది.

"అక్కా లుక్ దేర్ ఆర్ సోమెని పీపుల్ ఆన్ ది స్టేజ్" ప్రత్యూష వైపు తిరిగి మెల్లగా చెప్పాడు.

"లుక్ ఎట్ దెయిర్ కాస్ట్యూమ్స్" అంతే మెల్లగా చెప్పింది ప్రత్యూష.

"దే లుక్ సో ఫన్నీ" అంటూ నవ్వాడు.

"ఐ థింక్ దే ఆర్ కూల్"

పసుపు రంగు పంచె కట్టుకున్నతను మైక్ తీసుకుని "మేక తోకకు మేక తోక మేకకు తోక మేక తోకామేక" అంటూ పద్యం పాడడం మొదలు పెట్టాడు.

"దట్ అంకుల్ ఫర్గాట్ హిజ్ లైన్స్, హి కెన్ ఓన్లీ రిమెంబర్ గోట్ అండ్ టైల్" చెప్పాడు పండు. కిసుక్కున నవ్వారు పక్కనెవరో.

పండును తీసుకుని బయటకు వచ్చాడు ప్రసాద్. ఇద్దరూ అక్కడున్న స్టాల్స్ చూస్తూ నడుస్తున్నారు. రెడ్ క్రాస్ స్టాల్ దగ్గరకు రాగానే ఆ స్టాలతను రక్తదానం గురించి వివరించాడు. ప్రసాదు పెన్ తీసుకుని ఒక కాగితం మీద తన వివరాలు రాయడం మొదలుపెట్టాడు.

"కెన్ ఐ హావ్ ఎ పెన్ టూ?" అడిగాడు పండు.

"వై నాట్... టేక్ ఇట్" ఇచ్చాడతను.

"గివ్ మీ ది పేపర్, ఐ ఇల్ రైట్ డౌన్ మై డీటెయిల్స్" అనగానే ఆ స్టాలతను, ప్రసాద్ ఇద్దరూ నవ్వారు. వాళ్ళెందుకు నవ్వారో అర్థం కాలేదు పండుకు. చిన్నబోయిన పండు మొహం చూస్తూ పెద్దవాళ్ళే రక్తదానం చెయ్యాలని చెప్పాడు ప్రసాద్. "నాట్ ఫెయిర్" అనుకున్నాడు పండు. "త్వరగా పెద్దయిపోవాలనీ, అప్పుడు పిల్లల్ని చూసి అస్సలు నవ్వకూడదని" అని కూడా అనుకున్నాడు. ఈలోగా ప్రవీణ్, శైలేష్ కనిపించారు వాడికి. పెద్దవాళ్ళు మాట్లాడుకుంటుండగా పిల్లలు ముగ్గురూ పక్కనే ఉన్న పెద్ద స్టాల్ దగ్గరకు వెళ్ళారు. అక్కడో పక్క స్టాండ్స్ కి రంగు రంగుల బట్టలు వేలాడదీసి ఉన్నాయి. ఇంకో వైపు టేబుల్ మీద వరుసగా కొన్ని బొమ్మలున్నాయి.

"లుక్ లుక్... దేర్ ఈజ్ తొండం గాడ్" అరిచాడు ప్రవీణ్.

"తోక గాడ్ టూ..." ఆసక్తిగా చూస్తూ చెప్పాడు శైలేష్.

"ఐ సి ఫ్లూట్ గాడ్ అండ్ స్నేక్ గాడ్" చప్పట్లు కొట్టాడు పండు.

వీళ్ళ ముగ్గురి మాటలు విని షాపతను నవ్వడంతో కొంచెం కోపంగా చూసాడు పండు.

"కిడ్స్ డిన్నర్ టైం, లెట్స్ గో టు ది డైనింగ్ హాల్" అంటూ వైష్ణవి పిలవడంతో ముగ్గురూ పెద్దవాళ్ళను అనుసరించారు. డైనింగ్ హాల్ దగ్గర లైన్స్ చాలా పెద్దగా వున్నాయి. తక్కువగా ఉన్న లైన్లు చూసుకోవడంతో మూడు కుటుంబాల వారు వేరైపోయారు. పిల్లలిద్దరినీ ఖాళీగా ఉన్న టేబుల్ దగ్గర కూర్చోబెట్టి వైష్ణవి, ప్రసాద్ లైన్లో నిలబడి తందూరి చికెన్, మట్టన్ బిర్యానీ తీసుకొచ్చారు.

"అమ్మా ఇవాళ పండుగ చేసుకుంటున్నాం కదా" అడిగింది ప్రత్యూష.

"అవున్నాన్నా త్వరగా తినండి. డిన్నర్ తరువాత మీ ప్రోగ్రాం ఉంది" చెప్పింది వైష్ణవి.

"మరి...పండుగ రోజు నాన్ వెజ్ తినకూడదుగా" ప్లేట్ లో ఉన్న పదార్థాలను చూస్తూ అడిగింది. పండు చికెన్ తీసుకోబోయి సందేహంగా నాన్న వైపు చూసాడు.

"ఇవాళ అసలు పండుగ కాదుగా తినొచ్చు" చెప్పాడు ప్రసాద్.

అందరూ భోజనం చేసాక "మీరు లోపలకు వెళ్ళి కూర్చోండి మేము గ్రీన్ రూమ్ కి వెళ్తాం. వీడియో తీయడం మరచిపోకండి" ప్రసాద్ కి జాగ్రత్తలు చెప్పింది వైష్ణవి. 'గ్రీన్ రూమ్....స్ట్రేంజ్' అనుకుంటూ అమ్మను అనుసరిచాడు పండు. వాడు ఊహించినట్లుగా ఆ గది పచ్చగా లేదు. అమ్మ 'గ్రీన్ రూమ్' అని ఎందుకన్నదో అర్థం కాలేదు వాడికి. ఆ గదిలో వున్న వాళ్ళందరూ వేరే గ్రహం నుండి వచ్చినట్లు వింతగా కనిపించారు వాడికి. కొంతమంది అమ్మాయిలు పసుపు రంగు చీరలు కట్టుకుని మొహానికి పసుపు పూసుకుని పెద్దబొట్టు పెట్టుకుని చేతిలో కొమ్మలు పట్టుకుని తిరుగుతున్నారు. ఇంకొంతమంది పిల్లలు తళతళ మెరిసే బట్టలు వేసుకుని హానికి మేకప్ వేసుకుంటున్నారు. పండుకు పంచె కట్టి, కుర్తావేసి నడుము చుట్టూ ఓ చున్నీ, తలకు మరో చున్నీ కట్టింది వైష్ణవి.

"మన ప్రోగ్రాం టైం అవుతోంది, స్టేజ్ దగ్గరకు వెళ్దామా?" అంటూ భార్గవి రావడంతో సరేనన్నట్లుగా తలూపింది వైష్ణవి.

"అమ్మా..." మెల్లగా పిలిచాడు పండు.

"ఏంటి నాన్నా?" అంది. చెవిలో చెప్పాలన్నట్లుగా సైగ చేసాడు. కిందకు ఒంగింది.

"ఐ నీడ్ టు గో టు ది రెస్ట్ రూమ్"

"ఇప్పుడా...ఇంకాసేపట్లో ప్రోగ్రాం మొదలవబోతుంది" అంటూ, "భార్గవీ, మీరు స్టేజ్ దగ్గర ఉండండి మేము 5 నిముషాలలో వచ్చేస్తాం" అంటూ పండు చెయ్యి పట్టుకుని రెస్ట్ రూమ్ వైపు పరిగెత్తినట్లుగా తీసుకెళ్ళింది.

వైష్ణవి వాడికి మళ్ళీ పంచె కట్టి అప్పటికే వేదిక మీద నిలుచుని వున్న వాడి స్నేహితుల దగ్గరకు పంపించింది. తెర తీశాక పండుకు ఎదురుగా చీకటి తప్ప ఏమీ కనిపించలేదు. తామెక్కడున్నారో అర్థం కాలేదు వాడికి. ఈలోగా వాళ్ళు డాన్స్ నేర్చుకున్న పాట వినిపించడంతో దాని కనుగుణంగా డాన్స్ చెయ్యడం మొదలెట్టాడు. పూర్తవగానే పెద్దగా చప్పట్ల శబ్దం వినిపించి, చాలా సంతోషపడ్డాడు. రాత్రి పదిగంటలకు వాళ్ళ కారు ఇంటి దారిపట్టింది.

"ఇవాళ ప్రోగ్రామ్స్ బావున్నాయి కదూ" ప్రసాద్ వైపు చూస్తూ అంది వైష్ణవి.

"ఆ..పిల్లలు చాలా బాగా చేశారు" మెచ్చుకున్నాడు ప్రసాద్.

"ఇలాంటి వాటిలో పార్టిసిపేట్ చేస్తే పిల్లలకు మన కల్చర్, వాల్యూస్ తెలుస్తాయ్" అంది.

"అక్కా... వాట్ ఈజ్ 'కల్చర్'?" అడిగాడు పండు.

"వేరింగ్ గుడ్ క్లోత్స్ అండ్ సెలబ్రేట్ అవర్ ఫెస్టివల్స్" చెప్పింది ప్రత్యూష.

"ఇంకా షేం షేం పాటలకు డాన్స్ చేయడం కూడా" పూర్తిచేశాడు పండు.

●●●

# కుక్క కావాలి!

*"అమ్మా అమ్మా" పెద్దగా పిలుస్తూ ఇంట్లోకి వచ్చాడు పండు.*

"ఏమైంది?" చేతికంటిన పిండి కిందపడకుండా జాగ్రత్త పడుతూ హడావిడిగా వచ్చింది వైష్ణవి.

"ఐ వాంట్ ఏ పెట్".

"ఓ పెట్టా, నువ్వలా అరుస్తూ వస్తే ఇంకా ఏమైందో, ఎక్కడైనా పడ్డావేమో అనుకున్నా. చూద్దాంలే" అంటూ లోపలకు వెళ్ళింది.

"నో చూద్దాంలే. ఐ వాంట్ ఎ పెట్ రైట్ నౌ. ప్లీజ్ అమ్మా మా ఫ్రెండ్స్ అందరికీ పెట్స్ ఉన్నాయి. మనం కూడా తెచ్చుకుందాం" అమ్మతో పాటు వంటగదిలోకి వచ్చాడు.

"దాని గురించి తరువాత మాట్లాడదాం నాన్నా, ముందు చేతులు కడుక్కో, పకోడీలు వేస్తున్నా తిందువు గాని".

చేతులు కడుక్కుని వచ్చి కూర్చున్నాడు. కాని వాడి మనసంతా ఆ సాయంత్రం చూసిన కుక్కపిల్ల మీదే వుంది. పండు స్కూల్ నుండి వస్తున్నప్పుడు పక్కింటి 'జేసన్' కుక్కపిల్లతో ఆడుకుంటూ కనిపించాడు. అది 'జేసన్' వేసిన బాల్ ని పరిగెత్తుకుంటూ వెళ్ళి తెచ్చిస్తూ ఉంది. బుజ్జి కుక్కపిల్ల, తెల్లగా అక్కడక్కడా గోధుమ రంగు మచ్చలతో అందంగా ఉందది. దాన్ని చూసినప్పుడల్లా పండుక్కూడా ఓ పెట్ కావాలని అనిపిస్తూ ఉంటుంది. అప్పటికి ఊరుకుని ఆ రాత్రి ప్రసాద్ రాగానే మళ్ళీ మొదలెట్టాడు పండు.

"నాన్నా మనం పెట్ ని తెచ్చుకుందాం"

"యస్... పెట్ ని తెచ్చుకుందాం" ప్రత్యూష కూడా వంత పాడింది.

"మీరిద్దరున్నారుగా చాల్లేరా మళ్ళీ మనకు వేరే పెట్ ఎందుకు" తేలిగ్గా అనేసింది వైష్ణవి.

"నాన్నా ప్లీజ్ నాన్నా, ప్లీజ్ ప్లీజ్" ప్రసాద్ ఒళ్ళో కూర్చుని గడ్డం పట్టుకుని అడిగాడు పండు.

"మా ఫ్రెండ్స్ అందరి ఇంట్లో పెట్స్ ఉన్నాయి మనం కూడా ఓ పెట్ తెచ్చుకుందాం నాన్నా" ప్రత్యూష ఆశగా అడిగింది.

"మమ్మల్ని పెంచుకోండిరా" నవ్వేశాడు ప్రసాద్.

"యు డోన్'ట్ లిజన్ టు అజ్. యు ఆల్వేస్ టెల్ అజ్ స్టఫ్ టు డు. వుయ్ వాంట్ ఎ పెట్ దట్ లిజన్స్ టు అజ్" పెట్ ఎందుకు కావాలో కూడా చెప్పేసింది ప్రత్యూష.

"స్టీవెన్ హేజ్ ఎ జర్మన్ షెపర్డ్. జాన్ హాజ్ టూ పారెట్స్, అమెండా హాజ్ ఏ క్యూట్ కేట్. నటాషా హాజ్ టు హేంస్టర్స్" ఏకరువు పెట్టాడు పండు.

"ఇప్పటికే ఇంట్లో ఆఫీస్లో పని చేసుకోలేక పోతున్నాను. ఇది చాలక ఇంకా పెట్ అంటే నా వల్ల కాదు బాబూ" విసుగ్గా చెప్పింది అమ్మ.

"మేమే టేక్ కేర్ చేస్తాం అమ్మా, యు డాన్'ట్ హేవ్ టు డు ఎనీ థింగ్. రైట్ అక్కా"

"అవునమ్మా మేమే టేక్ కేర్ చేస్తాం. డాగ్ ని తెచ్చుకుందాం. "నేనూ పండూ రోజూ వాక్ కి తీసుకెళతాం. జేసన్ వాళ్ళలా మనం కూడా ఇన్విజిబుల్ ఫెన్స్ పెడదాం. అప్పుడది ఎక్కడికీ వెళ్ళకుండా మన ఫ్రంట్ యార్డ్ లోనే వుంటుంది." చెప్పింది ప్రత్యూష.

మిగిలిన విషయాల్లో ఎంత పోట్లాడుకున్నా ఈ విషయంలో మాత్రం పిల్లలిద్దరిదీ ఒకే అభిప్రాయం.

"మనం ఇండియాకు వెళితే కనీసం అక్కడ నెలరోజులు వుంటాం. అప్పుడు అదెక్కడ వుంటుంది. కష్టం కదా" సర్ది చెప్పబోయాడు ప్రసాద్. పిల్లల దగ్గర సమాధానాలు సిద్ధంగా వున్నాయి.

"డాగ్ కేర్ సెంటర్ లో వదిలి పెట్టి వెళదాం" చెప్పాడు పండు.

"పెట్ షాప్ వాళ్ళు కూడా టేక్ కేర్ చేస్తారు నాన్నా. పైగా వాళ్ళు డాగ్ కి చక్కగా హెయిర్ గ్రూమ్ చేస్తారు. ప్లీజ్ నాన్నా ప్లీజ్ పెట్ తెచ్చుకుందాం" చెప్పింది ప్రత్యూష.

ఇలా ఓ గంట పెంపుడు జంతువుల గురించి మాట్లాడుకున్నాక చివరకు

"ఒకే, ఒకే పెట్ తీసుకుందాం, కాని డాగ్ కాదు" చెప్పాడు ప్రసాద్.

"ఒకె, దెన్ కేట్?"

"నో కేట్ "

"నా....న్నా" ప్రసాద్ వాక్యం పూర్తిచేయక ముందే అరిచారు పిల్లలిద్దరూ.

"నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. మనం ఇప్పటివరకు ఏ పెట్ ని పెంచలేదు కదా అందుకని ముందు ఏదైనా కేజ్ లో వుండే పెట్ ని పెంచుకుందాం.

"కేజ్ లో పెట్ వద్దు. రియల్ గా ఆడుకునే పెట్ కావలి" ప్రత్యూష.

"అలా అయితే అసలే పెట్టే వద్దు" ఖరాఖండిగా చెప్పింది వైష్ణవి. పండు పెద్దగా ఏడవడం మొదలుపెట్టగానే, ప్రసాద్ "రేపు వీకెండ్ మనం 'పెట్స్ మార్ట్' కి వెళ్ళి అమ్మకు మీకు నచ్చిన పెట్ తెచ్చుకుందాం. సరేనా. అక్కడ మళ్ళీ 'అది కావాలి, ఇది కావాలి' అని గొడవ పెట్టకూడదు. అలా అయితేనే వెళదాం" అన్నాడు.

"ఒకే" అయిష్టంగా ఒప్పుకున్నారు పిల్లలు.

****

శనివారం నిద్రలేవగానే పండు మెల్లగా నాన్న పడుకున్న గదిలోకి వచ్చాడు. ప్రసాద్ ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. "నాన్నా వేక్ అప్" మెల్లగా పిలిచాడు.

"అప్పుడే లేచావేం నాన్నా, ఇంకాసేపు పడుకోకూడదూ" బలవంతంగా కళ్ళు తెరుస్తూ అడిగాడు ప్రసాద్.

"ఇవాళ వీకెండ్ నాన్నా వెళ్లి పెట్ తెచ్చుకుందాం లే"

"అప్పుడేనా ఇంకా పెట్స్ కూడా నిద్ర లేచి వుండవు కొంచెం సేపు ఆగి వెళ్దాం" అని చెప్పి దుప్పటి పూర్తిగా మొహం మీదకు లాక్కుని పడుకున్నాడు. పండు కిటికీ దగ్గరకు వెళ్ళి బ్లయిండ్స్ పక్కకు జరిపి చూసాడు. ఇంటి ముందు లాన్ మీద ఎండ పడుతోంది. పక్కింటి మార్గరెట్ ట్రాక్ సూట్ వేసుకుని బయట జాగింగ్ చేస్తూ కనిపించింది. కొంచెం దూరంలో ఎవరో కుక్కను



కౌముది

తీసుకొస్తున్నట్లుగా అనిపించి తల కిటికీ అద్దానికి ఆన్చి చూసాడు. ముక్కుకు అద్దం చల్లగా తగిలింది. కుక్క ఇప్పుడు కొంచెం దగ్గరగా కనిపిస్తోంది. పండు నాన్న దగ్గరకు వెళ్లి "నాన్నా...లే నాన్నా పెట్స్ నిద్ర లేచాయి" అంటూ దుప్పటి లాగేసేడు. ఇక లేవక తప్పలేదు ప్రసాద్ కి. లేచి హెడ్ బోర్డ్ ఆనుకుని కూర్చుని "పండూ పెట్స్ నిద్రలేచినా షాప్ పది వరకూ ఓపెన్ చెయ్యరు నాన్నా" ఆవలిస్తూ చెప్పాడు.

"పదంటే?"

"పదంటే టెన్. మనం స్నానం చేసి బ్రేక్ ఫాస్ట్ చేసి అప్పుడు వెళ్దాం. ఒకే"

"ఇప్పుడు టైం ఎంతయింది "

గోడ మీద గడియారం చూసి సెవెన్ అయిందని చెప్పాడు ప్రసాద్.

"ఇంకా త్రీ అవర్స్" అంటూ కుక్కలేమైనా కనిపిస్తాయిమోమని మళ్ళీ కిటికీ దగ్గరకు వెళ్లి చూసాడు. వీధంతా ఖాళీగా వుంది. మెల్లగా ప్రత్యూష గదిలోకి వెళ్ళి అక్కను నిద్ర లేపాడు. ఇద్దరూ వాళ్ళమ్మ పిలిచేవరకూ పెట్స్ గురించి ఏమిటేమిటో మాట్లాడుకుంటూనే వున్నారు.

****

పది గంటలకల్లా నలుగురూ పెట్ షాప్ కి వెళ్ళారు. ఆ షాపులో ఒక వైపు వరుసగా మూడువైపులా అద్దాలు బిగించిన పెద్ద పెద్ద డబ్బాలున్నాయి. వాటిలో వున్నా జంతువులను చూస్తూ "ఎలుకలున్నాయేమిట్రా ఇక్కడా?" ఆశ్చర్యంగా అడిగింది వైష్ణవి.

"అవి కూడా పెట్సే. పండూ లుక్ ఎట్ దిస్" అంటూ ఒక అద్దాల గదిలో అటూఇటూ పరిగెడుతున్న గోధుమ రంగు జీవిని చూపించింది ప్రత్యూష.

"సో క్యూట్. అమ్మా దీన్ని పెంచుకుందామా?" ఉత్సాహంగా అడిగాడు.

"ఛీ...ఛీ ఎలుకనెవరైనా పెంచుకుంటారా...ఇంట్లో బట్టలన్నీ కొట్టేస్తుంది. వద్దు"

"ఇది ఎలుక కాదమ్మా 'హామ్ స్టర్'. దీనికి కేజ్ ఉంటుంది. అందులోనుండి అసలు బయటకే రాదు" వివరించింది ప్రత్యూష.

"ఇక్కడింకా చాలా పెట్స్ ఉన్నాయిగా అన్నీ చూసి డిసైడ్ చేసుకుందాం. పదండి" అంటూ ముందుకు నడిచాడు ప్రసాద్.

రెండడుగులు వేయగానే "అమ్మో పాము...." అంటూ చిన్నగా అరిచింది వైష్ణవి.

"దోజ్ ఆర్ నాట్ హామ్ఫుల్. అవి కూడా పెట్సే. లాస్ట్ ఇయర్ మేం ఫీల్డ్ ట్రిప్ కెళ్ళినప్పుడు ఒక లేడీ పెట్ స్నేక్ ను నెక్ మీద స్కార్ఫ్ లాగా వేసుకుంది. మేం అందరం టచ్ చేశాం కూడా" ఉత్సాహంగా చెప్పింది ప్రత్యూష.

"లక్కీ....కెన్ ఐ టచ్ ద స్నేక్" ఆ అద్దాల గదిలోని చిన్న కొమ్మ మీద జరజర పాకుతున్న పామును ఆసక్తిగా చూస్తూ అడిగాడు పండు.

"ఒద్దులే వాటిని డిస్టర్బ్ చేయకూడదు. ఊరికే చూడాలి. ఈ వైపు చూడండి ఏమున్నాయో" అంటూ ఎదురుగా చూపించాడు ప్రసాద్. అక్కడ తొండలు, కప్పలు కనిపించాయి. అమ్మవైపు చూసాడు పండు మళ్ళీ ఏమంటుందోనని. వైష్ణవి మొహం తిప్పుకుని అక్కనుండి మరో వరుసలోకి వెళ్ళింది. ఒక కొమ్మ మీదనుంచి మరో కొమ్మ మీదకు పాకుతున్న పచ్చని తొండ వాడికి చాలా నచ్చింది. ఆ పక్కనే కప్పలు అటూ ఇటూ ఎగురుతూ ఉన్నాయి. "అక్కా, దిస్ ఈజ్ ది బెస్ట్ ప్లేస్ ఐ ఎవర్ బీన్" చెప్పాడు.

"పండూ ఇవి చూడండి ఎంత బావున్నాయో" అంటూ వైష్ణవి పిలవడం వినిపించింది. అక్కడినుండి మెల్లగా కిచకిచ శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి. ఆ వరుసలో పెద్ద పెద్ద పంజరాలు చాలా వున్నాయి. వాటిలో రంగు రంగుల పక్షులు సందడిగా ఎగురుతున్నాయి.

"అక్కా దిస్ బర్డ్ ఈజ్ సో... ప్రెట్టీ" పసుపు రంగు కేనరీని చూపించాడు.

"ఐ లైక్ దట్ బ్లూ ఫించ్"

అన్నింటినీ చూస్తూ చివరగా కుక్కలు, పిల్లులు ఉన్న చిన్న చిన్న గదుల దగ్గరకు వచ్చారు.

"అమ్మా మనం ఆ కేట్ ని తీసుకెళ్దామా?" ఒక పిల్లివైపు ఇష్టంగా చూస్తూ దాని దగ్గరగా వెళ్ళి నిలబడి అడిగింది ప్రత్యూష. ఆ పిల్లిని చూడగానే పండుకు అమెండా వాళ్ళ ఇంట్లో చూసిన నల్లపిల్లి గుర్తొచ్చింది.

"ఒద్దు నాన్నా పిల్లిని పెంచకోకూడదు" చెప్పింది.

"ఎందుకు పెంచుకోకూడదు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకంటె పిల్లి మంచి శకునం కాదు"

"వాట్ ఈజ్ శకునం?"

"శకునం అంటే...మనం ఏదైనా పని మీద బయటకు వెళ్ళాలనుకో మనకు పిల్లి ఎదుర్రాకూడదు. ఎదురొస్తే మనం వెళ్ళిన పని జరగదన్నమాట"

"దట్స్ నాట్ ట్రూ. లాస్ట్ వీకెండ్ జేకబ్ కిస్డ్ హిజ్ కేట్ బిఫోరే హి లెఫ్ట్ ద హౌస్ ఫర్ ఎ చెస్ టోర్నమెంట్. హి గాట్ ఎ ట్రోఫీ ఇన్ దట్ టోర్నమెంట్".

అలా మాట్లాడుకుంటూ పెద్ద ఎక్వేరియం దగ్గరకు వచ్చారు. అక్కడక్కడ కొన్ని రంగు రంగుల చేపలు గుంపులుగా తిరుగుతూ వున్నాయి. వాటిలో గోల్డ్ ఫిష్, గప్పీస్ చాలా నచ్చాయి పండుకు. అవి తీసుకుందామని పండు చెప్పగానే సంతోషంగా

ఒప్పుకుంది వైష్ణవి. ప్రత్యూష మాత్రం కనీసం హేంస్టర్ అయినా కొనాలని పట్టుబట్టింది. చేపలకో పెద్ద ఎక్వేరియం, హేంస్టర్ కి అద్దాల గది, దానికి కావలసిన బెడ్డింగ్, ఇంకా వాటికి ఏమేం కావాలో అడిగి వాటన్నింటినీ నాలుగు పెద్ద బేగులు నిండా నింపారు.

తన చేతిలో వున్న చిన్న డబ్బాలోని హేంస్టర్ ను మురిపెంగా చూస్తూ "హేంస్టర్ కి 'చిప్ మంక్' అని పేరు పెడదామా పండూ?" అడిగింది ప్రత్యూష.

"చిప్ మంక్...ఒకె. హౌ అబౌట్ వు విల్ కాల్ దీజ్ ఫిషెస్ యాజ్ డాగీ, కిట్టీ, స్లింకీ, అండ్ ఫ్రాగీ" అడిగాడు పండు.

"నైస్ నేమ్స్" చెప్పింది ప్రత్యూష. వాటికోసం ఏం చెయ్యాలో, వాటిని ఎక్కడ పెట్టాలో అక్కతో మాట్లాడుతూ సంతోషంగా కారులో కూర్చున్నాడు పండు.

****

ఇంటికి రాగానే ఎక్వేరియంను హాల్ లో గోడవైపుగా ఒక టేబుల్ మీద పెట్టాడు ప్రసాద్. దానిలో రంగురంగుల రాళ్ళూ, కొన్ని ప్లాస్టిక్ మొక్కలూ పెట్టింది వైష్ణవి. ప్రత్యూష కొన్ని నీళ్ళు తెచ్చి దానిలో పోశాక, బాగులో నీళ్ళలో వున్న చేపలను మెల్లగా దానిలో వదిలిపెట్టాడు పండు. దాని పక్కనే కేజ్ లో కింద మెత్తని చెక్కముక్కలు పరిచి, ఒక చక్రం లాంటి దాన్ని అందులో పెట్టి అన్నీ సరిగ్గా కుదిరాయనకున్నాక ప్రత్యూషను 'చిప్ మంక్' ను అందులో పెట్టమంది వైష్ణవి. బుజ్జిపండు ఆ రోజంతా వాటి దగ్గరనుండి ఎటూ కదలలేదు.

తరువాత రోజు పండు నిద్రలేవగానే చేపలకు 'గుడ్ మార్నింగ్' చెప్పి తరువాతే రెస్ట్ రూమ్ కి వెళ్ళాడు. ఆ సాయంత్రం స్కూల్ నుండి రాగానే కొద్దిసేపు వాటిని చూసి అమ్మ దగ్గరకు వెళ్ళి ఆ రోజు స్కూల్ కబుర్లన్నీ చెప్పాడు. ఈలోగా వాడి జేసన్ రావడంతో ఆడుకోవడానికి బయటకు వెళ్ళిపోయాడు. రాత్రి భోజనం చేసేప్పుడు చిప్ మంక్ కేజ్ లోంచి ఏదో శబ్దం వినిపించి ఆశ్చర్యంగా దానివైపు చూశాడు. అది ఆ కేజ్ లో వున్న చక్రం ఎక్కి వేగంగా తిరుగుతోంది.

"ఎందుకు నాన్నా అదలా చేస్తోంది?" అడిగాడు పండు.

"దానికి ఎక్సర్ సైజ్ కావాలి, ఇంకా టైం పాస్ కూడా అవ్వాలి కదా" చెప్పాడు ప్రసాద్.

****

తరువాత రోజు శనివారం. ఉదయన్నే సాకర్ వెళ్ళి వచ్చి చూసేసరికి చిప్ మంక్ మళ్ళీ తిరుగుతూ కనిపించింది. చేపలు కూడా అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాయి. స్నానం చేసి వచ్చి నాన్న దగ్గర కూర్చున్నాడు. ప్రసాద్ డిస్కవరీ చానల్ లో 'అండర్ ది సి' ప్రోగ్రాం చూస్తున్నాడు. పండుక్కూడా ఆ ప్రోగ్రాం అంటే చాలా ఇష్టం. రంగు రంగుల చేపలు గుంపులు గుంపులుగా తిరగడం చూస్తుంటే వాడికి చాలా ముచ్చటగా అనిపిస్తుంది. వాటిని 'స్కూల్ ఆఫ్ ఫిష్' అంటారని ప్రసాద్ చెప్పాడు. పండుకు అప్పుడు వాళ్ళ స్కూల్ గుర్తొచ్చింది. పిల్లలందరూ స్కూల్ పార్కో్ల ఆడుకోవడం గుర్తొచ్చింది. ఎక్వేరియంలోని చేపలను చూశాడు, అవి కూడా ఎక్వేరియంలో అటూ ఇటూ తిరుగుతూనే వున్నాయి.

****

ఆ మధ్యాహ్నం వైష్ణవి ప్రత్యూషను తీసుకుని షాపింగ్ కి వెళ్ళింది. ప్రసాద్ ఆఫీస్ రూంలో కూర్చుని పనిచేసుకుంటున్నాడు. పండు హాల్లోకి వచ్చి చిప్ మంక్ ఎదురుగా నిలబడ్డాడు. అది నిన్నటిలాగే గుండ్రంగా చక్రంలో తిరుగుతూ ఉంది. కాఫీ టేబుల్ చుట్టూ తను కూడా వేగంగా పరిగెత్తడం మొదలు పెట్టాడు పండు. కొద్ది సేపటికి కళ్ళు తిరిగినట్లయింది. సోఫాలో కూర్చున్నాడు. అక్కడినుండి చూస్తే వాడి స్నేహితులందరూ బయట ఆడుకుంటూ కనిపించారు. పైకిలేచి కాఫీ టేబుల్ చుట్టూ నడవడం మొదలు పెట్టాడు. ఐదు నిముషాల తరువాత చిప్ మంక్ వైపోసారి చూసి పరిగెత్తుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి భోజనం చేసేప్పుడు "నాన్నా మనకు పెట్స్ వద్దు" మెల్లగా చెప్పాడు పండు.

"ఎందుకు పండూ?" ఆశ్చర్యంగా అడిగింది ప్రత్యూష.

"ఫిషెస్ ని ఓషన్లో, చిప్ మంక్ ని ఫారెస్ట్ లో వదిలేద్దాం" చెప్పాడు.

"వాట్!" ఆశ్చర్యంతో చిన్నగా కేక పెట్టింది ప్రత్యూష.

"ఒక్క రూమ్ లోనే ఉండడం సో బోరింగ్. ఐ కేంట్ లివ్ లైక్ దట్ ఈవెన్ ఎ సింగల్ డే. బట్ ది పూర్ తింగ్స్. దే హావ్ టు లివ్ దెయిర్ ఎన్టైర్ లైవ్స్ లైక్ దట్. దట్స్ నాట్ ఫెయిర్" చెప్పాడు పండు.

●●●

# టూత్ ఫెయిరీ

పది రోజులుగా పన్నొకటి కదులుతూ బుజ్జిపండును బాగా ఇబ్బంది పెడుతోంది. దిస్ థింగ్ ఈజ్ వియర్డ్ అనుకున్నా, అమ్మ చేసే మునక్కాయ, వంకాయ కూరల నుండి తప్పించుకో గలిగినందుకు లోలోపల చాలా సంతోషిస్తున్నాడు. నిన్న రాత్రి వాడికిష్టమైన స్వీట్ కార్న సూప్ తాగాడు. ఉదయం పళ్ళు తోముకుంటూ ఏదో అనుమానం వచ్చి చూస్తే, పన్నూడి ఏకంగా వాడి చేతిలోకే వచ్చింది. దాన్ని శుభ్రంగా కడిగి పరిగెత్తుకుంటూ వాళ్ళక్క గదిలోకి వెళ్ళాడు. డ్రస్సర్ ఎదురుగా నిలబడి హెయిర్ బాండ్ పెట్టుకుంటుంది ప్రత్యూష.

అక్కా లుక్ లుక్ ప్రత్యూష మొహమ్మీద చెయ్యాడించాడు.

ప్రత్యూష పక్కకు తిరిగి వాడి చేతివైపు పరీక్షగా చూసింది, రెండు వేళ్ళ మధ్యలో ఏముందో ఆమెక్కనిపించలేదు. వాట్ ఈజ్ ఇట్ పండూ?

ఐ లాస్ట్ మై టూత్ ఆనందంగా చెప్పేడు.

ఓ...కంగ్రాట్స్. కీప్ దట్ అండర్ యువర్ పిల్లో టు నైట్.

ఎందుకని అడగలేదు పండు. అలా చేస్తే టూత్ ఫెయిరీ డబ్బులిస్తుందని వాడికి తెలుసు. దానికోసం వాడు ఎప్పటినుండో ఎదురుచూస్తున్నాడు కూడా. ప్రత్యూషకు టూత్ ఫెయిరీ డబ్బులు ఇవ్వడం వాడికి బాగా గుర్తుంది. అక్కడినుండి పరిగెత్తుతూ వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళి చెయ్యి వెనక్కి పెట్టుకుని అమ్మా అని పిలిచాడు.

గుడ్ మార్నింగ్ పండూ అంటూ వాడివైపు చూసింది వైష్ణవి. తొర్రిపన్ను కనిపించేలా నవ్వాడు.

ఓ పన్నూడిందా! ఏదీ చూపించు గబగబా వాడి దగ్గరకు వెళ్ళి మోకాళ్ళ మీద కూర్చుంది. నవ్వుతూ గుప్పిట తీసి చూపించాడు.

అమ్మయ్య వచ్చేసింది! నొప్పేం లేదుగా అంది వాడి నోటివైపు చూస్తూ. లేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు. అరమరలోంచి చిన్నపెట్టె తీసి వాడి చేతిలోని పన్నును అందులో పెట్టింది.

రోజుటికంటే ముందే తయారయి బస్ స్టాప్ కి వెళ్ళి, అక్కడికొచ్చిన పిల్లలకు తనకు పన్నూడిన విషయం చెప్పాడు పండు. జేసన్, తనకు ఇప్పటికి మూడు పళ్ళు ఊడాయని టూత్ ఫెయిరీ ముప్పై డాలర్లు ఇచ్చిందని చెప్పాడు. తాను ఆ ముప్పై డాలర్లతో వీడియోగేం కొనబోతున్నట్లు కూడా చెప్పాడు. అమెండా, తనకు రెండు పళ్ళు ఊడాయని టూత్ ఫెయిరీ పది డాలర్లు ఇచ్చిందనీ, వాటితో తను స్కూల్ స్టోర్లో ఒక పుస్తకము, రెండు బుక్ మార్క్స్ కొన్నానని చెప్పింది. జాన్, తనకు టూత్ ఫెయిరీ డబ్బులు ఇవ్వలేదు కాని, ఎప్పటినుండో తను కావాలనుకుంటున్న పుస్తకం ఇచ్చినట్లుగా చెప్పాడు. మార్గరెట్ మాత్రం ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది. ఆ పాపకింకా పన్ను ఊడలేదు మరి.

ఇఫ్ ది టూత్ ఫెయిరీ గివ్స్ యు మనీ, వాట్ డు యు డూ విత్ ఇట్? పండు పళ్ళమధ్య కనిపిస్తున్న ఖాళీ వైపు చూస్తూ అడిగింది మార్గరెట్.

ఐ విల్ బయ్ ద థింగ్స్ ఐ లైక్ సమాధానమిచ్చాడు పండు.

వాట్ వుడ్ యు లైక్? అడిగాడు జేసన్.

టాయ్స్ రస్ లో చూసిన పెద్ద ట్రక్, వాల్ మార్ట్ లోని స్పోర్ట్స్ వాచ్, నిన్ననే స్కూల్ స్టోర్ లో ప్రత్యూష కొనుక్కున మాగ్నెట్స్ గుర్తొచ్చాయి పండుకు. ఈలోగా వాళ్ళ దగ్గరికి ట్రెవర్ వచ్చాడు. అతని నీలంరంగు కొత్త నైకీ షూస్ మెరిసిపోతున్నాయి. అవికూడా నచ్చాయి పండుకు. ఈలోగా బస్ రావడంతో వాళ్ళ కబుర్లాగిపోయాయి.

* * * *

సాయంత్రం ప్రసాద్ ఇంటికి రాగానే ఉత్సాహంగా తన పన్ను గురించి చెప్పాడు పండు. రాత్రి పడుకునే ముందు ఆ పన్నును దిండు కింద పెట్టమన్నాడు ప్రసాద్.

పండూ, టూత్ ఫైయిరీ ఇచ్చిన మనీతో ఏం చేస్తావ్? అడిగింది ప్రత్యూష.

ఐ విల్ బయ్ ఎ ట్రక్, ఎ స్పోర్ట్స్ వాచ్, టూ మాగ్నెట్స్ అండ్ షూస్ వెంటనే సమాధానమిచ్చాడు.

సిల్లీ, యు కాన్ట్ బయ్ ఆల్ దోజ్ థింగ్స్ పెద్దరికం చూపించింది ప్రత్యూష.

వై నాట్?

కాజ్, టూత్ ఫైయిరీ వోంట్ గివ్ యు దట్ మచ్

మై టూత్ ఫెయిరీ ఈజ్ సో నైస్. షి విల్ గివ్ ద మనీ ఐ వాంట్  చెప్పాడు.

దేర్ యీజన్ట్ ఎనీ టూ..... అని ప్రత్యూష చెప్తుండగా

మీరిద్దరూ మళ్ళీ ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు. మీ తెలుగు టీచర్ ఇంట్లో తెలుగులోనే మాట్లాడాలని చెప్పలేదూ అంటూ విషయాన్ని పక్కదారి పట్టించాడు ప్రసాద్.

* * * *

రాత్రి పడుకోబోయేముందు పన్నుంచిన చిన్నపెట్టెను దిండు కింద పెట్టాడు పండు. టూత్ ఫెయిరీకి కనిపించదేమోనన్న అనుమానంతో దాన్ని కొంచెం బయటకు కనిపించేలా సర్ది పడుకున్నాడు. నిద్ర పట్టేలోగా టూత్ ఫెయిరీ డబ్బులిచ్చిందేమోనని రెండు మూడు సార్లు దిండు పైకెత్తి చూశాడు. నిద్రపోతేనే డబ్బులిస్తుందని జేసన్ చెప్పిన మాట గుర్తొచ్చి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. ఉదయం వాడికి దిండు కిందుంచిన పెట్టెకు బదులుగా రెండు పదిడాలర్ల నోట్లు కనిపించాయి. అవి తీసుకుని ఎగురుకుంటూ వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళాడు.

అమ్మా టూత్ ఫైరీ ఈజ్ సో నైస్ షి గేవ్ మీ ట్వం.......టీ డాలర్స్ మొహం వెలిగిపోతుండగా చెప్పాడు.

గుడ్ పండూ. మరి టూత్ ఫెయిరీకి థాంక్స్ చెప్పావా?

థాంక్యు టూత్ ఫెయిరీ తలపైకి పెట్టి బిగ్గరగా చెప్పాడు. అమ్మ నవ్వింది.

స్కూల్ టైం అవుతోంది, త్వరగా బ్రష్ చేసుకునిరా. బ్రేక్ ఫాస్ట్ చేద్దువుగాని సీరియల్ డబ్బా అరలోంచి తీస్తూ చెప్పింది వైష్ణవి.

నేనివాళ స్కూల్ కెళ్ళను హై స్టూల్ మీద కూర్చుంటూ చెప్పాడు.

ఎందుకు? ఆశ్చర్యంగా అడిగింది.

ఇవాళ మనం షాప్ కి వెళ్దామమ్మా, నేను షూస్, వాచ్ కొనుక్కుంటాను

అలా స్కూల్ మనేయకూడదు రెండు రోజుల్లో వీకెండ్ వస్తోందిగా, అప్పుడెళ్దాం. నాక్కూడా ఆఫీస్ కి టైం అవుతోంది త్వరగా తయారవు నాన్నా బతిమలాడింది వైష్ణవి.

వాడికి బడి అనగానే స్నేహితులందరూ గుర్తొచ్చారు, టూత్ ఫెయిరీ ఇరవై డాలర్లు ఇచ్చిన విషయం వాళ్ళతో చెప్పాలనిపించింది. ప్రసాద్ పాత పర్సు తీసుకుని ఇరవై డాలర్లు అందులో దాచిపెట్టుకుని బడికెళ్ళాడు.

* * * *

శనివారం వాళ్ళమ్మ చెప్పకుండానే స్నానం చేసి పర్సు జేబులో పెట్టుకున్నాడు పండు. మధ్యాహ్నం వాళ్ళ నాన్నతో కలసి షాప్ కి వెళ్ళేవరకు బోలెడు సార్లు దాన్ని చేత్తో తడిమి చూసుకుంటూనే వున్నాడు. షూ సెక్షన్ లో ప్రసాద్ చూపించినవేమీ నచ్చలేదు పండుకు. చివరకు ట్రెవర్ వేసికున్న షూస్ లాంటి నీలం రంగు నైకీస్ నచ్చాయి. వాటిమీద $40 డాలర్లన్న స్టిక్కర్ అంటించి వుంది. వాటిని తీసి కార్ట్ లో పెట్టాడు. షాపంతా తిరిగి తనకు నచ్చిన నలుపు రంగు ట్రక్, స్పోర్ట్స్ వాచ్ తీసికుని అవి కూడా కార్ట్లో పెట్టాడు.

పండూ, అన్నీ కలిపి అరవై డాలర్లు అవుతాయి. నీ దగ్గరున్న డబ్బులు సరిపోవు చెప్పాడు ప్రసాద్.

బట్, ఐ లైక్ దెం ఆల్

కొన్ని రోజులయ్యాక టూత్ ఫైయిరీ మళ్ళీ డబ్బులు ఇస్తుంది నాన్నా అప్పుడు అన్నీ తీసుకోవచ్చు. ఇప్పుడు నీదగ్గరున్న మనీతో ఏదొస్తే అదే తీసుకో అంటూ సర్ది చెప్పాడు.

ఒక్క వాచ్ మాత్రమే తీసుకుని మిగిలిన వాటిని పక్కన పెట్టేశాడు పండు. ఆ వాచ్ లోని స్టాప్ వాచ్, అలారం ఫీచర్స్ బాగా నచ్చాయి వాడికి. పైగా అలాంటి వాచ్ వాళ్ళ క్లాస్ లో స్టీవెన్ కి మాత్రమే ఉంది. అతని వాచ్ చూసినప్పుడల్లా పండుకు కూడా అలాంటి వాచ్ కావాలనిపించేది. పండు ఆ వాచ్ గురించి వాళ్ళ నాన్నకు అంతకుముందు చాలా సార్లే చెప్పేడు.

కౌంటర్ దగ్గరకు వస్తుండగా చిన్నపాప నవ్వినట్లనిపించి పక్కకు తిరిగి చూసాడు పండు. గులాబి రంగు గౌను వేసికున్న పాప అక్కడ బొమ్మలతో ఆడుకుంటోంది. పండును చూసి నవ్వుతూ హాయ్ చెప్పింది. తను కూడా తిరిగి హాయ్ చెప్పాడు. చిన్నపిల్లలంటే వాడికి చాలా ఇష్టం. అప్పుడప్పుడూ వాళ్ళమ్మను హాస్పిటల్ కి వెళ్ళి చిన్న చెల్లిని తీసుకురమ్మని అడుగుతూ ఉంటాడు. ఆ పాప పండుకు తన చేతిలోని బొమ్మను చూపించింది. సో నైస్ చెప్పాడు. సంతోషంగా నవ్వుతూ చప్పట్లు కొట్టింది. తను కూడా నవ్వుతూ పాపకు బై చెప్పి నాన్నను అనుసరించాడు.

కౌంటర్ దగ్గరకు వచ్చాక కార్ట్ లోని వాచ్ తీసి స్టాండ్ పైన పెట్టాడు పండు. కాషియర్ నైస్ వాచ్ అని మెచ్చుకుంది. సిగ్గుగా నవ్వి జేబులోంచి పర్స్ తీసి అందులో వున్న ఇరవై డాలర్లు కాషియర్ కు కనిపించేలా పట్టుకున్నాడు. ఆమె వాచ్ ని స్కాన్ చేసి ఆ వాచ్ ఖరీదు పదహారు డాలర్ల ఇరవైరెండు సెంట్లని చెప్పింది. ఒక్క క్షణం ఆలోచించి చేతిలోని డబ్బులవైపు చూసి, ఆ వాచ్ వద్దని కాషియర్ తో చెప్పి లైన్ లో నుండి పక్కకు వచ్చేశాడు.

వాచ్ ఎందుకు తీసుకోలేదు పండూ? ఆశ్చర్యంగా అడిగాడు ప్రసాద్.

నాకొద్దు నాన్నా

నీకు షూసే నచ్చాయా?

నాకు షూస్ కూడా వద్దు

మరి

ఈ డబ్బులు డొనేట్ చేస్తాను

డొనేట్ చేస్తావా, ఎవరికి?

ఓ బేబీకి డొనేట్ చేస్తాను

ఏ బేబీకి?

కాన్సర్ బేబీకి నాన్నా. ఆ బేబీ టెక్సాస్ లో ఉంటుందట. పాపం వాళ్ళ పేరెంట్స్ దగ్గర అస్సలు మనీ లేవట. వాళ్ళు చాలా పూర్. ఆపాప ట్రీట్ మెంట్ కోసం మనీ కావాలట. ఈ మనీ వాళ్ళకిచ్చేస్తాను. అప్పుడు వాళ్ళు ఆ బేబీని హాస్పిటల్ తీసుకెళ్తారు. బేబీ హెల్దీగా అయిపోతుంది.

ఇవన్నీ నీకెవరు చెప్పారు పండూ?

నిన్న మా టీచర్ చెప్పారు. ఇంకా స్కూల్ టివి లో కూడా చూపించారు.

మరి ఆ వాచ్ నీకు చాలా నచ్చిందిగా, తీసుకోవా?

వద్దు నాన్నా. నా దగ్గర స్పైడర్ మాన్ వాచ్ ఉందిగా అది పెట్టుకుంటాను. ఈ ట్వెంటీ డాలర్స్ తీసుకుని డాక్టర్ ఆ బేబీకి మంచి మెడిసిన్ ఇస్తారు. అప్పుడు ఆ బేబీ కూడా నాలాగా హాపీగా వుంటుంది.

పండును గట్టిగా కౌగలించుకుని ఆ పాపకు అలాగే మనీ ఇద్దువు గాని ఇప్పుడు వాచ్ కూడా తీసుకో నేను పే చేస్తాను అని కొడుకు చెయ్యి పట్టుకుని కౌంటర్ వైపు నడిచాడు ప్రసాద్.

●●●

# నాన్నమ్మ

"ఫ్లైట్ ఇంకా వన్ అవర్ లేట్ అట" వైష్ణవి, పిల్లలు కూర్చున్న దగ్గరికి వచ్చి చెప్పాడు ప్రసాద్.

"ఇంటి దగ్గరే చూసుకుని రావాల్సింది. స్టార్ బక్స్ కి వెళ్ళి కాఫీ తెచ్చుకుందామా? కొంచెం టైమ్ పాస్ అవుతుంది" అంది వైష్ణవి.

పండుకు స్టార్ బక్స్ లో దొరికే 'ఫ్రాపుచినో' అంటే చాలా ఇష్టం. అయినా సరే కోపంగా వాళ్ళమ్మతో రానని చెప్పేశాడు. దానికి కారణం ఈ మధ్య వాళ్ళింట్లో వాడికి నచ్చనివి చాలా జరుగుతున్నాయి. అన్నింటికంటే వాడిని ఎక్కువగా బాధించిన విషయం వాడి గది గెస్ట్ రూమ్ లా మారిపోవడం. ఆ రోజు కోపంగా "వయ్ డజ్ నాన్నమ్మ హావ్ టు స్టే విత్ అజ్?" అనగానే ప్రసాద్ వాడివైపు కోపంగా చూశాడు. "నాన్నమ్మ అంటే నాన్నకు అమ్మ అనీ, అలా అనకూడనీ, నాన్నమ్మ వచ్చాక ఆవిడతో చక్కగా కబుర్లు చెప్పాలని" చెప్పింది వైష్ణవి. పండు పడక, బట్టలు ఒకటేమిటి వాడికి సంబంధించిన వస్తువులన్నీ వాళ్ళక్క గదిలోకి వెళ్ళిపోయాయి. వాడి స్నేహితులొచ్చినా ఫ్యామిలీ రూమ్ లో ఆడుకోవాల్సిందే, వాళ్ళక్క తన గదిలోకి రానివ్వదు మరి. అన్నిటికీ మించి ఇవాళ ఉదయం

ఇంటి నుండి బయలుదేరే ముందు వాన్ లో వాళ్ళ నాన్నమ్మ కూర్చోవడం కోసం, పండు కార్ సీట్ ను మధ్య సీటు నుండి వెనక సీటులోకి మార్చేశాడు ప్రసాద్. దీనికంతటికీ కారణమైన నాన్నమ్మ మీద వాడికి చాలా కోపంగా ఉంది.

ఫ్లైట్ వచ్చినట్లుంది, ప్రయాణీకులు ట్రాలీ తోసుకుంటూ ఒకరూ, ఇద్దరుగా బయటకు వస్తున్నారు. "అదుగో అమ్మ" అంటూ గబగబా వస్తున్నవాళ్ళకు ఎదురెళ్ళాడు ప్రసాద్. అతన్ని అనుసరిచారు ప్రత్యూష, వైష్ణవి. పండు కూర్చున్న దగ్గరనుండే తల పైకెత్తి చూసాడు. పచ్చచీర కట్టుకున్నావిడ ట్రాలీ తోసుకుని రావడం కనిపించింది. దగ్గరకు రాగానే ప్రసాద్ ఆమె చేతిలోని ట్రాలీ తీసుకున్నాడు. "నాన్న వాళ్ళ అమ్మంటే తన అమ్మలా పాంట్ షర్టు వేసుకుని స్మార్ట్ గా ఉండాలి కాని, ఇలా చీర కట్టుకుని తెల్లజుట్టుతో వచ్చిందేమిటి?" అనుకున్నాడు పండు. నాన్నమ్మ వాడికి అస్సలు నచ్చలేదు. పండును చూడగానే ఆవిడ "ఏం చిన్ని నాయనా బావుండావా?" అని పలుకరించి ముద్దు పెట్టింది. చిరాగ్గా మొహం తిప్పేసుకున్నాడు. ఇంటికి వస్తున్నప్పుడంతా కారులో అందరూ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు కాని పండు మాత్రం రోడ్డుమీద వెళుతున్న కార్లను చూస్తూ కూర్చున్నాడు.

ఇంట్లోకి వెళ్ళగానే "అమ్మా, ఇల్లు చూద్దువుగాని రా" అంటూ పిలిచాడు ప్రసాద్.

"కాసేపాగినాక జూస్తాలే నాయనా, ఇమానంలో కూచుని కూచుని కళ్ళు పట్టకపోయినయ్. బాత్ రూమ్ యాడమ్మా?" అడిగింది నాన్నమ్మ. రెస్ట్ రూమ్ చూపించింది వైష్ణవి. నాన్నమ్మ రెస్ట్ రూమ్ ను బాత్ రూమ్ అని ఎందుకంటుందో అర్థం కాలేదు పండుకు.

అందరూ భోజనం చేసాక తను తెచ్చిన స్వీట్స్ ఒక ప్లేట్లో పెట్టుకుని మనవల దగ్గరకు వచ్చి "మీకోసరం తీసుకొచ్చినాను తినండి నాయనా" అంటూ వాళ్ళ ముందు పెట్టింది నాన్నమ్మ. పండు ప్లేట్ వైపు చూశాడు. వాడికి నచ్చే చాకోలేట్స్ కాని, బ్రౌనీస్ కాని లేవందులో.

"ఐ డోంట్ లైక్ దోజ్" అంటూ మొహం తిప్పేసుకున్నాడు.

"మాకు ఇండియన్ స్వీట్స్ ఇష్టం ఉండదు నాన్నమ్మా" చెప్పింది ప్రత్యూష.

"అదేందా, ఎందుకిష్టం లేదా. మనీధిలో పిలకాయలందరూ ఎంత ఇష్టంగా తిన్నారియ్యి!" అంటూ ఆశ్చర్యపోయింది నాన్నమ్మ.

"వాళ్ళకవి నచ్చవు అత్తమ్మా, మనం తిందాంలే" అంటూ వైష్ణవి ఆ ప్లేట్ తీసుకెళ్ళి ప్రసాద్ ముందు పెట్టింది.

"పిలకాయల కోసరమని శుద్ధమైన నెయ్యి తెప్పించి జేస్తినే!" నిట్టూర్చింది నాన్నమ్మ.

* * * * * * *

ప్రతి శుక్రవారం బయట డిన్నర్ చేసొచ్చి పిల్లలతో కలసి ఇంగ్లీష్ సినిమా చూడడం అలవాటు వైష్ణవి, ప్రసాద్ లకు. నాన్నమ్మ వచ్చిన తరువాత అలాగే ఒకసారి డిన్నర్ కు బయటకు వెళ్ళారు కాని నాన్నమ్మకు ఏవీ నచ్చక పోవడంతో ఆ తరువాత రెస్టారెంట్ కు వెళ్ళడం మానేశారు. పిల్లలు మరీ గొడవ పెడితే ఫాస్ట్ ఫుడ్స్ నుండి ఏదో ఒకటి తెచ్చి పెడుతున్నారు. నాన్నమ్మకు అర్థం కావని ఇంగ్లీషు సినిమాలు మానేసి తెలుగు సినిమాలే చూస్తున్నారు. పండుకు ఆ సినిమాలు అస్సలు నచ్చడం లేదు.

ఓ రోజు సాయంత్రం ఎండ తగ్గి చల్లబడిన తరువాత నాన్నమ్మ, ప్రత్యూష వాకింగ్ కి వెళ్తుంటే పండు కూడా వాళ్ళ వెనకే వెళ్ళాడు. నాన్నమ్మకు తన స్నేహితుల ఇళ్ళన్నీ చూపించింది ప్రత్యూష. ఒక ఇంటి దగ్గర పసుపు రంగులో అందంగా కనిపిస్తున్న పూలను చూస్తూ నిలబడిపోయింది నాన్నమ్మ.

నడుము మీద చెయ్యి పెట్టుకుని "బుజ్జమ్మా, ఆడ కనపడతన్నయ్ బంతి పూలు, చామంతులు గదూ" సందేహంగా అంది.

ప్రత్యూష కూడా ఆగి నాన్నమ్మ చూపించిన వైపు చూసింది. "అవి మారీ గోల్డ్, క్రిసంతమమ్ నాన్నమ్మా."

నాన్నమ్మ మూతి మీద వేలు పెట్టుకుని పరీక్షగా చూసి "లేదు బుజ్జమ్మా అవి బంతులు, చేమంతులే. బూమికి జానడంత లేవు ఎంత బాగా పూసినాయమ్మా!" అని ఆశ్చర్యపోయింది.

మరో ఇంట్లో రంగురంగుల గులాబీలు విరగబూసి ఉన్నాయి. "వీళ్ళింట్లో శానా పూలు పూశాయే, ఈ మిర్రప్పండు రంగు రోజాపువ్వు చూడు కొట్టొచ్చినట్లు కనపడతంది" అంటూ ఓ పువ్వును చూపించింది నాన్నమ్మ.

"నీకు రోజెస్ అంటే ఇష్టమా నాన్నమ్మా?" నవ్వుతూ అడిగింది ప్రత్యూష.

"మనూర్లో ఇంత పెద్దపూలు పుయ్యవు గదమ్మా, ఒక్కోటి పొద్దు తిరుగుడు పూలంతున్నయ్."

"ఈ పింక్ రోజ్ చూడు నాన్నమ్మా, చాలా బావుంది కదూ" అని ప్రత్యూష అనగానే నాన్నమ్మ పుటుక్కున తుంచేసిందా పువ్వును.

"నాన్నమ్మా ఏం చేస్తున్నావ్?" కొంచెం భయంగా అటు ఇటూ చూస్తూ అడిగింది ప్రత్యూష.

"మాపటేళ నీకు జడేసి ఈ పువ్వు పెడతాను బుజ్జమ్మా"

నాన్నమ్మ చెయ్యి పట్టుకుని ఇంటి వైపుకు తిరిగింది ప్రత్యూష. "నాన్నమ్మా అలా పువ్వు కొయ్యడం చాలా తప్పు. ఇక్కడెవ్వరూ పూలు కొయ్యరు. ఆ ఇంటి వాళ్ళు చూస్తే నీమీద కంప్లైంట్ ఇస్తారు తెలుసా" కొంచెం కోపంగా చెప్పింది ప్రత్యూష. పండు ఎవరైనా చూశారేమోనని భయంగా చుట్టూ చూశాడు.

"మనవేవన్నా వాళ్ళ ఆస్తిపాస్తుల్దీసుకున్నామా, పువ్వే గదమ్మా కోసినావా. అది కూడా తప్పంటే ఎట్టా. చిత్రంగా ఉందే" అంటూ ప్రత్యూష ననుసరించింది నాన్నమ్మ.

ఇంటికి రాగానే పిల్లలు, వైష్ణవికి నాన్నమ్మ మీద ఫిర్యాదు చేసారు. నాన్నమ్మకు అలా పక్కింట్లో పూలు కోయకూడదని తెలీదని సర్ది చెప్పింది వైష్ణవి. "నాన్నమ్మ ఈజ్ సో వియర్డ్" అనుకున్నాడు పండు.

* * * * * * *

నాన్నమ్మ వచ్చిన నాలుగు వారాల తరువాత ఓ శనివారం ఉదయం పండు నిద్రలేచి వంటగదిలోకి వెళ్ళేసరికి వైష్ణవి దోసెలు వేస్తూ ఉంది. పక్కనే కుర్చీలో కూర్చుని నాన్నమ్మ బీన్స్ వొలుస్తూ వుంది. పండు రావడం చూసి "లేచినా నాయనా, రా దోసెల్దిందులు గాని" అని రెండు దోసెలు ప్లేట్లో పెట్టి పచ్చడి వేసి టేబుల్ మీద పెట్టింది.

"ఐ డోంట్ వాంట్ దోశ, ఐ వాంట్ పాన్ కేక్స్" అంటూ వాళ్ళమ్మ దగ్గరకెళ్ళి నిలబడ్డాడు.

"నో పాన్ కేక్స్ పండూ, దోసెలు చేస్తున్నాను కదా, ఇవే తిను." చెప్పింది వైష్ణవి.

"మొన్న దోసెలు, పాన్ కేక్స్ రెండూ చేశావుగా ఇవాళ కూడా చెయ్యి"

"ఇవాళ నాకు టైమ్ లేదు నాన్నా, ఇంకా వంట కూడా చెయ్యాలి. అది పాక్ చేసుకుని మనం రోజ్ గార్డెన్ కి వెళ్ళాలి. ఇవాళ్టికి దోశెలు తినెయ్యి."

రోజ్ గార్డెన్ అనగానే వాడికి ఎంతో కోపం వచ్చింది. పైగా నాన్నమ్మ వచ్చిన తరువాత ఒక వారాంతం గ్రేట్ మాల్ కి, మరో వారం అక్కడికి నాలుగు గంటల దూరంలో వున్న గుడికి, ఇంకో వారం పక్క సిటీలో ఉన్న బంధువులింటికి ఇలా ఎక్కడికో దగ్గరకు వెళ్తూనే వున్నారు.

"ఎవ్రీ వీక్ డు వుయ్ హావ్ టు గో సమ్ వేర్? ఇట్స్ సో బోరింగ్. ఐ డోంట్ వాంట్ టు కమ్ టు రోజ్ గార్డెన్. దేర్ ఈజ్ నథింగ్ టు డు. ఆల్ వుయ్ హావ్ టు డు ఈజ్ సి దోజ్ డంబ్ రోజెస్. నాకు దోసెలు వద్దు పాన్ కేక్స్ కావాలి." మొండిగా చెప్పాడు పండు.

"నాన్నమ్మకు పూలంటే చాలా ఇష్టం నాన్నా. ఒక్కసారి రోజ్ గార్డెన్ చూపిద్దాం. నీకు మరెప్పుడైనా పాన్ కేక్స్ చేసిస్తానుగా. అల్లరి చేయకుండా దోసెలు తినమ్మా." బతిమలాడింది వైష్ణవి.

"ఐ డోంట్ వాంట్ టు ఈట్ ఎనీ థింగ్" అంటూ ఏడుస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

సరాసరి వాళ్ళక్క దగ్గరికి వెళ్ళి "ఐ డోంట్ లైక్ నాన్నమ్మ. వెన్ విల్ షి లీవ్ అక్కా?" అడిగాడు పండు.

"ఐ డోంట్ నో" దీక్షగా బొమ్మలు గీస్తున్న ప్రత్యూష తలెత్తకుండానే సమాధానమిచ్చింది.

"ఆఫ్టర్ షి కేమ్ ఎవ్రీ థింగ్ హాజ్ చేంజ్డ్. నాన్న ఈజంట్ టేకింగ్ మీ ఎనివేర్" అంటూ టెడ్డీ బేర్ ని హత్తుకుని మంచం మీద గోడవైపు తిరిగి పడుకున్నాడు.

కొద్దిసేపటికి నాన్నమ్మ "ఇవిగో చిన్ని నాయనా పాను కేకులు" అంటూ పండు దగ్గరకు వచ్చింది. తనకేం వద్దని చెప్పాలనుకుంటూ పక్కకు తిరిగి ప్లేట్ వైపు చూశాడు. అందులో గోధుమ రంగులో మూడు గుండ్రని పాన్ కేక్స్, పైన చిన్న బట్టర్ పీస్, సిరప్ తో నోరూరిస్తూ వున్నాయి. నాన్నమ్మ చేతిలోని ప్లేట్ తీసుకున్నాడు. ఆ సాయంత్రం ప్రత్యూష, "నాన్నమ్మకు ఎందుకనో ఇవాళ రోజ్ గార్డెన్ వెళ్ళకుండా ఇంట్లోనే ఉందామనిపించిందట పండూ, అందుకే మనం ఉదయం నుండీ ఎక్కడికీ వెళ్ళలేదు" అని చెప్పింది.

*      *      *      *      *      *      *

ఓ రోజు మధ్యాహ్నం గార్డనర్ వచ్చి బయట లాన్ మోవ్ చేస్తున్నాడు. నాన్నమ్మ ఆసక్తిగా చూస్తూ "ఈ సేద్దిగాడు భలే చిత్రంగా గడ్డి కోస్తున్నాడే. గడ్డికి ఏ లెక్కనిస్తాడు?" ప్రసాద్ ని అడిగింది.

ప్రసాద్ నవ్వాడు. "అతనేం ఇవ్వడమ్మా. అలా కోసినదానికి మనమే అతనికి డబ్బులు ఇవ్వాలి."

"మనమే ఇవ్వల్నా, సిత్రంగా వుందే! పచ్చగడ్డి నవనవలాడతా వుంది, డిల్లీ బర్రెకేస్తే పూటకు రెండు శేర్ల పాలిస్తది. మనూర్లో ఎంత పిరెమది. ఆ గడ్డంతా గూడా ఊరకనే తీసకపోతాడా?"

"అతనా గడ్డిని ఇంటికి తీసుకెళ్ళడమ్మా. కట్ చేసి పెద్ద డబ్బాలో వేస్తే, బుధవారం చెత్త తీసుకెళ్ళే వాళ్ళు వచ్చి తీసికెళ్ళిపోతారు"

"ప్చ...మన గడ్డంతా ఉర్దాగా బోవల్సిందేనా!" నిట్టూర్చింది.

"మన గడ్డి కాదు మా గడ్డి" కోపంగా చెప్పాడు పండు. ప్రసాద్ వాడిని కోప్పడబోతుంటే, "పసోడ్రా వాడికి తెలియక అన్నాడ్లే. వాడ్నేం అనబాక" అంటూ నవ్వేసింది నాన్నమ్మ.

ఓ రోజు పండు స్కూల్ నుండి రాగానే పెరట్లో నాన్నమ్మ ఏదో చేస్తూ కనిపించింది. తలుపు దగ్గరే నిలబడి చూసాడు. నాన్నమ్మ పొట్లంలోనుండి ఏవో తీసి మట్టిలో ఒకటొకటే వేస్తోంది.

"ఏం చేస్తున్నావ్ నాన్నమ్మా? అడిగాడు పండు.

"ఇత్తనాలు జల్లుతున్నాను నాయనా. నీకు బెండకాయలంటే ఇష్టమని బెండ ఇత్తనాలేస్తన్నాను."

దగ్గరికి వెళ్ళి వంగి నాన్నమ్మ విత్తనాలు వేస్తున్న వైపు చూస్తూ "ఇవి మట్టిలో వేస్తే బెండకాయలు వస్తాయా?"

"ఇయ్యి మొలిచి, పెద్దైనాక శానా బెండకాయలు కాస్తాయి. నువ్వు గూడా ఏస్తావా?" అంటూ నాన్నమ్మ నాలుగు విత్తనాలు తీసి పండు చేతిలో పెట్టి "ఇక్కడ చిన్న చిన్న గుంటలున్నయ్ జూడు వాటిల్లో ఎయ్యి" అని విత్తనాలను వేయించింది.

ఓ పదిరోజుల తరువాత "చిన్ని నాయనా నువ్వేసిన ఇత్తనాలు జూద్దువురా, పచ్చంగా మొల్చినాయి" అంటూ నాన్నమ్మ పిలవడంతో పెరట్లోకి వెళ్ళాడు పండు. మట్టిలో వరుసగా చిన్ని చిన్ని మొక్కలు మొలిచి వున్నాయి. అప్పటినుండీ నాన్నమ్మ, మనవడూ రోజూ వాటిని చూస్తూ వాటి గురించి బోలెడు కబుర్లు చెప్పుకున్నారు. నాన్నమ్మ వాడికి మెంతి, గోంగోర, బీన్స్, టమాటో అన్ని మొక్కల గురించి చెప్పింది. కొన్ని మొక్కలు చూస్తుండగానే వాడికంటే ఎత్తై పోవడం వాడికి చాలా ఆశ్చర్యం అనిపించింది. ప్రతి రోజూ స్కూలు నుండి రావడంతోనే నాన్నమ్మతో కలసి పెరట్లో చెట్లను చూడడం, వాటికి కాసిన కాయలను ఇంట్లోకి తెచ్చి వాళ్ళమ్మ కివ్వడం వాడికిప్పుడు చాలా ఇష్టం.

ఓ రోజు పండు స్నానం చేసి వచ్చేసరికి వాడికో వింత దృశ్యం కనిపించింది. ప్రత్యూష, నాన్నమ్మ 'మంకాలా' ఆడుతున్నారు. వెళ్ళి వాళ్ళదగ్గర కూర్చున్నాడు.

"నాన్నమ్మా నీకు బోర్డు గేమ్సు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు పండు.

"నాన్నమ్మకు 'స్నేక్స్ అండ్ లాడర్స్', 'హాప్ స్కాచ్' అన్నీ తెలుసట పండూ" చెప్పింది వైష్ణవి.

"చిన్నప్పుడు ఇయ్యన్నీ బాగా ఆడేవాళ్ళం నాయనా. పేర్లు మార్పంతే, మేమిప్పుడు ఆడతన్న దాన్ని 'వామనగుంటలు' అంటాం. మీరు 'పాము నిచ్చెన' ఆడతారు అది 'వైకుంఠపాళి', మీ అక్క 'హాపు స్కాచి' ఆడతళ్ళా, అది 'కుందుడు గుమ్మ'" అని నవ్వుతూ చెప్పింది.

"చిట్టి తల్లీ, స్విమ్మింగ్ క్లాస్ గురించి మరిచేపోయాం. రా రా త్వరగా రెడీ అవ్వు, టైమ్ అవుతోంది" అంటూ వైష్ణవి తొందర పెట్టడంతో ఆట మధ్యలోనుండి లేచి వెళ్ళిపోయింది ప్రత్యూష.

"రా నాయనా అక్క ఆట ఆడుదువుగాని" పిలిచింది నాయనమ్మ.

"నాకిది ఇష్టం లేదు. నేను 'మారియో కార్ట్' ఆడుకుంటాను"

"అది కూడా ఇట్టాంటిదేనా?"

"అ...ఆ, అది బోర్డ్ గేమ్ కాదు నాన్నమ్మా, వీడియో గేమ్"

"అదెట్టుంటదో చూపిద్దువు పా" అంటూ పండుతో పాటు గేమ్ రూమ్ లోకి వచ్చింది.

పండు ఎలా ఆడాలో చూపించాడు. "అది నేనాడ్లేను గాని, నువ్వు ఆడుతుంటే జూస్తాలే" అంటూ పండు పక్కనే కూర్చుని "వాడు గోడమింద నుండి దూకుతున్నాడు జూడు. ఆ కారు చెట్టుని గుద్దేస్తంది పక్కకు తిప్పు, తొందరగా తిప్పు" అని

సూచనలిస్తూ వాడితో పాటు సమానంగా ఆ ఆటలో పాల్గొంది. ప్రత్యూషకు వీడియో గేమ్స్ ఇష్టం వుండవు. ఆ ఇంట్లో వాడితో ఎవరూ వీడియో గేమ్స్ ఆడరు. నాన్నమ్మ అలా పక్కనే కూర్చుని గేమ్ చూడడంతో వాడా రోజు చాలా ఉత్సాహంగా ఆడాడు.

* * * * * * *

ఇప్పుడు నానమ్మతో బయటకు వెళ్ళడం వాడికి చాలా ఇష్టం. నాన్నమ్మ కార్లో కూర్చోగానే తనే ఆవిడకు సీట్ బెల్ట్ పెడతున్నాడు. దారంతా వాళ్ళ నాన్నమ్మతో బోలెడు కథలు, పద్యాలు చెప్పించుకుంటున్నాడు. నాన్నమ్మతో కలసి ఉదయాన్నే 'శుక్లాం బరదరం', 'సరస్వతి నమస్థుభ్యం' శ్లోకాలు చెప్పడం బాగా వచ్చేసింది పండుకు. ఆమె చేసిన స్వీట్స్ కూడా ఇష్టంగా తింటున్నాడు. అన్నిటికి మించి తెలుగులో స్పష్టంగా మాట్లాడడం రావడంతో ఇద్దరూ బోలెడు కబుర్లు చెప్పుకుంటున్నారు. నాన్నమ్మ ఇండియా ప్రయాణం దగ్గర పడింది. రేపుదయం ప్రయాణమనగా ఆ రాత్రి వాడు వాళ్ళ నాన్నమ్మ దగ్గరే పడుకున్నాడు.

"నాన్నమ్మా నువ్వు అప్పుడే వెళ్ళి పోవాలా?"

"అప్పుడే ఏంది చిన్ని నాయనా, నేనొచ్చి ఆరునెల్లవలా."

"అయితే ఏం, ఇక్కడే ఉండు నాన్నమ్మా, నువ్వు వెళ్ళొద్దు."

"అట్టంటే ఎట్ట నాయనా, మీ అత్త, వికాసు ఫోనులో రోజూ రమ్మని పిలుస్తా వుండారు."

"అయితే ఇండియా వెళ్ళి వాళ్ళను చూసి త్వరగా వచ్చెయ్యి"

నాన్నమ్మ నవ్వింది. "నువ్వే ఇండియాకి రా నాయనా, అప్పుడందర్నీ చూడొచ్చు. ఇంకా నీకు బర్రెలు, కోళ్ళు , బాతులు, చెరువు అన్నీ చూపిస్తా."

"అవన్నీ మనూర్లో ఉన్నాయా?"

"ఆ అవన్నీ మనూర్లోనే వున్నాయి. ఇంకా మన చేలో తాటికాయలు కూడా తినొచ్చు. వచ్చే ఎండాకాలం సెలవలకి నువ్వూ, అక్కా, అమ్మా, నాన్నా అందరూ రాండి, సరేనా"

"అలాగే నాన్నమ్మా. మేం వచ్చాక మాతో పాటు మళ్ళీ నువ్వు వచ్చేయాలి మరి" అంటూ ఆమె చుట్టూ చెయ్యి వేసి పడుకున్నాడు.

ఎయిర్ పోర్ట్ లో పండుకు, ప్రత్యూషకు ముద్దు పెట్టి, వైష్ణవికి జాగ్రత్తలు చెప్పి, వేసవిలో ఇండియాకు రమ్మని ప్రసాద్ కి మరీ మరీ చెప్పి సెక్యూరిటీ గేట్ లోనుండి లోపలకు వెళ్ళిపోయింది నాన్నమ్మ.

ఇప్పుడు పండుకు తన కార్ సీట్ ముందు సీట్ లో ఉండడం అస్సలు నచ్చట్లేదు.

“అది నాన్నమ్మ సీట్, దాన్ని అలాగే వుంచెయ్యా”లంటూ వెనకే కూర్చుండి పోతున్నాడు.

వాడి గదిని కూడా వాడు నాన్నమ్మ గదనే పిలుస్తున్నాడు. రోజుకోకసారి “సమ్మర్ ఇంకా ఎన్ని రోజులుంది?” అని అడగడం వాడి దినచర్యలో ఒక భాగం అయిపోయింది.

●●●

## బుజ్జిపండు ఇండియా టూర్! సంగీతం

పండు, భారత దేశంలో వున్న వాళ్ళమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళి వారం అయింది. పోయినసారి వెళ్ళినప్పుడు బాగా చిన్నవాడు. బహుశ వాడికప్పుడు రెండేళ్ళు ఉంటాయేమో! వాడికి ఉహ తెలిశాక ఇప్పుడే వెళ్ళడం. పండు, వాళ్ళ అమ్మ, అక్క అందరూ కలిసే వెళ్ళారు, వాళ్ళ నాన్న మాత్రం ఓ నెల తరువాత వెళ్తాడు.

పండు వాళ్ళమ్మమ్మ వాళ్ళది ఒక మోస్తరి పట్టణం. ఇంటి చుట్టూ నిశ్శబ్దంగా ఉండే పరిసరాల నుండి వచ్చాడేమో, వాళ్ళమమ్మ వాళ్ళ వీధిలో నుండి లోపలి గదుల వరకూ వినిపించే రకరకాల వాహనాల శబ్దాలు, పక్షుల అరుపులు, కూరగాయలు అమ్మేవాళ్ళ పిలుపులు, కారు హారన్ లు వాడికి చాలా నచ్చేశాయి. నిద్ర లేవగానే ఇంటి ముందున్న పోర్టికోలో నిలబడి ఆసక్తిగా ఆ వీధిలో వెళ్ళే వాటిని చూడడం ప్రస్తుతం వాడి దినచర్యలో ముఖ్యమైన భాగం. ఇవాళ కూడా అలాగే బాల్కనీలో నిలబడి కొబ్బరి ఆకుల మధ్య కిలకిలలాడుతున్న పక్షుల జంటను వెతుకుతుండగా ఎవరో వస్తున్నట్లనిపించి గేటు వైపు చూసాడు. ఓ వయసు మళ్ళిన వ్యక్తి, భుజానికి గుడ్డ సంచి తగిలించుకుని కర్ర సాయంతో నడుస్తూ గేటు వైపు వస్తున్నాడు. చిరుగుల చొక్కా, మురికి పట్టిన నీరుకావి పంచె అతని వంటిమీద వదులుగా వేలాడుతూ ఉన్నాయి. నిన్న సాయంత్రం అలాంటి అతనే గుడి దగ్గర కనిపిస్తే పండు వాళ్ళమ్మ వైష్ణవి అతనికి పది రూపాయలిచ్చింది.

"అమ్మమ్మా బెగ్గర్ గారు వచ్చారు" ఇంట్లోకి చూస్తూ గట్టిగా కేక పెట్టాడు పండు. లోపలనుండి అమ్మ, అమ్మమ్మల నవ్వులు వినిపించాయి. చెట్ల దగ్గర కింద పడిన ఆకులు ఊడిచి శుభ్రం చేస్తున్న లక్ష్మి పడీపడీ నవ్వింది. పండుకు బోలెడు కోపం వచ్చింది. ఏం మాట్లాడినా అలా గట్టిగా నవ్వేస్తుంటే ఎవరికి మాత్రం కోపం రాదు. వాళ్ళెందుకు నవ్వేరో వాడికసలు అర్థం కాలేదు కూడా.

మొన్నో రోజు వాడు, వాళ్ళక్క ప్రత్యూష ఇంటి ముందు రాలిన వేపకాయలను చిన్న పుల్లలకు తగిలించి దూరంగా విసిరేస్తూ ఆడుకుంటున్నారు. ఇంతలో ఓ పెద్దాయన వచ్చి

"మీ తాతయ్య ఇంట్లో ఉన్నాడా?" అని అడిగాడు.

"లేడు. బజార్ కి వెళ్ళాడు" సమాధానమిచ్చాడు పండు.

"మీ తాతయ్య వచ్చాక నీ కోసం రమణయ్య వచ్చాడని చెప్పు" అని చెప్పి ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు.

ఆ మధ్యాహ్నం తాతయ్య ఇంటికి రాగానే టివి చూస్తూ గూడా గుర్తుపెట్టుకుని "నీకోసం రమణయ్య వచ్చాడు తాతయ్యా" అని చెప్పాడు పండు.

"పండూ, పెద్దవాళ్ళను అలా పేరు పెట్టి పిలవకూడదు. ఏదో ఒక వరుసతోనో, గారు అనో అనాలి. అలాగే వచ్చారు అనాలి, వచ్చాడు అనకూడదు." సరి చేసింది వైష్ణవి.

అది గుర్తొచ్చే ఇవాళ బెగ్గర్ గారు అంటే వాళ్ళంతా ఒకటే నవ్వడం. అసలు గారు అనాలా వద్దా అని ఆలోచిస్తుండగా వీధిలో "తాటి ముంజెలో..." అని అరుస్తూ ఒకామె గంప నెత్తిన పెట్టుకుని వెళ్తోంది. అమ్మమ్మ హడావిడిగా బయటకు వచ్చి ఓ తాటి ముంజెలమ్మాయ్ ఇట్రా" అని పిలుస్తూ గేటు తీసింది. ఆవిడ వచ్చి గంప కిందకు దింపగానే తాటాకుల మధ్య వున్న ముంజెల వైపు చూస్తూ

"లేతవేనా?" అని అడిగింది.

"లేతయ్యేనమ్మా, తీపుమ్ముంజెలు" అంటూ ఒకటి తీసి అమ్మమ్మకిచ్చింది.

అమ్మమ్మ కొంచెం తుంచి పండుకు, ప్రత్యూషకు చెరో ముక్క పెట్టి, తానోముక్క తీసుకుంది. ఆమె చెప్పినట్లు చాలా తియ్యగా ఉన్నాయవి.

"ఎంతకిస్తావు?" అడిగిందమ్మమ్మ.

"పది రూపాయలకు నాలుగమ్మా"

"పదికి ఏడివ్వు"

"గిట్టదమ్మా"

"ఎందుకు గిట్టదు, నిన్న కూడా పదికి ఏడు లెక్కన తీసుకున్నాం"

"ఇయ్యి కొండాపురం ముంజెలమ్మా, లేత కొబ్బిరిలాగుంటాయి. ఐదు చేసి తీసుకోండి"

"సరేలే ఆరివ్వు. ఇంక బేరం లేదు." అని అమ్మనడిగి గిన్నె తీసుకురమ్మని పండుకు పురమాయించింది.

పెరట్లో వున్న అమ్మ దగ్గరకి వెళ్లి పండు "అమ్మ నీ అమ్మ గిన్నె తీసుకురమ్మంది" అని చెప్పగానే, వైష్ణవి, బట్టలుతుకున్న లక్ష్మి గట్టిగా నవ్వేశారు. గిన్నె తీసుకెళ్ళే హడావిడిలో వాళ్ళ నవ్వుల్ని వాడు పెద్దగా పట్టించుకోలేదు.

ఆ సాయంత్రం దీపాలు పెట్టేవేళ తాతయ్య గేటు తీయడం చూసి "అమ్మమ్మా మీ నాన్న వస్తున్నాడు" అంటూ పరిగెత్తుకుంటూ లోపలకు వచ్చాడు పండు. మా నాన్న చనిపోయి పదేళ్ళు అవుతోంది. ఇప్పుడు రావడం ఏమిట్రా, పైగా ఆయన్ను నువ్వు చూడను కూడా లేదు అంటూ ఆశ్చర్యంగా ముందు గదిలోకి వచ్చింది అమ్మమ్మ.

"ఆరి భడవా మీ తాతయ్యను పట్టుకుని మా నాన్న అంటావే" అని బోలెడు ఆశ్చర్యపోయింది.

"ఆయన మా నాన్న పండూ, అమ్మమ్మ వాళ్ళ నాన్న కాదు" వివరించింది వైష్ణవి.

"మరి ఆయన అమ్మమ్మకు ఏమవుతాడు?"

"హస్బెండ్ అవుతాడు"

"అయితే ఈసారి నుండి "అమ్మామ్మా నీ హస్బెండ్ వచ్చాడు, అని చెప్తాలే" అని వాళ్ళ అక్క పిలిస్తే పరిగెత్తుకుంటూ పక్కగదిలోకి వెళ్ళి పోయాడు.

కూరగాయలు తెచ్చే ఆమెను పెద్దమ్మగారు అని, ఆటో అతన్ని ఆటో మామయ్య అని ఇలా అందర్నీ నానా రకాల పేర్లతో పిలిచి ఇంట్లో వాళ్ళను తెగ నవ్వించేస్తున్నాడు పండు. వాళ్ళ నవ్వులకు మొదట్లో కొంచెం ఉక్రోషపడినా తరువాత వాడికి అది సరదాగానే వుంది.

*                *                *                *                *                *

ఓ నెల తరువాత ప్రసాద్ రాగానే ఇంట్లో అందరూ వైష్ణవి వాళ్ళ మేనత్త గారి ఊరు గూడూరుకు వెళ్ళారు. పండు రిక్షాలోనో ఆటోలోనో వెళ్లాలని సరదా పడ్డాడు కాని, అలా వీల్లేదు కారులోనే వెళ్ళాలనడంతో అయిష్టంగానే ఒప్పుకున్నాడు. ఆ రాత్రి భోజనాలు అయ్యాక

"నాన్నమ్మా, మీ ఇంట్లో మొగుడి రేకులు రావా?" అడిగాడు పండు.

దొడ్లో చాలా పూలున్నాయి నాయనా. ఇప్పుడు పొద్దు పోయిందిగా రేపుదయన్నే కోసుకుందుర్లే" చెప్పింది వైష్ణవి వాళ్ళ మేనత్త.

"పూలు కాదు నాన్నమ్మా టివిలో చూస్తామే ఆ 'మొగుడి రేకులు'" ఆవిడకు అర్ధం అయ్యేలా వివరించాడు పండు.

"ఓ మొగలి రేకులా!" అని అమ్మమ్మ అనగానే అందరూ ఒకటే నవ్వడం. ఈ పెద్దవాళ్ళకు చిన్నవాళ్ళను చూస్తే ఎందుకంత నవ్వొస్తుందో అస్సులర్థం కాదు పండుకు.

మరుసటి రోజు మధ్యాహ్నం వైష్ణవి వాళ్ళ మేనత్త, వైష్ణవి, అమ్మమ్మ బంగారు అంగడికి వెళ్తూ పండును కూడా తీసుకుని వెళ్ళారు. వాళ్ళకు నచ్చిన గాజులను చూసి వాటి ఖరీదెంతో చెప్పమని అడిగారు. ఆ కొట్టతను వాటిని తూకం వేసి నలభై ఆరు వేలని చెప్పాడు.

"ఇచ్చే రేటు చెప్పండి. నిన్నవీటిని మేం నలభై వేలకే కొన్నాం" అని పండు అనగానే ఆక్కడున్న వాళ్ళందరూ ఒకటే నవ్వడం.

ఆ కొట్టతను నవ్వుతూ "నీకయితే ఐదు వేలకే ఇస్తాను బాబూ" అని పండు వెళ్ళేప్పుడు ఓ వెండి ఉంగరం వేలికి తొడిగి పంపించాడు.

*        *        *        *        *        *

ప్రసాద్ వాళ్ళ సొంతూరు ఉప్పలపాడు. అది గూడూరుకు పది కిలోమీటర్ల దూరంలో వుంది. అక్కడ ప్రస్తుతం ప్రసాద్ వాళ్ళ

బాబాయి ఉంటున్నారు. ఉదయాన్నే గూడూరులో టిఫిన్ చేసి అందరూ ఉప్పలపాడుకు బయలుదేరి వెళ్ళారు. అదో చిన్న పల్లెటూరు. మొత్తం వెయ్యి గడపలు ఉన్నాయేమో. నాగరికత పోకడలు పెద్దగా పొక్కని ఊరు.

ఊరి చివర వున్న గుడిసెలు చూసి "తాతయ్యా, మనం కూడా అలా కేంపింగ్ చేద్దామా?" అని అడిగాడు పండు. "అవి కాంప్ సైట్స్ కావు పండూ, వాళ్ళు ఆ ఇళ్ళలోనే ఉంటారు" అని తాతయ్య చెప్పినా వాడికి నమ్మకం కలగలేదు. అంత చిన్న ఇంట్లో ఉండడం అసాధ్యం అనే వాడి భావన. అక్కడే మట్టిలో రెండు తాటి బుర్రలను ఒక కర్రకు కట్టి మరో కర్రతో నెట్టుకుంటున్న చిన్న పాపను, ఆ పక్కనే సైకిల్ టైర్ ను పుల్లతో నెడుతూ పరిగెడుతున్న పిల్లవాణ్ణి చెట్టు మీద గోలగోలగా అరుస్తున్న కాకులను చూసి "హౌ లక్కీ" అనుకుని కనిపించినంత దూరం వాళ్ళను చూస్తూనే ఉన్నాడు పండు.

ప్రసాద్ వాళ్ళ బాబాయి వాళ్ళ ఇంటి దగ్గర కారు దిగ్గానే, ఇంటి ప్రహరీ గోడ పక్కగా మట్టిలో గింజలు తింటున్న కోడి వెంట పడ్డాడు పండు. వాళ్ళ బాబాయి "ఒరేయ్ అది మన కోడి కాదురా పక్కింటి వాళ్ళది" అని పండును లోపలకు తీసుకుని వెళ్ళాడు. గేటు దాటగానే ఇంటి ముందు కట్టేసిన గేదెల్ని, ఎద్దుల్ని చూసి పండు చాలా సరదా పడ్డాడు. ఆ గేదె మీద తనని కూర్చోబెట్టమని ప్రసాద్ దగ్గర మారాం చేసి మారీ గేదె మీదెక్కి కూర్చున్నాడు. ఇంటి ముందే మరో మూలనున్న బావిలోంచి చేదతో నీళ్ళు తోడాడు. కట్టెలతో మండుతున్న పొయ్యిని మోకాళ్ళ మీద వంగి ఆశ్చర్యంగా చూసాడు.

పెరట్లో తిరుగుతున్న బాతుపిల్లల్ని అరచేతిలో పెట్టుకుని ముద్దుచేస్తూ అక్కడ ఉన్నంత సేపూ వాటితోనే ఆటలు. ఇంటికి వెళ్ళే సమయానికి వాటిని కూడా తీసుకెళ్లాలని గొడవ పెట్టాడు. ఇప్పుడు కాదులేరా ఇంకో పదిరోజులకు ఇంకా పిల్లలు వస్తాయి అప్పుడు తెచ్చి ఇస్తానని బాబాయి వాగ్దానం చేసాక ఇంటికి బయలుదేరాడు. బాబాయి, సపోటాల బుట్ట, ఓ రెండు డజన్ల జామకాయలు, కూరగాయల విత్తనాలు, ఎండిపోయిన బంతి పువ్వులు అన్నీ మూట కట్టి కారులో పెట్టించాడు. తరువాత ప్రతిరోజూ ప్రసాద్ ని వాళ్ళ బాబాయికి ఫోన్ చెయ్యమని బాతులు గురించి గుర్తు చేస్తూనే ఉన్నాడు. బాబాయి ఇచ్చిన మాట ప్రకారం పది రోజుల తరువాత ఓ మూడు బాతులను తెచ్చిచ్చాడు. అమ్మమ్మ ఈ టౌన్ లో బాతులను ఎలా పెంచుదాం అని గొడవ పెట్టినా తాతయ్య మాత్రం పండు అమెరికా వెళ్ళినా తనా బాతులను జాగ్రత్తగా చూసుకుంటానని మాటిచ్చాడు.

* * * * * *

ఓ రోజు సాయంత్రం తాతయ్య, అయన స్నేహితుడు నారాయణ మూర్తి మాట్లాడుకుంటూ మధ్య గదిలో కూర్చున్నారు. మాటల మధ్యలో నారాయణ మూర్తి తమ పక్కింటి వారి చిన్న పాపకు డెంగ్యూ ఫీవర్ వచ్చిందని, ప్రస్తుతం ఆ పాప హాస్పిటల్ లో

ఉందని చెప్పాడు. ఆరునెలల క్రితమే ఆ వీధిలో ఓ ముప్పై ఏళ్ళ వ్యక్తి అదే జ్వరంతో చనిపోయిన విషయం గుర్తుతెచ్చుకుని వాళ్ళిద్దరూ చాలా బాధ పడ్డారు.

ఆ పక్కనే కూర్చుని ఆడుకుంటున్న పండు తాతయ్య దగ్గరకు వచ్చి "దోమలు కుట్టేప్పుడు వాటికి మ్యూజిక్ ఎందుకు తాతయ్యా సైలెంట్ గా కుట్టొచ్చుగా " కాలిమీద ఎర్రగా కందిన భాగాన్ని చూస్తూ అడిగాడు పండు.

"మేం చిన్నతనాన్నుండి దోమలతో కుట్టించుకుంటున్నాం గాని పండూ, మాకీ సందేహం ఎప్పుడూ రాలేదురా" అని భళ్ళున నవ్వాడు నారాయణ మూర్తి.

"అసలు ఇండియా ఫ్లాగ్ లో వీల్ ఉంటుంది కదా తాతయ్యా, ఆ వీల్ మధ్యలో దోమ బొమ్మ పెట్టాలి. చుట్టూ యారోస్ అన్నీ దోమ వైపు పాయింట్ చెయ్యాలి. ఇండియాలో ఆర్మీ, పోలీస్ ఇంకా ఇండియాలో మనుషులందరూ దోమల్ని చంపడానికే ఎఫర్ట్స్ పెట్టాలి"అంటూ కందిపోయిన భాగమ్మీద గట్టిగా రుద్దుకుంటూ కొంచెం ఆవేశంగా చెప్పాడు పండు.

"ఈ రోజున ఇండియాలో దోమ కాటు వలన ఎన్నెన్ని జబ్బులు, జ్వరాలు వస్తున్నాయో, ఎంత మంది మనుషులు రాలిపోతున్నారో లెక్కే లేదు. చిన్నవాడివైనా బాగా చెప్పావు పండూ. దోమలు లేకుండా వుండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. అలా ఉండాలంటే ప్రజలలో అవేర్ నెస్ రావాలి. రోడ్లు చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉండాలి. ఎక్కడా మురుగు నీరు నిలువకుండా చూడాలి. ఇవన్నీ చేయగలిగితే మన దేశం సగం బాగు పడ్డట్లే. నీ కోరిక ప్రకారం అలా జరుగుతుందనే ఆశిద్దాం పండూ" సుదీర్ఘంగా చెప్పాడు తాతయ్య.

●●●

# తెలుగు బడి

వేసవి సెలవల్లో పండు, ప్రత్యూష స్విమ్మింగ్, టెన్నిస్, అడ్వెంచర్, ఆర్ట్ ఇలా రకరకాల క్యాంపులకు వెళ్ళి సరదాగా గడిపేస్తున్నారు. ఓ రోజు సాయంత్రం ఏడయినా బాగా ఎండగా ఉండడంతో బయటకు వెళ్ళకుండా పిల్లలిద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని 'మోనోపాలి' ఆడుతున్నారు. ప్రసాద్ ఇంటికి వస్తూనే "వైష్ణవీ, పిల్లల్ని 'తెలుగు బడి'లో చేరుస్తామని చెప్పావటగా ఈ

సెప్టెంబర్ నుండి కొత్త తరగతులు మొదలౌతున్నాయని, ఆగస్ట్ పదిహేనున జరిగే పేరెంట్ మీటింగ్ కి రమ్మని శంకర్ చెప్పాడు" అంటూ పిల్లల పక్కనే కుర్చీలాక్కుని కూర్చున్నాడు.

"వాట్ ఈజ్ 'తెలుగు బడి'?" అడిగాడు పండు.

"బడి అంటే స్కూల్. అక్కడ తెలుగు నేర్పిస్తారు నాన్నా" చెప్పింది వైష్ణవి.

"మాకు తెలుగొచ్చుగా. వై డు వుయ్ నీడ్ బడి?" ఆశ్చర్యంగా అడిగింది ప్రత్యూష.

"మీకు తెలుగులో మాట్లాడం కొంచెమే వచ్చు. కాని స్పష్టంగా మాట్లాడం, చదవడం, రాయడం కూడా రావాలి" ఓపిగ్గా వివరించాడు ప్రసాద్. పండుకు తను ఎప్పుడో చూసిన తెలుగు పత్రిక, అందులో తనకు అర్ధం కాని భాషలో ఏమిటో వ్రాసి వుండడం గుర్తొచ్చి సంతోషంగా ఒప్పుకున్నాడు.

వైష్ణవి, ప్రసాద్ పేరెంట్ మీటింగ్ కి వెళ్ళి , ఓ రెండు బాగ్ లలో కొన్ని పుస్తకాలు తీసుకొచ్చారు. ఇంటికి రాగానే పిల్లల్ని పిలిచి చెరో బాగ్ చేతికిచ్చారు. పండు ఆసక్తిగా వాటిని తీసి చూశాడు. ఒక పుస్తకంలో కొన్ని అక్షరాలూ, ఖాళీ లైన్స్ కనిపించాయి ఇంకో పుస్తకంలో పండ్లు, కూరగాయలు ఇంకా రకరాకాల వస్తువుల బొమ్మలు వున్నాయి. వాడికి వాటి కింద ఏం రాసి వుందో మాత్రం అర్ధం కాలేదు. వాళ్ళమ్మనడిగి అన్నీ చెప్పించుకున్నాడు. ప్రత్యూష ఓ రెండేళ్ళ క్రితం గుణింతాల వరకు నేర్చుకుంది కాని, ప్రస్తుతం ఏమీ గుర్తు రావడం లేదన్నది. వాళ్ళ నాన్న చెప్తుంటే ఒక్కొటొక్కటిగా గుర్తుకు తెచ్చుకుంది. ప్రతి ఆదివారం తెలుగు తరగతికి వెళ్ళేప్పుడు ఇండియన్ ట్రెడిషనల్ బట్టలే వేసుకెళ్ళాలని వాళ్ళ టీచర్ చెప్పినట్లుగా పిల్లలకు చెప్పాడు ప్రసాద్.

"వు ఆర్ గోయింగ్ టు తెలుగు క్లాస్ టు లెర్న తెలుగు. వై డు వు నీడ్ స్పెషల్ డ్రెస్ ఫర్ దట్?" అడిగింది ప్రత్యూష.

"మీరు స్విమ్మింగ్ కి, టెన్నిస్ కి, కరాటేకి వెళ్ళేప్పుడు స్పెషల్ డ్రెస్ వేసుకుంటున్నారా, లేదా! ఇది కూడా అంతే" వివరించింది వైష్ణవి.

* * * *

తెలుగు బడికి వెళ్ళే రోజు పండు గోధుమరంగు కుర్తా, పైజమా వేసుకున్నాడు. ప్రత్యూష చిలకపచ్చరంగు పట్టులంగా, కెంపురంగు జాకెట్ వేసుకుని తయారయ్యింది. పిల్లలిద్దరికీ తెలుగు బడి కోసమని వాళ్ళమ్మమ్మ పంపించిన బట్టలవి. ప్రసాద్ వాళ్ళను విరగబూసిన 'హైడ్రేంజియా' పొద దగ్గర నిలబెట్టి ఫోటో తీశాడు. తెలుగు బడి అంటే విశాలమైన ఆవరణలో ఉండే పెద్ద బడేమీ కాదు. స్వచ్చందంగా ముందుకు వచ్చిన కొంతమంది వారి వారి ఇళ్ళలో ఒక గదిలో తెలుగు పాఠాలు చెప్తారు. వీళ్ళు వెళ్ళేటప్పటికి అక్కడికి

చాలా మంది పిల్లలు వచ్చారు. అందరి చేతుల్లోనూ తెలుగు బడి అని రాసివున్న బాగ్ లు వున్నాయి. ప్రసాద్ అక్కడ టీచర్ తో మాట్లాడి పండును ఒక తరగతిలోకి వెళ్ళమని చెప్పి, ప్రత్యూషను వేరే దగ్గర జరుగుతున్న క్లాసుకు తీసుకెళ్ళాడు.

పండు లోపలకు వెళ్ళేసరికి అప్పటికే అక్కడ ఓ పది మంది పిల్లలు రెండు వరుసలలో కూర్చుని వున్నారు. టీచర్ పిల్లలందర్నీవారి పేరు, వాళ్ళ అమ్మానాన్నల పేర్లు చెప్పమని అడగారు. ఒక్కొక్కరు పైకిలేచి నిలబడి వారి పేర్లు చెప్పి పరిచయం చేసికున్నారు. టీచర్ వాళ్లకు తెలుగు అక్షరాలతో మొదలయ్యే పదాలు వున్న పుస్తకం చూపించి అన్నీ చదివి వినిపించారు. పండుకు చాలా అక్షరాలు గుండ్రంగా ఒకేలా కనిపించాయి. ఆ పుస్తకంలో చాలా పదాలు వాడు ఎప్పుడూ విని ఉండకపోవడంతో చాలా కొత్తగా అనిపించింది. చాలావరకు అర్థం కాలేదు కాని ఆ పుస్తకంలో బొమ్మలు మాత్రం వాడికి బాగా నచ్చాయి.

"అక్కా తెలుగు ఈజ్ సో కాంప్లికేటెడ్" కార్ ఎక్కగానే ప్రత్యూషతో అన్నాడు పండు.

"మొదట్లో అలాగే అనిపిస్తుంది పండూ, తరువాత తరువాత నీకే నచ్చుతుంది" రేర్ వ్యూ మిర్రర్ లో నుండి పండు వైపు చూస్తూ చెప్పాడు ప్రసాద్.

తెలుగు తరగతులు మొదలై అప్పటికి మూడు నెలలైంది. ఓ రోజు టీచర్ పది ఇంగ్లీష్ వాక్యాలను తెలుగులో ఎలా మాట్లాడాలో వివరించి, వచ్చేవారం వాటిని అడుగుతానని, సరిగ్గా చెప్పిన వాళ్ళకు బహుమతి ఇస్తానని చెప్పారు. పండు ఇంటికి రాగానే వాళ్ళమ్మను అవన్నీ ఇంగ్లీషులో అడగమని చెప్పి రాని వాటిని గుర్తుపెట్టుకుని ఓ అరగంట తరువాత అన్నింటినీ తెలుగులో స్పష్టంగా చెప్పాడు. అమ్మ పండుకు బుగ్గమీద ఓ ముద్దిచ్చింది. ఆ తరువాత వారం చాలా ఉత్సాహంగా క్లాసుకు వెళ్ళాడు. టీచర్ ఒక్కొక్కరినే అడగడం మొదలుపెట్టారు.

"ఐ యాం హంగ్రీ" అంటే ఏమిటని టీచర్ అడిగిన ప్రశ్నకు శ్రీకర్ తడుముకుంటూ "నేను.....నేను .....ఆకలొచ్చింది" అని చెప్పాడు. "నేను కాదు నాకు, ఆకలొచ్చింది కాదు ఆకలి వేస్తుంది" అంటూ సరిదిద్ది ఓ ఐదు సార్లు పిల్లలందరితో చెప్పించారు టీచర్.

అలాగే "మై బ్రదర్ వెంట్ టు స్కూల్" అన్నదానికి "నా అన్న ఎల్లింది బడికి" అని ఓ పన్నెండేళ్ళ పిల్లాడు అనువదించాడు. అలా కాదని తెలుగులో ఆ వాక్యం ఎలా చెప్పారో వివరించారు టీచర్.

"కెన్ ఐ గో అండ్ ప్లే అవుట్ సైడ్" అన్న వాక్యానికి "నాకు బయట ఆడుకోవచ్చా" అని చెప్పారొకరు.

"డక్స్ ఆర్ స్విమ్మింగ్ ఇన్ ద పాండ్" అన్న వాక్యానికి "కొలనులో బూతులు స్విమ్ చేస్తున్నాయి" అని చెప్పారు మరొకరు. "డాగ్ ఈజ్ బార్కింగ్" అన్నదానికి "కుక్క అరుస్తున్నాడని" సమాధానం. అన్నింటినీ ఓపిగ్గా సరిచేసి పిల్లలతో మళ్ళీ మళ్ళీ చెప్పించి అన్ని వాక్యాలు చక్కగా చెప్పిన ముగ్గురు పిల్లలకు టీచర్ మూడు పెన్సిల్స్ బహుమతులుగా ఇచ్చారు. పండుకు వాడి కిష్టమైన పసుపురంగు పెన్సిల్ వచ్చింది.

*　　　　*　　　　*　　　　*

వైష్ణవి పిన్నికూతురు జాహ్నవి వాళ్ళు కూడా ఆ ఊర్లోనే ఉంటారు. అప్పుడప్పుడూ వైష్ణవి వాళ్ళింటికి వచ్చి సాయంత్రం వరకు పిల్లలతో ఆడుకోవడం జాహ్నవికి బాగా అలవాటు. ఆమె వచ్చిన రోజు వైష్ణవి ఆమె కిష్టమైన వంటలు చేస్తూ ఉంటుంది. ఆ రోజు కూడా జాహ్నవి ఉదయాన్నే వచ్చింది.

"ఎగ్ప్లాంట్ లాజాన్యా చాలా బావుందక్కా" ప్లేట్ లోని ఆఖరి ముక్క నోట్లో పెట్టుకుంటూ చెప్పింది జాహ్నవి.

"మా టీచర్ తెలుగులోనే మాట్లాడాలన్నారు" గంభీరంగా చెప్పాడు పండు.

"మనం తెలుగులోనేగా మాట్లాడుతున్నాం" వైష్ణవి వాడి ప్లేట్ లో లజాన్యా చిన్న చిన్న ముక్కలు చేస్తూ అంది.

"కంప్లీట్ తెలుగమ్మా ఇంగ్లీష్ వార్డ్స్ అస్సలు యూజ్ చెయ్యకూడదు" వివరించింది ప్రత్యూష.

"అమ్మా, ఇంగ్లీష్ ని తెలుగులో ఏమంటారు?" అడిగాడు పండు.

"ఇంగ్లీష్ అంటే ఆంగ్లము, ఆంగ్లభాష" చెప్పింది వైష్ణవి.

"ఆంగ్లభాష వద్దు. తెలుగులోనే మాట్లాడదాం" తన వంతు పూర్తి చేసింది ప్రత్యూష.

"సరే సరే ముందు లంచ్ ఫినిష్ చెయ్యండి" తొందర పెట్టింది వైష్ణవి.

"లంచ్ ని తెలుగలో ఏమంటారు?" ప్రత్యూష సందేహం.

"లంచ్ ...లంచ్ అంటే మధ్యాహ్నభోజనం." చెప్పింది జాహ్నవి.

"మరి డిన్నర్ అంటే?" అడిగాడు పండు.

"డిన్నర్ అంటే రాత్రి భోజనం" వైష్ణవి సమాధానమిచ్చింది.

"ఓ అయితే అన్నీ భోజనాలేనా" అంటూ ఖాళీ అయిన ప్లేట్ ను సింక్ లో పెట్టి వచ్చి కూర్చుంది ప్రత్యూష.

"ట్రైన్ ని తెలుగులో ఏమంటారు?" ఈసారి ప్రశ్న పండు దగ్గరనుండి.

"ధూమశకటం" టకీమని చెప్పింది జాహ్నవి.

"ఇంకా ధూమశకటం ఏమిటి జాహ్నవీ. అన్నీ విద్యుత్ వాహనాలయితేనూ" నవ్వింది వైష్ణవి.

"నిజమే విద్యుత్ శకటం అనాలేమో!" అంటూ అనుమానంగా అంది.

"మరి బస్, ఫ్లైట్?" పండుకు మరో సందేహం.

"పండూ ఏ వోర్డ్ కయినా ఎండ్ లో ఉ యాడ్ చేస్తే తెలుగు వోర్డ్ అవుతుంది." చెప్పింది ప్రత్యూష.

"ఇదెవరు చెప్పార్రా నీకు?" జాహ్నవి ఆశ్చర్యపోయింది.

"మా ఫ్రెండ్ సావేరి చెప్పింది. కారు, బస్సు, ట్రైను, ఫ్లైటు ఇలా అనాలంట."

ఆ మాటకు వైష్ణవి, జాహ్నవి ఇద్దరూ నవ్వేశారు. ఆ రోజునుండీ పిల్లలు, మాటల్లో ఎవరు ఒక ఇంగ్లీషు పదం వాడినా దాన్ని తెలుగులో ఏమంటారోనని అడగడం మాత్రం మానలేదు.

భోజనాలు పూర్తయిన తరువాత అక్కా చెల్లెళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు. జాహ్నవి ఆ నెలలో జరిగిన తన ఇంటర్ వ్యూల గురించి చెపుతూ అసలెప్పటికయినా తనకు ఉద్యోగం వస్తుందో రాదోనని బాధపడింది. అంతా వింటున్న పండు "అనగననగ రాగంతో మొదలెట్టి సాధనమున పనులు సమకూరు ధరలోన విశ్వదాభిరామ వినురవేమ!" అంటూ పద్యం చదివేశాడు. జహ్నవి వాడిని దగ్గరకు తీసుకుని గట్టిగా ముద్దు పెట్టేసింది.

పండు క్లాసులో నేర్చుకున్న పద్యాన్ని సందర్భానుసారంగా అన్వయించిన తీరుకు ఎంతో ఆశ్చర్యపోయింది వైష్ణవి. అదే కాకుండా ఈ మధ్య పిల్లలు అన్నం తినేప్పుడు పళ్ళెం చుట్టూ వేయకపోవడం, చెప్పులు గుమ్మం ఎదురుగా వదలక పక్కగా పెట్టడం, ఎక్కడ తీసిన వస్తువులను మళ్ళీ అక్కడే పెట్టడం లాంటి విషయాలను కూడా ఆమె గమనించింది. తరగతిలో తెలుగు పిల్లలు పాఠాలతో పాటు మంచి నడవడిక కూడా నేర్చుకుంటున్నందుకు ఆమె ఎంతో ఆనందించింది.

* * * *

తెలుగు తరగతులు మొదలై ఆరునెలలౌతోంది. పండుకు ప, స, వ అన్నీ ఒక్కలాగే కనిపిస్తున్నాయి. అలాగే మ, య కూడా. స, శ అక్షరాలు రెండింటినీ ఒక్కలాగే పలుకుతున్నాడు.

"అమ్మా, ఇక్కడేం వుందో చెప్పు" పుస్తకం వైపు వేలు పెట్టి చూపిస్తూ అడిగాడు.

"కల అంటే డ్రీం"

"మరి ఇదీ?" అంటూ ఇంకో పదం చూపించాడు.

"ఇది కళ అంటే ఫైన్ ఆర్ట్స్".

"టీచర్ డిక్టేషన్ చెప్పేటప్పుడు నాకు రెండూ ఒక్కలాగే వినిపిస్తున్నాయి. ఆల్వేస్ ఐ స్పెల్ దెం రాంగ్" ఏడుపు మొహంతో చెప్పాడు పండు.

"టీచర్ ప్రొనౌన్స్ చేసేప్పుడు జాగ్రత్తగా విను నాన్నా. డిఫరెన్స్ నీకే తెలుస్తుంది" అనునయించింది వైష్ణవి.

"అమ్మా వత్తులు ఇలా లెటర్ కింద ఎందుకు రాయాలి? పక్కన ఎందుకు రాయకూడదు?" పుస్తకం చూపిస్తూ అడిగింది ప్రత్యూష.

"ఏమోరా నాకు తెలియదు. అయినా నీకీ సందేహం ఎందుకు వచ్చింది?"

"ఇంగ్లీషులో అన్నీ పక్కనే ఉంటాయి గదా. అలా ఉంటే బ్యూటిఫుల్ గా వుంటాయి." అంటూ డిక్టేషన్ లో తప్పులు పోయిన పదాలు ఐదు సార్లు రాయడం మొదలెట్టింది ప్రత్యూష. అవి అయిపోగానే ఆవారం శ్లోకం గట్టిగా చదువుతోంది.

"షాంతాకారం భుజగషయనం పద్మనాభం సురేషం
విష్వాకారం గగన సదృషం మేఘవరనం షుభాంగం"

"మీ క్లాసులో ఇలాగే చెప్తున్నారా ప్రత్యూషా" ఆశ్చర్యంగా అడిగింది వైష్ణవి.

"అవునమ్మా ఇదిగో చూడు" అంటూ ఇంగ్లీషులో రాసిన శ్లోకాన్ని అమ్మకు చూపించింది. వైష్ణవి ఆ శ్లోకాన్ని చూసింది, అందులో శ ఉండవలసిన దగ్గర అంతా స్ హెచ్ వుంది. ఆమెకు సమస్య ఎక్కడుందో అర్ధమైంది. ప్రత్యూషకు శ కు ష కు ఉన్న తేడా చెప్పి శ్లోకాన్ని సరిగ్గా పలికేలా సాధన చేయించి, వాళ్ళ టీచర్ కి ఆ విషయంగా ఓ నోట్ రాసి పెట్టింది.

* * * *

తెలుగు బడిలో టీచర్లు క్రిస్మస్ సెలవలలో ఇండియా లో వున్న వారి బంధువులలో ఇష్టమైన వారికి ఉత్తరం రాయమని పిల్లలతో చెప్పారు. తెలుగు బాగా రాయడం రాని పిల్లలు వాళ్ళ అమ్మకో నాన్నకో చెప్పి రాయించుకోవచ్చని చెప్పారు. పండుకు అక్షరాలు, గుణింతాలు వచ్చేశాయి కాని ఇంకా వత్తులు రాలేదు. అయినా ప్రత్యూషలా తను కూడా సొంతంగా ఉత్తరం రాస్తానని ఒక తెల్ల కాగితం పెన్సిల్ తీసుకుని వాళ్ళ అమ్మమ్మకు ఉత్తరం రాయడం మొదలెట్టాడు.

అమమా,

బావునావా? నువు, తాతయ ఏం చేసుతునారు? ఆమెరికా ఎపుడు వచునారు? మన ఇంటిలో బాతులు రోజూ మెమరీకి వచునాయి. నువు మేక్ చేసిన సునుండలంటే నాకు ఇషటము. మన నెయిబర్ బంటి ఇంకా మటి ఈట్ చేసునాడా? బలులు, చీమలు వాల హౌజ్ కి వెలిపోయాయా? మసికిటోస్ కిల్ చేయడానికి కొత మెడిసిన మేక్ చేశారట. నాన చెపాడు. నా సైకిల్ నానీకి ఇవు. పిలే చేయడం అయిపోయాక మాలీ షెడ్ లో పెటు.

నాకు తెలుగు వచింది. వేమన శతకం పదయాలు, సులోకాలు నేచుకునాను. వానా వానా వలప, ఒకటి ఒకటి ఒకటి పాటలు కూడా నేరుచుకునాను. నీకు అనీ రిసైట్ చేసుతాను. నీకు చెటులంటే చాలా ఇషటము కదా! మీరు ఇకడకు వచే మనం ఫాల్ రంగులు చూడొచు. నిను తాతయను చూడాలి. మీకోసం వెయిట్ చేసునాను. వచేపుడు ఆక కోసం ఆరంజ్ ఫలవర్ తీసుకురా. నానిని, బంటిని కూడా.

నీ

పండు

●●●

వైష్ణవి ఆ ఉత్తరాన్ని ఒక కవర్లో పెట్టి పండు చాతే పోస్ట్ డబ్బాలో వేయించింది. పదిహేను రోజుల తరువాత అమ్మమ్మ దగ్గరనుండి ప్రత్యుత్తరం వచ్చింది. వైష్ణవి ఆ కవర్ ఓపెన్ చెయ్యకుండా పండు చేతికి వచ్చింది. వాడి పేరుతో ఉత్తరం రావడం అదే ప్రధమం. మొహం వెలిగిపోతుండగా కవర్ చింపి ఉత్తరం బయటకు తీసి ఇష్టంగా ఉత్తరం మొత్తం చూసి చదవమని వైష్ణవికి ఇచ్చాడు.

●●●

పండూ,

ఆశీస్సులు. అమ్మ, నాన్న, అక్క అందరూ బావున్నారనుకుంటాను. నీ దగ్గరనుండి వచ్చిన లెటర్ చూసి చాలా సంతోషంగా అనిపించింది. ఇంగ్లీషులో రాసి ఉంటావులే మీ తాతయ్యతో చదివించుకుందామని అనుకుంటూ కవర్ చింపానా, తెలుగులో రాసిన ఉత్తరం చూసి ఎంత ఆశ్చర్యపోయానో చెప్పలేను. అమెరికాలో పెరుగుతున్నారు కదా మీరు పూర్తిగా తెలుగు మరచిపోతారనుకున్నాను. అలాంటిది తెలుగులో ఉత్తరమా! బొంబాయిలో ఉన్న మీ పెద్ద మామయ్య పిల్లలకు తెలుగు అక్షరాలే రావు. మీరు మొన్న ఇండియా వచ్చినప్పుడు మీ వచ్చీరాని మాటలకు నవ్వుకున్నా, ఇంత పెద్దవాళ్ళయినా చిన్నపిల్లల్లా మాట్లాడుతున్నారే అని బెంగగా అనిపించింది. మీ ఉత్తరాలు చూశాక ఆ బెంగ తీరింది. మీ తాతయ్య ఇంటికి వచ్చిన వారందరికీ నీ ఉత్తరం చూపించి ఒకటే మురిసిపోయారు.

ఎవరు ఇండియా వస్తున్నా మీ అమ్మ "ఏం పంపించమంటావమ్మా?" అని అడుగుతుంది. ఎప్పుడూ మాకేం వద్దని చెప్పేదాన్ని. ఈసారి అడిగితే పిల్లల మాటలు రికార్డ్ చేసి పంపించమని చెప్పాలి. ఇప్పటి వరకు మీతో చెప్పలేదు కాని మీతో మాట్లాడాలనిపించి ఫోన్ చేస్తామా, మేము ఫోన్ చేశామని మీరూ చాలా సేపు మాట్లాడతారు. కాని అందులో మాకు సగమే అర్థమౌతాయి. ఈ మధ్య మీ భాషలో చాలా తేడా వచ్చింది. స్పష్టంగా మాట్లాడుతున్నారు.

మీరంతా ఫోన్ లో మాట్లాడినప్పుడు పక్కనే ఉన్నట్లనిపిస్తుంది కాని, ఫోన్ పెట్టెయ్యగానే ఏం మాట్లాడుకున్నామని తలచుకుంటే ఏమీ సరిగ్గా గుర్తుకురావు. మీ ఉత్తరం చూడగానే ఎంత సంతోషం కలిగిందంటే ఆ రోజు ఆ ఉత్తరాన్ని ఏ ఇరవై సార్లో చదివి ఉంటాను. మినియాపోలిస్ లో వున్న మీ మామయ్య పిల్లలను కూడా మీలాగే తెలుగు నేర్చుకోమని చెప్పండి.

మీ టీచర్ మిమ్మల్ని మెచ్చుకున్నప్పుడో, ఆటల్లో మీకు ప్రైజ్ లు వచ్చినప్పుడో, మేము గుర్తొచ్చినప్పుడో మాకో ఉత్తరం రాయడం మరచిపోకండి. చిన్నప్పుడు మీ అమ్మ, మామయ్యలు హాస్టల్ నుండి ఇలాగే ఉత్తరాలు రాసేవాళ్ళు. ప్రతి రోజూ పోస్ట్ మాన్

వచ్చే సమయానికి వాళ్ళ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ వాకిట్లోనే ఉండేదాన్ని. ఇకనుండి మీ ఉత్తరం కోసం కూడా అలాగే ఎదురుచూస్తూ ఉంటాను.

ప్రేమతో,

మీ

అమ్మమ్మ

సెలవలు పూర్తయ్యాక పండు ఆ ఉత్తరాన్ని వాళ్ళ తెలుగు టీచర్ కు, క్లాసులోని పిల్లలకు చూపించి తరువాత దాన్ని భద్రంగా తన ట్రెజర్ బాక్స్ లో దాచుకున్నాడు.

●●●

# పెద్దయ్యాక నేను

మూడేళ్ళ క్రితం పండునెవరైనా "పెద్దయ్యాక నువ్వేం అవ్వాలనుకుంటున్నావ్?" అనడిగితే వెంటనే వాడు ఆకాశం వైపు చూస్తూ "బర్డ్ అవుతా" అని చెప్పేవాడు. ఒక్కోసారి "అక్కనౌతా" అని కూడా అనేవాడనుకోండి. మరి అక్కయితేనే కదా రంగు రంగుల ఫ్రాక్స్, గోళ్ళకు ఎర్రెర్రని నెయిల్ పాలీషు వేసుకుని, ఎంచక్కా కిచెన్ సెట్ తో ఆడుకునేది. మరో ఏడాది తర్వాత అదే ప్రశ్నకి "ఆస్ట్రోనాట్ అవుతా" అని చెప్పాడు. అది వినగానే వాళ్ళ బాబాయి "అయితే మేము ఫ్లోరిడాలో ఇల్లు కొనుక్కుంటాం పండూ, నువ్వు స్పేస్ కి వెళ్ళేప్పుడు సెండ్ ఆఫ్ ఇవ్వడానికి వీలుగా వుంటుంది" అంటూ వాడి నెత్తిమీద చిన్న జెల్లకాయ వేశాడు. ఇప్పుడేమో ఇంటికొచ్చిన తాతయ్యొకరు ఆ ప్రశ్న అడగ్గానే పండు టక్కున చెప్పిన సమాధానం విని, ప్రేమగా కొడుకు తల నిమిరింది వైష్ణవి. వాడా సమాధానం చెప్పడం వెనుకన్న కథ తెలుసుకోవాలంటే ఓ తొమ్మిదినెలలు వెనక్కి, అంటే శీతాకాలానికి వెళ్ళాలి.

*   *   *   *

డిసెంబర్ లో పండు వాళ్ళ స్కూల్ కి 'క్రిస్ మస్' శలవలు ఇస్తారు. అప్పుడు వాళ్ళమ్మ, నాన్న కూడా సెలవు పెట్టేసి, ఎంచక్కా అందరూ కలసి ఓ వారం పాటు ఎక్కడికన్నా వెళ్తుంటారు. ఈ సంవత్సరం 'రిచ్ మండ్లో' ఉంటున్న పండు వాళ్ళ బాబాయ్, అంటే ప్రసాద్ తమ్ముడు కార్తీక్ వాళ్ళింటికి వెళ్ళాలనుకున్నారు. అక్కడికి వెళ్ళడం అంటే బుజ్జి పండుకు మహా సరదా. దానికి కారణం వాళ్ళ బాబాయి కొడుకు ఐదేళ్ళ చింటు. పిల్లలిద్దరూ ఎప్పుడు కలిసినా బోలెడు ఆటలు ఆడేసుకుంటారు. ఎన్ని రోజులయినా వాళ్ళకు తనివితీరదు. సెలవలు ఇచ్చినరోజు సాయంత్రమే నాలుగ్గంటలకల్లా బట్టలు అవీ సర్దేసుకుని కార్లో ఝూమ్మని బయలుదేరారు.

ఇక ఆ వారాంతమంతా సందడే సందడి. అందరూ ఒక్కదగ్గర కలిస్తే అంతేగా మరి. చింటు వాళ్ళింట్లో ఎక్కడో మూలనున్న బొమ్మలు, బోర్డ్ గేమ్స్, క్రేయన్స్ అన్నీ బయటకొచ్చాయి. ప్రత్యూష ఆధ్వర్యంలో చెట్లు, పిట్టలు, కొండల మధ్యలో సూరీడు, ఏరోప్లేన్స్, ఇంకా ఐ లవ్ యు కార్డ్స్... అన్నీ అందంగా రూపుదిద్దుకున్నాయి.

సోమవారం అందరూ కలసి "బ్లూ రిడ్జ్ మౌంటైన్"కి వెళ్ళి స్కీయింగ్ చేద్దామనుకుని అక్కడ హోటలు బుక్ చేసుకున్నారు. ఆదివారం సాయంత్రానికి పండుకు కొంచెం ఒళ్ళు వెచ్చబడడంతో వైష్ణవి "వీడికి జ్వరం వచ్చేలా వుంది. ఈ చలిలో ఏం వెళతాం! పోనీ మానేద్దామా?" అంది.

ప్రత్యూష వెంటనే ఏడుపు మొహం పెట్టేసింది. "వింటర్ లోనేగా స్కీయింగ్ కి వెళ్ళేది. టైలెనాల్ పట్టుకెళ్దాం వైష్ణవీ, మామూలు జ్వరమేగా తగ్గిపోతుందిలే" అని ప్రసాద్ అన్నాకూడా వైష్ణవి అందుకు ఒప్పుకోలేదు.

"ఎల్లుండి మొత్తం అక్కడ స్నో పడే సూచనలు వున్నాయట. అలా కనక అయితే జ్వరం కొంచెం ఎక్కువై హాస్పిటల్ కి వెళ్ళాలన్నా కష్టం. ఒద్దులే, నేను పండూ ఇంట్లో ఉంటాం. మీరందరూ వెళ్ళిరండి" అంది.

"పండు లేకుండా అక్కడ చింటు మాత్రం ఏమాడుకుంటాడక్కా, నేను కూడా వెళ్ళను" అంటూ నీరజ కూడా ఆగిపోయింది.

* * * *

సోమవారం ఉదయం నాలుగ్గంటలకే ప్రసాద్, కార్తీక్, ప్రత్యూష బయలుదేరి వెళ్ళిపోయారు. వైష్ణవి అనుకున్నట్లు పండుకు జ్వరం రాలేదు ఉదయానికి చక్కగా నవ్వుతూ నిద్ర లేచాడు. ఆ రోజంతా పిల్లలిద్దరూ ఒకటే ఆటలు. సాయంత్రం ఐదుగంటలకు చింటు పరిగెత్తుతూ వచ్చి "ఇట్స్ హార్డ్ టు బ్రీత్" అంటూ వాళ్ళమ్మకు గొంతు చూపించాడు. పండు కూడా వాడి వెనకే వచ్చాడు.

"పరుగులు పెడితే అలాగే వుంటుంది. కుదురుగా ఒకదగ్గర కూర్చుని ఆడుకోండి" అని చెప్పి, వాడి జుట్టు సరిచేసి నుదిటిమీద ముద్దు పెట్టుకుంది నీరజ. చింటు మళ్ళీ మామూలుగా పండుతో ఆటల్లో పడిపోయాడు.

"ఇంతకు ముందు వాడెప్పుడైనా అలా అన్నాడా నీరజా? అడిగింది వైష్ణవి.

"లేదక్కా బహుశా గొంతు నొప్పేమో. అది చెప్పలేక అలా అనుంటాడు." అంటూ సాయంత్రం కూరకు ఉల్లిపాయలు తరగడం మొదలుపెట్టింది నీరజ.

ఓ రెండు గంటల తరువాత హఠాత్తుగా చింటు, ఆడుకుంటున్న ట్రక్ కింద పడేసి గొంతు దగ్గర చెయ్యి పెట్టుకుని "ఐ కాంట్ బ్రీత్" అన్నాడు. వైష్ణవి, నీరజ ఇద్దరూ కంగారుగా పిల్లల దగ్గరకు వెళ్ళారు.

"గొంతు నొప్పిగా ఉందా చింటూ?" గొంతుదగ్గర తడిమిచూస్తూ అడిగింది వైష్ణవి.

"నో పెద్దమ్మా, ఇట్స్ హార్డ్ టు బ్రీత్"

రెండే నిముషాల్లో పిల్లలిద్దరినీ తీసుకుని హాస్పిటల్ కి బయలుదేరారు. వైష్ణవి కారు నడుపుతూనే “నీరజా, చింటూను మాట్లాడిస్తూ వుండు” అని, అవసరమైతే ‘నైన్ వన్ వన్’ కి ఫోన్ చెయ్యడానికి సెల్లో చార్జ్ ఉందో లేదో చూసుకుంది. పండు తన బుల్లి కారును గట్టిగా పట్టుకుని వాన్ వెనుక సీట్లో నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

* * * *

సరిగ్గా పది నిముషాల తరువాత కారు హాస్పిటల్ దగ్గర ఆగింది. రిసెప్షనిస్ట్ తో మాట్లాడుతుండగానే చింటు బలంగా, త్వరత్వరగా గాలి పీల్చడం మొదలు పెట్టాడు. హాస్పిటల్ లోపల నుండి తెల్ల కోట్లు వేసుకున్న ఓ ఇద్దరు హడావిడిగా వచ్చి వాణ్ణి లోపలకు తీసికెళ్లారు. మిగిలిన ముగ్గురు కూడా లోపలకు వెళ్ళబోయరు కాని, చిన్నపిల్లలు వెళ్ళకూడదంటూ పండును అక్కడే ఆపేశారు. దాంతో వైష్ణవి కూడా బయటే ఉండిపోవాల్సొచ్చింది. పండు వాళ్ళు కనిపించినంతవరకు లోపలకు తొంగి చూసి, “వాట్ హాపెండ్ టు చింటు? అని అడిగాడు.

“తెలియదు నాన్నా” అంటూ వాడి మొహం చూసి “ఏం లేదు నాన్నా, నిన్న నీకు కొంచెం బాలేదు కదా అలగే వాడికి కూడా” అని చెప్పింది. అమ్మ మాటల మీద వాడికి నమ్మకం కలగలేదు. వైష్ణవి ఇంతలో ఫోన్ తీసి జరిగినదంతా ప్రసాద్ తో చెప్పింది. ఓ ఇరవై నిముషాల తరువాత నీరజ బయటకు వచ్చింది.

“ఎలా వుంది నీరజా వాడికి?”

“లోపలకు వెళ్ళగానే వెంటిలేటర్ పెట్టారు. ఒక్క నిముషంలోనే నార్మల్ గా ఊపిరి తీసుకోవడం మొదలు పెట్టాడు.”

“డాక్టర్ ఏం చెప్పారు? అసలెందుకలా అయిందట?”

“తెలీదక్కా. మెడిసిన్ ఇవ్వగానే వాడికి బాగా మత్తొచ్చింది. లేచాక ఏదో టెస్ట్ చేస్తార్ట” చెప్పింది.

“వాడికి ఎప్పుడన్నా కాస్త జ్వరం, ఇయర్ ఇన్ఫెక్షన్స్ తప్ప ఇంకేం ప్రాబ్లెమ్స్ లేవుగా. ఏదో ఫుడ్ పడి వుండదులే నీరజా. సరే... కార్తీక్ వాళ్ళకు ఫోన్ చేసి విషయం చెప్పు. కంగారుగా ఎదురు చూస్తుంటారు. మధ్యాహ్నం అంతా అక్కడ స్నో పడిందిట. అటువైపు దార్లన్నీ మూసేశారట. రేపు ఉదయం పది గంటలకు కాని రోడ్డుమీద వెహికల్స్ వెళ్తాయో లేదో తెలియదట.” అని చెప్పి చింటూను చూడడానికి లోపలకు వెళ్ళింది వైష్ణవి.

ఓ రెండు గంటలు గడిచాయి. చింటుకు ఎమ్ ఆర్ ఐ, స్కానింగ్ లాంటివన్నీ తీసారు. పండు కుర్చీలో కూర్చునే తూగుతున్నాడు. “అక్కా బాగా ఆలస్యం అవుతుందేమో, పండుకు నిద్రొస్తున్నట్లుంది. పోనీ నువ్వూ, పండూ ఇంటికి వెళ్ళండి. డిశ్చార్జ్ చెయ్యగానే ఫ్రెండ్ నెవరినన్నా పిలుస్తాను. వాళ్ళు మమ్మల్ని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తారు” అంది నీరజ.

“ఆ...భలే దానివేలే నిన్నిక్కడ ఒంటరిగా వదిలేసి ఎలా వెళ్తాను వీడ్నిక్కడ పడుకోబెడతాలే అందరం కలిసే వెళ్దాం” అంటూ అక్కడే వున్న సోఫాలో పండును పడుకోబెట్టింది వైష్ణవి. పండుక్కూడా చింటును తీసుకెళ్ళకుండా ఇంటికి వెళ్ళాలని లేదు.

* * * *

"పండూ లేమ్మా. మనం వేరే హాస్పిటల్ కి వెళ్ళాలి." అంటూ వైష్ణవి పిలవడంతో టక్కున లేచికూర్చున్నాడు పండు. తానెక్కడున్నాడోనని చుట్టూ చూసి, రాత్రి హాస్పిటల్ కి వచ్చిన విషయం గుర్తొచ్చి "వాట్ టైం ఈజ్ ఇట్? ఆర్ వుయ్ గోయింగ్ హోం?అని అడిగాడు.

"ఇట్స్ త్రీ ఇన్ ద మార్నింగ్ పండూ, చింటూను వేరే హాస్పిటల్ కి షిఫ్ట్ చేస్తున్నారు. ఈలోగా నువ్వు కొంచెం ఫ్రెష్ అప్ అవుదువురా" అంటూ వాడిని రెస్ట్ రూమ్ కి తీసుకుని వెళ్ళింది.

"వై అనదర్ హాస్పిటల్?"

"ఇక్కడ రాత్రంతా చిన్నపిల్లలను ఉంచకూడదట. చిల్డ్రన్స్ హాస్పిటల్ కి తీసుకెళుతున్నారు".

పండు తిరిగి రాగానే చింటు చక్కగా నవ్వుతూ స్ట్రెచర్ మీద కనిపించాడు. చేతికి నీడిల్ పెట్టి కదలకుండా టేప్ వేసి వుంది.

"చూడక్కా, వీడ్ని చూస్తే ఎవరైనా బాగలేని పిల్లాడనుకుంటారా? ఇప్పటి వరకు పేరామెడిక్స్ ని వంద ప్రశ్నలు వేశాడు" నవ్వుతూ చెప్పింది నీరజ.

పండు కూడా అంబులెన్స్ లోనే వస్తానన్నాడు కాని వాళ్ళు అలా కుదరదని చెప్పడంతో అమ్మతో పాటు కారెక్కాడు. వైష్ణవి అంబులెన్స్ ను ఫాలో అవుతోంది.

"దిస్ అంబులెన్స్ ఈజ్ గోయింగ్ స్లో. ఇంకా పైన లైట్లు, సైరన్ కూడా లేదు" ఆశ్చర్యపోయాడు పండు.

"ఎర్లీ మాణింగ్ కద నాన్నా. రోడ్డు మీద వెహికల్సే లేవు. పైగా చింటూది లైఫ్ త్రెటెనింగ్ కేస్ కూడా కాదు. ఇంకెందుకు లైట్లు, సైరన్లునూ" అంటుండగానే హాస్పిటల్ వచ్చేసింది.

అంబులెన్స్ ఆగగానే పేరామెడిక్స్ చింటూను హడావిడిగా దింపి పరుగులాంటి నడకతో లోపలకు తీసుకెళుతున్నారు. పండు కూడా వాళ్ళమ్మ చెయ్యి పట్టుకుని స్ట్రెచర్ వెనకే పరిగెట్టాడు. స్ట్రెచర్ మీద చింటు అతి కష్టం మీద బలంగా ఊపిరి పీలుస్తున్నాడు. చింటును ఒక గదిలోకి తీసుకువెళ్ళి మంచం మీద పడుకోబెట్టేటప్పటికి దాదాపుగా వాడికి ఊపిరి అందని స్థితిలో వున్నాడు. ఓ పదిమంది తెల్ల కోట్లు వేసుకున్న వాళ్ళు వాడి మంచం చుట్టూ నిలబడి, అప్పటికే తయారుగా ఉంచుకున్న వెంటిలేటర్ ని వాడి మొహానికి పెట్టేశారు. నీరజ పండు తల పక్కనే నిలబడి చూస్తోంది. పిన్ని పక్కనే పండు. చింటు వాళ్ళమ్మను పక్కకు నెట్టేసి, ఒక్క నిముషంలో తల పక్కకు వాల్చేశాడు.

అయోమయంగా చూస్తున్న నీరజతో, "డోంట్ వర్రీ హి ఈజ్ స్లీపింగ్" అని చెప్పారు ఒక డాక్టర్. వాడికేమైందని వైష్ణవి అడిగిన దానికి సమాధానంగా "డాన్'ట్ నో ఎట్. వుయ్ విల్ నో బై టుమారో" అని చెప్పి ఇలాగే ఎమర్జెన్సీ వస్తే బెడ్ పక్కనున్న ఒక బటన్ నొక్కమని, అప్పుడు వెంటనే డాక్టర్స్ వచ్చి వెంటిలేటర్ పెడతారని చెప్పి వెళ్ళిపోయారు. పిన్ని వైపు చూశాడు పండు. కన్నీళ్లు కారిపోతుండగా చింటు వైపు చూస్తోందామె. వైష్ణవి కూడా దాదాపు అదే స్థితిలో వుండడం చూసి పండుకు ఏడుపొచ్చింది. ఎప్పుడూ నవ్వుతూ తనతో ఆడుకునే చింటు అలా వుంటే వాడికి ఏదోలా వుంది.

"చింటుకు ఏమైందమ్మా?" రాత్రి అడిగిన ప్రశ్నే మళ్ళీ అడిగాడు.

"ఏం లేదు నాన్నా, డాక్టర్ ఇంకొన్ని టెస్ట్ లు చేయాలన్నారు. అంతే. చింటు పడుకున్నాడుగా నువ్వు కూడా కొంచెంసేపు పడుకో" అని గోడవైపునున్న పెద్ద బల్లమీద పడుకోబెట్టింది వైష్ణవి. చేతిలో కారు గుండెల దగ్గరగా గట్టిగా పట్టుకుని పడుకున్నాడు.

కాసేపటికి "అక్కా వాడికేం కాదుగా" నీరజ బేలగా అడగడం వినిపించింది వాడికి.

"ఏం కాదు నీరజా. అసలు ప్రాబ్లెం ఏమిటో రేపటికి తెలుస్తుందిగా! తెలిసిన తరువాత ట్రీట్ చేయడం తేలికని డాక్టర్ చెప్పారు. అప్పుడింకేమీ కంగారు వుండదు".

*    *    *    *

మరుసటి రోజు సాయంత్రానికి కూడా ఏమీ తెలియలేదు. ఊపిరి పీల్చడం కష్టమైనప్పుడల్లా మందు పనిచేస్తుంది కనుక కంగారు పడవలసిందేమీ లేదని చెప్పారు డాక్టర్లు. చింటు రోజంతా మామూలుగా ఉంటున్నాడు, అయితే వాడి చేతికి రెండు వైర్లు, కాలికొకటి, గుండె చప్పుడు తెలియడానికి మరో రెండు, ఇలా ఒళ్ళంతా వైర్లు వుండడంతో మంచం వదిలి వాడెక్కడికీ వెళ్ళలేదు. సాయంత్రానికి కార్తీక్ వాళ్ళు కూడా వచ్చారు. ప్రత్యూషను చూడగానే పండుకు కొంచెం హాయిగా అనిపించింది. నిన్నటి నుండి ఏం జరిగిందో అంతా అక్కతో చెప్పాడు.

తరువాత రోజు మధ్యాహ్నం చింటు నిద్ర పోతున్నపుడు, పిల్లలిద్దరినీ తీసుకుని హాస్పిటల్ కేఫ్టేరియాకి వెళ్ళాడు ప్రసాద్. వాళ్ళు కూర్చున్న టేబుల్ కి కొంచెం దూరంగా వున్న మరో టేబుల్ దగ్గరన్న పాప వేపు ఆసక్తిగా చూశాడు పండు.

"నాన్నా అమెరికన్స్ కూడా గుండు చేయించుకుంటారా?" మెల్లగా అడిగింది ప్రత్యూష.

"ఆ పాప గుండు చేయించుకోలేదు నాన్నా. ఆ పాపకు బహుశ కాన్సర్ అయివుంటుంది. కీమోథెరపీ ఇస్తే జుట్టు అలానే ఊడుతుంది"

"లాస్ట్ ఇయర్ మా క్లాస్ లో స్టెఫినీక్కూడా కాన్సర్ వచ్చింది, షి డైడ్ ఆఫ్టర్ సిక్స్ మంత్స్. ఈజ్ షి గోయింగ్ టు డై సూన్? పాప వైపు చూస్తూ బాధగా అడిగింది ప్రత్యూష.

"లేదు నాన్నా, కాన్సర్ వచ్చిన వాళ్ళందరూ చనిపోరు. మా ఆఫీస్ లో ఒక కాన్సర్ సర్వైవర్ వున్నారు. ఇప్పుడు ఆవిడ నార్మల్ గా హెల్దీగా వున్నారు. డాక్టర్స్ సేవ్డ్ హర్ లిఫ్. ఇంకొన్ని రోజుల్లో ఆ పాపక్కూడా పూర్తిగా తగ్గిపోతుంది" ప్రత్యూష చెయ్యి పట్టుకుని లోగొంతుకలో చెప్పాడు ప్రసాదు.

"డజ్ షి నెవెర్ గోయింగ్ టు హావ్ హర్ హెయిర్ అగైన్?" అడిగాడు పండు.

"లేదమ్మా కీమో థెరపీ ఇవ్వడం అయిపోగానే మళ్ళీ జుట్టు మామూలుగా వచ్చేస్తుంది. మనం కొంచెం సేపు ప్లే రూమ్ కి వెళ్దామా?" అంటూ పిల్లల్ని హాస్పిటల్ ప్లే రూమ్ కి తీసుకెళ్ళాడు ప్రసాద్.

ఆ గదిలో అడుగు పెట్టగానే పండుకు తన ప్రీస్కూల్ గుర్తొచ్చింది. చింటు కూడా వస్తే బావుండేదనుకున్నాడు. అక్కడ చాలా బొమ్మలు, పుస్తకాలు వున్నాయి కాని వాటినేమి ముట్టుకోకుండా అక్కడున్న పిల్లల్ని చూస్తూ ఒక టేబుల్ దగ్గర కూర్చున్నాడు. దాదాపుగా అందరికి చేతికి నీడిల్ పెట్టి పైన ప్లాస్టర్ అతికించి వుంది. ఇద్దరు పిల్లలు స్ట్రెచెస్ తో నడుస్తున్నారు. ఒక పాప చేతికి పెద్ద బాండేజ్ వుంది. ఇంకో ఇద్దరు పిల్లలు జుట్టు లేకుండా కేఫ్టేరియాలో కనిపించిన పాప లాగా వున్నారు. టేబుల్ మీద పెట్టిన తన కారు తీసి గట్టిగా పట్టుకున్నాడు పండు. ఒక అబ్బాయి కొంచెం కుంటుతూ వెళ్ళడం చూసి

"వై ఈజ్ హి వాకింగ్ లైక్ దట్? డజ్ హి హావ్ పెయిన్? అడిగాడు పండు.

"కాదు పండూ, ఆ బాబుకు కాలు లేదనుకుంటాను. అది ఆర్టిఫిషియల్ లెగ్. అందుకే అలా నడుస్తున్నాడు" చెప్పాడు ప్రసాద్.

"ఆ బాబుకు కలేందుకు లేదు?" అడిగాడు.

"మే బి యాక్సిడెంట్ అయివుండొచ్చు. లేకపోతే బై బర్త్ కాలు లేదేమో! డాక్టర్స్ కాలు ఫిక్స్ చేసి వుంటారు. ఇప్పుడు ఆ బాబు అందరిలాగానే స్పోర్ట్స్ ఆడుకోవచ్చు, రన్ చెయ్యొచ్చు"

"కూల్" అంది ప్రత్యూష. ఓ అరగంట కూర్చుని చింటు కోసం రెండు బొమ్మల పుస్తకాలు తీసుకుని అక్కడనుండి వెళ్ళిపోయారు.

* * * *

చింటును హాస్పిటల్లో చేర్చి అప్పటికి మూడు రోజులయింది. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఎవరో ఒక డాక్టర్ రావడం ఏమీ ఫరవాలేదని చెప్పడం వాడిని జాగ్రత్తగా చూసి వెళ్ళడం చేస్తున్నారు. దాంతో అందరికీ కొంచెం ధైర్యంగా అనిపించేది. మొదటి రోజు నాలుగు గంటలకోసారి అలా ఊపిరి అందకపోవడం జరిగింది. రెండో రోజు మూడు సార్లు మాత్రమే అలా అయింది. ఆ వేళయితే అస్సలు ఒక్కసారి కూడా అలా కాలేదు కాబట్టి, డాక్టర్ డిశ్చార్జ్ చేస్తామన్నారు. అయితే వాడికేమైందో మాత్రం సరిగ్గా చెప్పలేక పోయారు. "వైరల్ అయివుండొచ్చని, ఇంటి దగ్గర అలా వస్తే వెంటనే అంబులెన్స్ ని పిలవమని, ఓ వారం స్కూల్ కి పంపించవద్దని, తరువాత స్కూల్ నర్స్ కి కూడా ఈ విషయం చెప్పమని చెప్పారు డాక్టర్లు. రెండు నెలలకోసారి స్కానింగ్ తీయించమని కూడా చెప్పారు.

ఇంటికి వచ్చాక ఓ నాలుగు రోజుల వరకూ అందరికీ కంగారుగానే వున్నది. పెద్దవాళ్ళెవరూ గదిలో లేకపోతే పండు ఆడుకోవడం మానేసి చింటు వైపు చూస్తూ కూచునే వాడు.

ఓ రోజు మాటల్లో "మనం బ్లు రిడ్జ్ మౌంటైన్ కి వెళ్ళకపోవడం మంచిదయింది" నిట్టూర్చింది నీరజ.

"అసలు చిల్డ్రన్స్ హాస్పిటల్ కు తీసుకెళ్ళేవరకూ కూడా అంత సీరియస్ అనిపించలేదు. మనం వెంటనే హాస్పిటల్ కి తీసుకువెళ్ళి మంచిపని చేశాం" అంది వైష్ణవి.

"అ డాక్టర్లు నా చింటును కాపాడిన దేముళ్ళు. రెండు నిముషాలు ఆ మందు ఇవ్వడం ఆలస్యమైతే ఏం అయ్యుండేదో ఊహించడానికే భయంగా వుంది" అని నీరజ అనడం చాలాసార్లు విన్నాడు పండు. పెద్దయ్యాక తనేమవ్వాలో వాడప్పుడు నిర్ణయించుకున్నాడు.

●●●

# గోడ మీద బొమ్మ

అమావాస్య ముందు రోజులు, మబ్బు పట్టిందేమో సంధ్య వేళే అయినా ఆకాశం నల్లగా వుంది. ఆ వీధంతా అదోమాదిరిగా వుంది. ఓ ఇంటి ముందు పచ్చగా ఉండాల్సిన అజేలియా గుబుర్ల నిండా బూజు పట్టేసింది. ఎండిపోయిన మేపల్ చెట్టు కొమ్మలని పట్టుకుని నల్లని దెయ్యాలు వేలాడుతున్నాయి. స్స్...అని వీస్తున్న గాలికి అవి అటూఇటూ ఊగుతున్నాయి, అప్పుడప్పుడూ గుండ్రంగా కూడా తిరుగుతున్నాయి. చెట్టు కింద ఓ మంత్రగత్తె చీపురు పట్టుకుని నిలబడి వుంది. ఆమె ముక్కు గద్దముక్కులా ముందుకు వొంగింది, బోసినోరు అవడంవల్ల గడ్డం ముందుకు మరీ పొడుచుకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఆమె పట్టుకున్న చీపురు మీదకు ఎక్కడానికి ప్రయత్నిస్తోందో చారల పిల్లి. ఆ ఇంటి చూరునుండి జారిన నాలుగు పెద్ద పెద్ద సాలెపురుగులు భూమికి మూడడుగుల ఎత్తున వేలాడుతున్నాయి.

పక్క ఇంటి లాన్ లో తెగిపడిన మొండెమొకటి రెండు చేతుల్తో తల పట్టుకుని పైకెత్తి చూపిస్తోంది. దాన్నుండి కారిన చిక్కని రక్తం గడ్డిలో అడుగు వెడల్పున మడుగులా కన్పిస్తోంది. ఆ ఇంటి ముఖద్వారానికి వేలాడదీసిన అస్థిపంజరం గాలి శబ్దం చేసినప్పుడల్లా ఆనందంగా కాళ్ళు చేతులు ఊపుతోంది. ఎదురింటి లాన్ లోని ఆరు తెల్ల దెయ్యాలు దాని కనుగుణంగా నృత్యం చేస్తున్నాయి. మూడో ఇంటి గుమ్మం పక్కనున్న గుమ్మడికాయకు ఎవరో కళ్ళు ముక్కు కోసేసినట్లున్నారు. నోటిని రంపంతో కోసిన గుర్తుగా గొగ్గిరి గొగ్గిరిగా ఉంది. నారింజ రంగులో కోపంగా అది నిప్పులు చెరుగుతోంది.

పండు, ప్రత్యూష చేయి పట్టుకొని భయంగా అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాడు. సాయంత్రం కరిగి చీకటి మరింత నల్లబడింది. దూరంగా ఓ గుంపు మెల్లగా వీళ్ళవైపే వస్తోంది. కొంచెం దగ్గరగా వచ్చాక వాళ్ళని ఆసక్తిగా గమనించాడు పండు. రెండు అస్థిపంజరాలు, అందులో ఒకదాని మొహం మరీ కోపంగా ఉంది. రక్తం ఓడుతున్న ఓ డ్రాక్యులా, జుట్టు విరబోసుకుని, కళ్ళనుండి చెంప మీదకు నల్లని చారలతో వున్న ఓ అమ్మాయి... అప్పటికి మరీ దగ్గరగా వచ్చారేమో స్పష్టంగా కనిపిస్తున్నారు. పండుకు వెన్నులోంచి చలి మొదలైంది. మరి కొంత దూరం పోయాక ఓ మంత్రగత్తె, పులిని వెంటబెట్టుకుని ఎదురైంది. పండు అరచేతిలో చమటలు పడుతున్నాయి. ప్రత్యూష, తమ్ముడి చేతిని గట్టిగా పట్టుకుని ముందుకు నడుస్తోంది. ఇద్దరూ ఓ ఇంటి ముందు ఆగారు. చెక్క తలుపు

కిర్రున శబ్దం చేస్తూ తెరుచుకుంది. ఓ అమ్మాయి, తల నుండి కాళ్ళ వరకూ ముసుగు వేసుకున్న మరో ఆకారం, వీళ్ళ దగ్గరగా వచ్చారు. ఆ అమ్మాయి మొహం తెల్లగా సున్నం వేసినట్లున్నగా వుంది, జుట్టు కూడా తెల్లగా పొడవుగా వుంది. నల్లని సూటు వేసుకున్న మరో ఆకారం కూడా వచ్చి వాళ్ళతో కలిసింది. ఆ వ్యక్తి మొహం పసరు రాసుకున్నట్లు ఆకుపచ్చగా వుంది.

ఐదుగురూ దక్షిణం వైపుకు నడవడం మొదలుపెట్టారు. ఓ ఇరవై అడుగులు వేయగానే రోడ్డుకు ఎడమవైపున కారొకటి చెట్టునెపుడో గుద్దేసినట్లుంది, ముందు తలుపు సగం తెరుచుకుని, అందులోనుండి ఓ శవం వేలాడుతూ అస్పష్టంగా కనపడుతోంది. మరో శవం దూరంగా పడివుంది. కొంచెం దూరంగా ఓ ఇంటి మేడమీద కిటికీలోనుండి నీలం, ఎరుపు రంగు లైట్ల కాంతి ఆరిపోతూ, వెలుగుతూ చూస్తుంటే అదోమాదిరిగా భయం గొలిపేలా ఉన్నాయి. ఆ ఇంటి నుండే ఏవో శబ్దాలు.... పిశాచాల వికృతంగా నవ్వుతున్నట్లు. పండు ప్రత్యూష వైపు జరిగి చేతిని మరింత గట్టిగా పట్టుకున్నాడు. రెండడుగులు ముందుకు వెయ్యగానే అంతవరకూ దారికడ్డంగా పడున్న శవం ఒక్కసారిగా లేచి తలతిప్పి వీరి వైపు చూసింది. అంతే ‘‘కెవ్వు కెవ్వు’’ మన్న కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లి పోయింది. ప్రత్యూష పండు చుట్టూ చెయ్యివేసింది. పండు వణుకుతున్న అక్కచేతిని గట్టిగా కరుచుకుపోయాడు.

ఆ ఇంటిముందు నిలబడిన వ్యక్తి వీళ్ళను ఇంట్లోకి రమ్మని సైగ చేస్తున్నాడు. లోపలంతా చీకటి గుయ్యారం. చిన్న వెలుగు రేఖ కూడా ఎక్కడా కనిపించడంలేదు. ప్రత్యూష లోపలకు వెళ్దామంది కాని, పండు వద్దన్నట్లు భయంగా చూశాడు. నేనున్నానని ధైర్యం చెపుతూ లోపలకు తీసుకుపోయింది. లోపల గుడ్డిగా వెలుగుతున్నలాంతరు వెలుగులో తెల్లని పొగలు పల్చగా ఇల్లంతా కమ్ముకోవడం తెలుస్తోంది. ఆ పొగ ఐసు గడ్డంత చల్లగా తగులుతూ ఒకలాంటి గగుర్పాటును కలిగిస్తోంది. ముందు గదిలో అడుగు పెట్టగానే, గబ్బిలాలు అరుస్తూ ఎగురుతూ మొహం మీదకు దూకి నానా భీభత్సం సృష్టించాయి. వడివడిగా ఆ గది దాటి లోపలకు వెళ్ళారు. గుమ్మం పక్కగా తలలేని కుక్క, దాని తల దూరంగా ఉయ్యాల బల్లమీద ఊగుతున్న అస్థిపంజరం చేతిలో ఉంది. మరో గదిలోకి వెళ్ళడానికి అడ్డుగా ఉన్న పల్చని తెర పక్కకు తొలిగించింది ప్రత్యూష. కత్తి పట్టుకున్న మనిషి ఎదురుగా నిలబడి వున్నాడు. ఆ కత్తి అంచునుండి చిక్కని రక్తం బొట్లు బొట్లుగా కారుతోంది. పక్కనే అతని సగం నరికిన చెయ్యి వేళ్ళు కదిలిస్తూ ఉంది. అంతే...”కెవ్వు”న కేక పెట్టాడు పండు. ఆ వ్యక్తి వికటాట్టహాసం చేశాడు. అంతే నలుగురూ ఎక్కడా ఆగకుండా బయటకు పరుగు తీశారు.

‘‘దట్స్ సో స్కేరీ’’ అక్కా. పదడుగులు వెళ్ళాక్కూడా వెనక్కి తిరిగి చూడడానికి భయమేస్తోంది వాడికి.

‘‘యా ఐ నో. బట్ దట్ హంటెడ్ హౌస్ ఈజ్ సో ఫన్.’’ చెప్పింది ప్రత్యూష.

‘‘ఐ లవ్ దట్’’ అని ఇంకొకరు. ఇలా మాట్లాడుకుంటూ ఎదురుగా కనిపించిన ఇంటికి వెళ్ళి బెల్ కొట్టారు. ఓ అరేబియన్ క్వీన్ బయటకు వచ్చింది.

‘‘ట్రిక్ ఆర్ ట్రీట్’’ అరిచారు పిల్లలు ఐదుగురు.

"ఊ... లుక్ ఎట్ దోజ్ స్కేరీ కాస్టూమ్స్. ఐ డోంట్ వాంట్ ఎనీ ట్రిక్స్. యు కెన్ హావ్ ఎ ట్రీట్" అంటూ ఒక పెద్ద ప్లేట్లోని కాండీస్, చాక్లెట్స్ పిల్లల ముందు పెట్టింది క్వీన్. పండు ఒక్కటి మాత్రం తీసుకుని తన దగ్గరున్న ప్లాస్టిక్ గుమ్మడికాయ బుట్టలో వేసుకున్నాడు.

అక్కడనుండి మరో ఇంటికి వెళ్ళారు. నల్లని దిష్టి బొమ్మ, చీపురు పట్టుకుని ఫెన్స్ పక్కన నిలబడి ఉంది. పక్కనే చతురస్రాకారపు గడ్డిమేటలు నాలుగు అడ్డదిడ్డంగా పడున్నాయి. లాన్ లో రెండు జీన్స్ పాంట్స్, ఒక షర్ట్ నిట్టనిలువుగా నిలబడి ఉన్నాయి. అయితే కాళ్ళకు వేసిన సాక్స్ మాత్రం ఆకాశాన్ని చూస్తున్నాయి. మిగిలిన శరీర భాగాలు భూమిలో ఉన్నట్లుగా ఉంది. పక్కనే "ఐ హావ్ గ్రౌండెడ్ ది కిడ్స్ ఫర్ ది వీకెండ్" అన్న బోర్డ్ కనిపిస్తోంది. పండు ఆ బోర్డు వైపు భయంగా చూస్తూ వరండా కిందే నిలబడి పోయాడు. పైకి చూస్తే చూరును పట్టుకుని వేలాడుతున్న గబ్బిలాలు... ప్రత్యూష భయంలేదని చెప్తూ తమ్ముణ్ణి తనతో పాటు తలుపు వైపుకు తీసుకు వెళ్ళింది. ఓ సముద్రపు దొంగ, మత్స్యకన్య బయటకు వచ్చి కిట్ కాట్స్, జాలీ రాంచర్స్, ఎమ్ అండ్ ఎమ్స్ ఉన్న నారింజ రంగు పళ్ళాన్ని వీళ్ళ ముందు పెట్టారు. పిల్లలందరూ వాళ్ళకు నచ్చిన చాక్లెట్స్ ఒకటి రెండు తీసుకున్నారు.

'ట్రిక్ ఆర్ ట్రీట్', 'హాపీ హాలోవీన్' అని చెప్తూ ఆ నైబర్ హుడ్ లోని ప్రతి ఇంటికీ వెళ్లారు. ఎలుగుబంటి, సింహం, పిల్లి, స్పైడర్ మాన్, సూపర్ మాన్, బిల్ క్లింటన్, ఒబామా, పాల కేన్, కుకీ డబ్బా, బాబ్ ది బిల్డర్, డోరా ఇలాంటి వేషాలేసుకున్నపిల్లలు, పెద్దవాళ్ళు వారికి దారిపొడవునా కనిపిస్తూనే ఉన్నారు. అందులో లేడీబగ్, పొద్దుతిరుగుడు పువ్వు, ఏంజల్ వేషాలు చాలా నచ్చేశాయి పండుకు. రక్తం ఓడుతూ భయంకరంగా తయారైన వాళ్ళను చూసినప్పుడు మాత్రం చాలా భయపడ్డాడు. వాడికి అన్నిట్లోకి బాగా నచ్చిన వేషం పవర్ రేంజర్. ఎందుకంటే వాడి వేషమూ అదే. ప్రత్యూష ఊదారంగు రంగు మీద నల్లని చారలున్న గౌను వేసుకుని నల్లని టోపీతో అందమైన మంత్రగత్తెలా తయారైంది. పండు చేతిలోని బుట్ట మోయలేనంత బరువైయ్యాక స్నేహితులకు బై చెప్పి ఇంటి దారి పట్టారు.

*  *  *  *

పండూ వాళ్ళ ఇంటి ముందంతా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఉంది. గుమ్మం పక్కన మాత్రం అరచేయంత గుమ్మడికాయలు ఓ ఆరో ఏడో ఒకదానిమీద ఒకటి పెట్టున్నాయి. కుర్చీ మీద పెట్టిన ప్లాస్టిక్ గుమ్మడి కాయలో లైటు వెలుగుతూ ఉంది, దాని పక్కనే సాయంత్రం వాళ్ళమ్మ చాక్లెట్స్ వేసిన గిన్నె మాత్రం పూర్తిగా ఖాళీయైపోయింది.

"అమ్మా లుక్.. ఎన్ని కాండీసో చూడు" ఉత్సాహంగా అరుస్తూ లోపలకు వచ్చాడు పండు.

"అమ్మో, చాలా తెచ్చుకున్నారే అందులో మీకు నచ్చినవి ఓ పది మాత్రం తీసుకోండి. మిగిలినవి పూర్ పీపుల్ కి ఇచ్చేద్దాం" చెప్పింది వైష్ణవి.

పండుకు చాకోలేట్స్ అన్నీ ఉంచేసుకోవాలని ఉన్నా వాళ్ళమ్మతో ఆ మాట చెప్పలేదు. ఎందుకంటే అన్నీ తింటే పళ్ళు పాడైపోతాయని వైష్ణవి వెళ్ళే ముందే వాళ్ళతో ఈ ఒప్పందం చేసుకుంది. అక్కాతమ్ముళ్ళిద్దరూ ఓ గంట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ బటర్ ఫింగర్స్, హెర్షీస్ కిసెస్, కిట్ కాట్స్, ఎమ్ అండ్ ఎమ్స్, తీసుకుని మిగిలిన చాక్లెట్స్ అన్నీ పక్కన పెట్టేశారు.

* * * *

ఇంత ఫన్ గా ఉండే హాలోవీన్ అంటే అమ్మకెందుకు ఇష్టం లేదో పండుకు అర్థం కాదు. ఓ నెలరోజుల ముందు వాళ్ళ స్కూల్లో ఫ్రెండ్స్ హాలోవీన్ కాస్ట్యూమ్స్ గురించి మాట్లాడుకున్నారు. వాళ్ళందరూ అప్పటికే ఏం కొనుక్కోవాలో నిర్ణయించేసుకున్నారు. సాయంత్రం ఇంటికి రాగానే పండు వాళ్ళమ్మను కాస్ట్యూమ్ గురించి అడిగినప్పుడు ఆమె "ఆ...ఆ పిచ్చి డ్రస్సులకు అన్ని డబ్బులు తగలెయ్యడం ఎందుకూ?" అని దీర్ఘం తీసింది. పండు బిక్కమొహం చూసి వాళ్ళ నాన్న ప్రసాద్, "పోనీలే వైష్ణవీ, పిల్లలేదో సరదా పడుతున్నారు." అని సర్ది చెప్పాడు.

వీకెండ్ 'హాలోవీన్' డ్రస్ కొనడానికి 'పార్టీ సిటీ'కి వెళ్ళినప్పుడు పండు తను అప్పటికే నిర్ణయించుకున్న డ్రెస్ తీసేసుకున్నాడు. ప్రత్యూష కోసం డ్రస్ చూస్తున్నప్పుడు, వైష్ణవి ఆ షాపులో వున్నవేవీ నచ్చలేదంది. ఒక్క 'విజార్డ్ ఆఫ్ ఆజ్' లోని 'డోరతి' కాస్ట్యూమ్ మాత్రమే నచ్చిందది. ఎందుకని పండు అడిగిన ప్రశ్నకు "అదొక్కటే అందంగా ఉందంటూ" సమాధానం చెప్పింది. డెకరేషన్ కోసం ఏమన్నా కొందామని ప్రత్యూష అడిగింది కాని, అక్కడ రాక్స్ లో వున్న పాములు, తేళ్ళు , మండ్రగబ్బలు, దయ్యాలు ఏవీ నచ్చలేదంది. రక్తం కారుతున్నట్లున్న మాస్కులు, దయ్యం డ్రస్సులు అన్నీ చూస్తుంటే ఎమిటోలా ఉందని, అలాంటివి తనకస్సలు ఇష్టం ఉండవని చెప్పింది వైష్ణవి. అక్కడ డ్రస్ కొనుక్కున్నాక 'పంప్కిన్ పాచ్' కి వెళ్ళి కొన్ని చిన్న చిన్న గుమ్మడికాయలు ఓ పెద్ద గుమ్మడికాయ తెచ్చుకున్నారు.

హాలోవీన్ రోజు ఉదయం పండూ వాళ్ళ క్లాస్ రూమ్ లో హాలోవీన్ పార్టీ జరిగింది. గదంతా ఆరెంజ్, నలుపు రంగు కాగితాలలో అలంకరించారు. కాగితాలపై స్పైడర్ వెబ్, స్కేర్ క్రో, విచ్ బొమ్మలు వేసి వాటిని కత్తిరించి చేసి గదిలో అక్కడక్కడా అతికించారు. రెడ్ క్రాన్ బెర్రీ జ్యూస్, ఆరంజ్ కుకీస్, జెల్లీ వార్మ్స్, ఇంకా హాలోవీన్ కి సంబంధించిన రకరకాల స్నాక్స్ పెట్టారు. పండు వాళ్ళ టీచర్ పిల్లి కాస్ట్యూమ్ లో క్లాసుకి రావడం చాలా నచ్చింది వాడికి. తలమీదున్న పిల్లి చెవుల హెడ్ బాండ్, వెనుక వేలాడుతున్న తోక ఇంకా ఎక్కువ నచ్చేశాయి. స్కూల్ గ్రౌండ్ లో జరిగిన పెరేడ్ కి చాలా మంది పేరెంట్స్ వేషాలు వేసుకుని వెళ్ళారు. పిల్లలందరూ క్లాసుల వారిగా లైన్ గా ఆ పెరేడ్ లో నడిచారు. అక్కడకు వైష్ణవి కూడా వెళ్ళి పిల్లలకు బోలెడన్ని ఫోటోలు తీసింది.

*　　　*　　　*　　　*

పండు ఆ ఆదివారం మధ్యాహ్నం, పేపర్ మీద బూజుతో నిండిన ఇల్లు, లాన్ లో మూడు దయ్యాలు, ఓ స్కేర్ క్రో, మెరిసిపోయే అరేంజ్ లైటింగ్ వేసి ఇంటి ముందు వాళ్ళు నలుగురూ నిలబడినట్లుగా బొమ్మ వేశాడు. ఆ బొమ్మలో 'పవర్ రేంజర్ డ్రస్సు'లో తనను, 'విచ్ గౌను'లో ప్రత్యూష బొమ్మ వేసి, వాళ్ళమ్మకు 'డోరతి' కాస్ట్యూమ్, వాళ్ళనాన్నకు పైరేట్ డ్రస్ వేశాడు. ఆ బొమ్మను నాలుగు వైపులా తిప్పి తృప్తిగా చూసుకుని తన రూమ్ లో గోడమీద అంటించాడు.

●●●

# రివర్స్ శాంతా

"అమ్మా ట్రీ పెట్టేశాం, నెక్స్ట్ ఆర్నమెంట్స్. నువ్వు కూడా రా" అరిచాడు పండు. ముందు గదిలో కిటికీ పక్కన పచ్చగా ఏడడుగుల ఎత్తులో ఠీవిగా ఉంది క్రిస్ మస్ ట్రీ. పెద్ద డబ్బాలోనుండి కాగితాల్లో చుట్టిన ఆర్నమెంట్స్ ను హడావిడిగా బయటకు తీస్తున్నారు ప్రత్యూష, పండు. "జాగ్రత్త... జాగ్రత్తగా తియ్యండి. లేకపోతే విరిగిపోతాయి" అంటూ పిల్లల్ని హెచ్చరిస్తున్నాడు ప్రసాద్. వైష్ణవి వచ్చి వాళ్ళ పక్కనే తివాచీ మీద కూర్చుంది.

గుండ్రంగా చుట్టిన కాగితాల్లోంచి దబ్బకాయంత లేత నీలం రంగు బంతిని బయటకు తీశాడు పండు. దాన్ని వాళ్ళమ్మ మొహం దగ్గర ఆడిస్తూ "అమ్మా లుక్, మా ప్రీస్కూల్లో చేశానిది" అని ఎగురుకుంటూ ఆ బంతిని తీసికెళ్ళి చెట్టుకు తగిలించాడు.

"ఇది నా కిండర్ గార్టన్ లో మేక్ చేసింది" అంటూ ప్రత్యూష ఫోటో ఫ్రేం ను చెట్టుకు తగిలించింది.

అందులో ఐదేళ్ళ ప్రత్యూష ఫోటో అరచేయంత సైజులో ఉంది.

"ఇది నేను మా స్కూల్ సీక్రెట్ స్టోర్ లో బయ్ చేశాను" అంటూ బంగారు రంగు తళుకులతో మెరిసి పోతున్న శాంతా క్లాజ్ ని చూపించాడు పండు.

"మా కొలీగ్ లీసా ఇచ్చిందిది" మరో ఫోటో ఆర్నమెంట్ బయటకు తీశాడు ప్రసాద్.

అందులో ఉన్నపిల్లలిద్దరి జుట్టు రాగి రంగులో ఉంది.

"ఇది మనం 'లేక్ టాహో' వెళ్ళినప్పుడు తెచ్చింది కదూ!" ఓ చిన్న ఏంజల్ ను చూపించింది వైష్ణవి.

అలా కబుర్లు చెప్పుకుంటూ అన్ని ఆర్నమెంట్స్ చెట్టుకు తగిలించేశారు. చివరగా లైట్స్ పెట్టి స్విచ్ ఆన్ చెయ్యగానే పచ్చని చెట్టు, ఎరుపు, తెలుపు లైట్లతో వెలిగిపోతూ, ఆర్నమెంట్స్ తో నిండుగా ఉంది.

"చాలా కష్టపడ్డారు, ఇక లంచ్ చేద్దాం రండి". కింద పడిన కాగితాలన్నీ సరిచేసి వాటిని డబ్బాలో పెడ్తూ చెప్పింది వైష్ణవి. భోజనాలు పూర్తవగానే అక్కా, తమ్ముడూ ఒక గదిలోకి చేరారు.

"వాట్ దు వుయ్ దు నౌ?" అడిగాడు పండు.

అప్పటికే పుస్తకంలోని కాగితం సర్రున చింపుతున్న ప్రత్యూష "వుయ్ విల్ మేక్ ఎ లిస్ట్ ఫర్ శాంతా" అని చెప్తూ "ఔ..చ్" అని అరచింది.

"ఆర్ యు ఒకే?" కంగారుగా అడిగాడు.

"యా, ఐ యాం ఫైన్, ఇట్స్ జస్ట్ ఏ పేపర్ కట్" వేలు చూపించింది. తానో కాగితం తీసుకుని తమ్ముడికొకటి ఇచ్చింది.

"అక్కా ఐ నీడ్ నైన్ మోర్" అడిగాడు పండు.

"అన్నెందుకు పండూ?" అప్పుడే గదిలోకి వచ్చిన వైష్ణవి ఆశ్చర్యంగా అడిగింది.

"మే బీ హి విల్ హావ్ ఎ లాంగ్ లిస్ట్" కాగితాలు బరబరా చింపుతూ చెప్పింది ప్రత్యూష.

"అన్ని గిఫ్ట్స్ శాంతా క్లాజ్ మొయ్యలేడు నాన్నా" చెప్పింది వైష్ణవి.

"ఐ నో అమ్మా. శాంతా పాపం ఓల్డ్ కదా. ఓల్డ్ పీపుల్ కి సైట్ ఉంటుంది. చిన్న లెటర్స్ రాస్తే శాంతాకు కనిపించదు. పెద్ద పెద్ద లెటర్స్ రాస్తాను."

నవ్వింది వైష్ణవి. "సరే అలాగే పెద్ద అక్షరాలలోనే రాయి".

"అమ్మా, అసలు శాంతా ఎలా వస్తాడు?"

"ఫైర్ ప్లేస్ లో నుండి"

"అంత పెద్ద శాంతా బుల్లి ఫైర్ ప్లేస్ లో ఎలా సరిపోతాడు?"

"మాజిక్ పండూ" చెప్పింది ప్రత్యూష.

"మరీ...మరి, తన కార్ ఎక్కడ పార్క్ చేస్తాడు?"

"అదీ మాజిక్కే"

"శాంతా మనింట్లోనే ఉంటే బావుంటుంది. మనకి ఏం కావాలంటే అది మాజిక్ చేసి తెప్పించేస్తాడు" ఆశగా చెప్పాడు.

"మన దగ్గరే ఉంటే నీలాంటి పిల్లలందరికీ గిఫ్ట్స్ ఎవరిస్తారు?"

"దట్స్ ట్రూ" ఒప్పుకున్నాడు పండు.

"అందుకే శాంతా తనింట్లోనే ఉండి మీకు క్రిస్ మస్ కి గిఫ్ట్స్ తీసుకుని వస్తాడు." అంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది వైష్ణవి.

ప్రత్యూష కాగితం మీద చకా చకా రాస్తుంటే ఆసక్తిగా చూశాడు పండు. 'డాక్టర్ గ్రిప్' పెన్, 'డైరీ ఆఫ్ ఎ వింపీ కిడ్, హార్డ్ లక్', పింక్ షూస్, బిగ్ పిల్లో..."నో పండూ అలా చూడకూడదు" అంటూ వాడికి కనిపించకుండా పేపర్ పక్కకు పట్టుకుని వెళ్ళి మంచం మీద కూర్చుంది.

పండు పెన్సిల్ తీసుకుని కాగితం మీద ఒక గీత గీయగానే దానికి పెద్ద చిల్లి పడింది. ఆ కాగితం తీసేసి మరో కాగితం తీసుకుని దాని కింద పుస్తకం వత్తు పెట్టి రాయడం మొదలెట్టాడు. ముందుగా ఒకటి వేసి '*షుగర్ లెస్ కేరమెల్*' అని రాశాడు. నిన్న పండు ఐస్ క్రీం లోకి కేరమెల్ వేయమంటే వాళ్ళమ్మ వేయలేదు. పైగా "టూ మచ్ షుగర్స్ పండూ, ఇట్స్ నాట్ గుడ్ ఫర్ హెల్త్" అని కూడా చెప్పింది. ఇంతలో ఏదో శబ్దం వినిపించి, పెన్సిల్ పక్కన పెట్టి జాగ్రత్తగా విని ఒక్కుదుటన కిటికీ దగ్గరకు పరుగుతీశాడు పండు. ఓ మోటార్ సైకిల్ రయ్యన వాళ్ళ ఇంటి ముందునుండి దూసుకుని పోయింది. అది వీధి మలుపు తిరిగేవరకూ చూసి వెనక్కి వచ్చి లిస్ట్ లో '*మోటార్ సైకిల్* ' అని రాశాడు.

పెన్సిల్ బుగ్గకు ఆనించుకుని ఆలోచనలో పడ్డాడు పండు. స్కూల్లో షేరింగ్ కోసం 'శాలీ' చూపించిన వాళ్ళమ్మ వాళ్ళ వెడ్డింగ్ ఫోటో, ఇంకా ఆ వేళ వైష్ణవితో జరిగిన సంభాషణ అంతా గుర్తొచ్చింది వాడికి.

"అమ్మా నీ వైట్ గౌన్ ఎక్కడుంది?" స్కూల్ నుండి వస్తూనే అడిగాడు.

"వైట్ గౌనా...అసలు నాకు గౌనే లేదు నాన్నా?" చెప్పింది వైష్ణవి.

"అయితే నీకు వెడ్డింగ్ కూడా లేదా?" ఆశ్చర్యపోయాడు.

"ఛోరా వెధవా, అన్నీ పెద్ద మాటలు మాట్లాడుతున్నావ్" అంటూ కసురుకుంది.

ఇప్పుడు మూడో అంకె ఎదురుగా '*వెడ్డింగ్ గౌన్ ఫర్ అమ్మ*' అని రాసాడు.

ఇంతలో పెన్సిల్ లెడ్ అయిపోయింది. "దిస్ ఈజ్ ది లాస్ట్ ఒన్ పండూ. వు హేవ్ నో మోర్" పెన్సిల్లో లెడ్ వేస్తూ చెప్పింది ప్రత్యూష. నాలుగో అంకె దగ్గర '*ఎ ట్రక్ ఫుల్ ఆఫ్ పెన్సిల్ లెడ్స్*' అని రాసాడు, దానివైపోసారి చూసి పెన్సిల్ లెడ్స్ కొట్టేసి పక్కనే '*మెకానికల్ పెన్సిల్స్*' అని రాశాడు.

*     *     *     *     *

ఎవరో బెల్ కొడుతున్నట్లున్నారు 'టింగ్ టింగ్' మంటూ శబ్దం వినిపిస్తోంది, ఆ వెనుకే తలుపు తీసిన చప్పుడు కూడా. "పండూ, రాయన్ ఈజ్ హియర్" పిలిచింది వైష్ణవి. పండు పేపర్ పక్కన పెట్టి పరిగెత్తుతూ ముందు గదిలోకి వచ్చాడు.

'హేయ్ రాయన్" అంటూ వాడిని పలకరించి తన గదిలోకి తీసుకెళ్ళాడు. రాయన్ తన జేబులోని ఫోన్ తీసి చూపించాడు.

"వావ్..డిడ్ యు గెట్ యాన్ ఐ ఫోన్?" ఆశ్చర్యంగా అడిగాడు పండు.

"దిస్ ఈజ్ నాట్ మైన్, దిస్ ఈజ్ మై డాడ్స్."

"కెన్ ఐ సీ ఇట్?"

"యా... షూర్" పండుకు అందులో వున్న ఫీచర్స్ అన్నీ చూపించాడు.

"కూల్ రాయన్" మెచ్చుకున్నాడు పండు.

"మై న్యూ డాడ్ ఈజ్ సూపర్ కూల్. హి టేక్స్ కేర్ అఫ్ మి అండ్ మై మామ్ సో వెల్. దు యు వాంట్ టు సీ అవర్ పిక్చర్స్?" అంటూ వాళ్ళు ఈ మధ్య 'పిస్మో బీచ్' వెకేషన్ కి వెళ్ళిన ఫోటోలు చూపించాడు. అందులో 'ఎటివి రైడింగ్', 'హార్స్ రైడింగ్' ఫోటోలు చాలా నచ్చాయి పండుకు.

"పిస్మో బీచ్ వాజ్ సో మచ్ ఫన్, ఎస్పెషల్లీ 'ఎటివి రైడింగ్'" ఊరించాడు రాయన్.

ఆ అబ్బాయి వెళ్ళగానే ప్రసాద్ తో 'పిస్మో బీచ్' అంటూ కబుర్లు మొదలెట్టాడు పండు. అందులో సగంసేపు 'ఎటివి రైడింగ్' గురించే. అంతా విని ప్రసాద్ "పిస్మో బీచ్ మనకు చాలా దూరం పండూ, పైగా 'ఎటివి రైడింగ్' ఈజ్ టూ డేంజరస్" అంటూ పండు ఉత్సాహం మీద నీళ్ళు చల్లేసాడు. పండు కోపంగా వెళ్ళి శాంతా లిస్ట్ తీసి ఐదో అంకె వేసి దాని ఎదురుగా "*న్యూ డాడ్*" అని రాశాడు.

సాయంత్రం ప్రసాద్ కొలీగ్ అమర్ వాళ్ళ ఇంటికి డిన్నర్ కి వెళ్ళారు. వాళ్ళకు ఇద్దరు పిల్లలు మోనా, రీనా. చిన్నపాప రీనాకు బహుశా రెండేళ్ళుంటాయేమో! పండును తీసుకెళ్ళి తన బొమ్మలన్నీ చూపించింది. అలాంటి పిల్లల్ని చూసినప్పుడు పండుక్కూడా ఓ తమ్ముడో, చెల్లెలో కావాలని అనిపిస్తుంది. అంతకు ముందోసారి వాళ్ళమ్మ అడిగాడు కూడా. దానికి వైష్ణవి "ఉంటే బానే ఉంటుంది పండూ, కాని మనకు దేముడు ఇవ్వలేదుగా" అంది. డిన్నర్ పూర్తయి ఇంటికి వచ్చే దారిలోనే బోలెడు నిద్రొచ్చింది పండుకు. ప్రసాద్ ఎత్తుకుంటుండగా కళ్ళు తెరిచి చూశాడు. కారు ఇంటి ముందు ఆగి ఉంది. వాళ్ళ నాన్న మెడ చుట్టూ చేయి వేసి భుజం మీద తల పెట్టి నిశ్చింతగా పడుకున్నాడు. వాళ్ళ నాన్న వాడిని గదిలో పడుకోబెట్టడం, దుప్పటి కప్పడం, ఆ తరువాత ముద్దు పెట్టుకోవడం అన్నీ కళ్ళు మూసుకునే గమనించాడు పండు.

ఉదయం లేవగానే శాంతా లిస్ట్ తీసి '*బేబీ గర్ల్*' అని రాశాడు. కిందటి రోజు ఆఖరుగా రాసిన '*న్యూ డాడ్*' వైపు చూస్తూ "కొత్త డాడి వస్తే మరి ఈ డాడి ఎక్కడకు వెళ్తాడు? రాయన్ వాళ్ళ రియల్ డాడి లా వేరే ఇంటికి వెళ్ళిపోతాడా?" ఆ ఆలోచనేం నచ్చలేదు వాడికి. ఐదో అంకె ఎదురుగా రాసిన '*న్యూ డాడ్*' కొట్టేశాడు.

* * * * *

మరుసటి రోజు సాయంత్రం పండు, ప్రత్యూష బస్ స్టాప్ నుండి ఇంటికి వస్తున్నారు. వింటర్ అవడం వలన చెట్లన్నీ మోడువారి ఉన్నాయి. ఒక కొమ్మ మీద గూడు స్పష్టంగా కనిపిస్తోంది.

"అక్కా, వేర్ డిడ్ ది బార్డ్స్ గో?" గూడు చూపిస్తూ అడిగాడు.

"దే డోంట్ ఫైండ్ ఎనీ ఫుడ్ హియర్ ఇన్ వింటర్ పండూ. దే మైట్ హేవ్ మైగ్రేటెడ్ సమ్వేర్" సాలోచనగా చెప్పింది ప్రత్యూష.

"టు ది ఫారెస్ట్?"

"మే బీ" చెప్పింది.

ఇంటికి రాగానే వాళ్ళమ్మ పిలుస్తున్నా "కమింగ్... ఒన్ మినిట్ అమ్మా" అని పరిగెడుతూ వెళ్ళి లిస్ట్ తీసి ఏడో అంకె ఎదురుగా "*ఫారెస్ట్ ఫుల్ ఆఫ్ ఫుడ్ ఫర్ బర్డ్స్*" అని రాశాడు. ఒకవేళ అడవిలో కూడా చెట్లకు ఆకులు లేకపోతేనో అనుకుని, ఆ తరువాత అంకె ఎదురుగా '*థౌజండ్ ఫైవ్ హండ్రెడ్ లీవ్స్*" అని రాశాడు.

రాత్రి హోం వర్క్ చేయడం అయిపోయాక చేతిమీద తల పక్కకు పెట్టుకుని కార్పెట్ మీద బోర్లా పడుకున్నాడు. సోఫా పక్కనే వాడికి పసుపు పచ్చ కారు కనిపించింది. చటుక్కున లేచి దాన్ని తీసుకుని ముందుకు వెనుకను తిప్పుతుండగా వాడికో ఆలోచన వచ్చింది. కార్ పక్కన పెట్టి రెండు చేతులు వెనక నేల మీద ఏటవాలుగా ఆనించి తలెత్తి వాళ్ళక్కను చూస్తూ

"హేవ్ యు హేర్డ్ ఆఫ్ రివర్స్ శాంతా?" అడిగాడు.

"వాట్?" ఆశ్చర్యంగా పండు వైపు చూసింది ప్రత్యూష.

"రివర్స్ శాంతానా, అంటే?" అడిగాడు ప్రసాద్.

"శాంతా మనకు గిఫ్ట్స్ ఇస్తాడు కదా! రివర్స్ శాంతా మనకు ఇష్టం లేనివన్నీ మాజిక్ చేసి డిజప్పియర్ అయ్యేలా చేస్తాడు. ఇంకా బ్రోక్ అయినవి కూడా ఫిక్స్ చేస్తాడు." వివరించాడు.

"దట్స్ స్ట్రేంజ్" అని తల పంకిస్తూ "ఇట్ ఈజ్ పాజిబుల్" అని చెప్పింది ప్రత్యూష.

"బావుంది పండూ, ఈ శాంతా గురించి ఎవరు చెప్పారు?" అడిగింది వైష్ణవి.

"ఎవరూ చెప్పలేదు. నేనే ఫైండ్ చేశా" కిసుక్కున నవ్వాడు.

"బావుంది పండూ" వైష్ణవి, ప్రసాద్ ఇద్దరూ నవ్వారు.

"ఒకే ఐ'ఇల్ రైట్ ఎ లిస్ట్ ఫర్ దట్ శాంతా టూ" అంటూ మరో కాగితం తీసుకున్నాడు.

"మళ్ళీ ఇంగ్లీష్ వచ్చేస్తుంది. తెలుగులో మాట్లాడు పండూ" గుర్తుచేసింది వైష్ణవి.

* * * * *

పండు తన తన పుస్తకంలో నుండి ఓ కాగితం తీసుకుని దానిమీద 'ఫర్ రివర్స్ శాంతా' అని పైన రాసి కింద మొదటి అంకె వేసి *'అమ్మ హేజ్ టు ఫర్గాట్ తెలుగు'* అని రాశాడు. *'రేణుక ఆంటీ టూ'* అని పక్కనే రాశాడు. రేణుక పండుకు తెలుగు నేర్పించే టీచర్. మళ్ళీ పేపర్ చూసి అది మొత్తం కొట్టేసి *'పీపుల్ ఫ్రం ఆల్ ఓవర్ ది ఓర్ల్డ్ హేవ్ టు ఫర్గాట్ తెలుగు'* అని మార్చాడు. ఎదురుగా వున్న వాడి బాక్ పాక్ మీద రంధ్రంలో నుండి పెన్సిల్ బయటకు వచ్చింది. మొన్నటి వరకూ అక్కడే రంధ్రమూ లేదు. కత్తెర పనిచేస్తుందో, లేదోనని పండు చేసిన పరీక్షా ఫలితమే ఆ రంధ్రం. అదిచూస్తే వాళ్ళమ్మ, "కొని రెండునెల్లన్నా అవలేదు అప్పుడే చింపేశావా?" అంటుందని ఆమె చూడకుండా జాగ్రత్త పడుతున్నాడు. "అయినా బాక్ పాక్ ఎవరైనా రిప్ చేస్తారా? సిల్లీ మమ్మీ, జస్ట్ కట్ అయిందన్నా వినదు" అనుకున్నాడు. "*ఎనీవే ది రివర్స్ శాంతా విల్ ఫిక్స్ ఇట్, బిఫోర్ అమ్మా సీస్ ఇట్*" అనుకుంటూ ఆ రెండో అంకె ఎదురుగా ఆ విషయమే వ్రాశాడు.

పండు బెస్ట్ ఫ్రెండ్ 'ఐరీన్' మూడు నెలల నుండి స్కూల్ కి రావడం లేదు. మొన్న క్లాస్ లో ఆ పాప కోసం క్రిస్మస్ కార్డ్స్ చేసి కాన్సర్ హాస్పిటల్ కి పంపిచారు. లిస్ట్ లో *'ది కాన్సర్ హాజ్ టు గో అవే ఫ్రం ఐరీన్'* అని రాసాడు పండు.

"పండూ, హావ్ సమ్ 'ఎమ్ అండ్ ఎమ్స్'." ప్రత్యూష ఓ పేకెట్ తెచ్చి పండుకిచ్చింది. "ఐ ఓన్లీ వాంట్ రెడ్ ఒన్స్" అంటూ దాన్ని చివర్లో చింపి అందులోంచి ఎరుపు రంగువన్నీ వేరుచేసి మిగిలినవి వాళ్ళక్కకు ఇచ్చేశాడు. తింటూ తింటూ ఏదో గుర్తొచ్చి హఠాత్తుగా లేచి వాళ్ళమ్మ గదిలోకి వెళ్ళి డ్రస్సర్ ఆఖరి అర బయటకు లాగాడు. అడ్డుగా ఉన్న చిన్న నాప్ కిన్ తీయగానే, గవ్వలతో చేసిన అద్దం ఫ్రేము మీద అక్కడక్కడా 'ఎమ్ *అండ్ ఎమ్స్'* కనిపించాయి. పక్కనే గ్లూ గన్. అది వాడిపనే గ్లూ గన్ ఎలా పనిచేస్తుందో చూస్తూ వాటిని ఓ నెల క్రితం ఆ అద్దం మీద అంటించాడు. అవి గట్టిగా అంటుకునిపోయి ఎంతకీ రాలేదు. తను చేసిన పని అమ్మకు ఇంకా తెలియలేదని సంతోషిస్తూ నాప్ కిన్ జాగ్రత్తగా దానిమీద కప్పేసాడు.

లిస్ట్ లో 'ది ఎమ్ *అండ్ ఎమ్స్ ఆన్ ది ఫ్రేం హావ్ టు డిజప్పియర్'* అని రాశాడు. దాని కిందే తరువాత "*ఫిక్స్* ది *డివిడి ప్లేయర్*" అని రాశాడు. దానిక్కూడా ఓ కథ వుంది. ఈ మధ్య వైష్ణవి ఏదో సినిమా డివిడి తెచ్చినప్పుడు, పక్కింటి లక్ష్మి అది చూసి ఈ సినిమా "ఫస్ట్ హాఫ్ బావుంది వైష్ణవీ, సెకండ్ హాఫ్ చెత్త" అనడం విన్నాడు పండు. సెకండ్ హాఫ్ తీసెయ్యాలని ఆ డివిడిని సగం విరిచేసి డివిడి ప్లేయర్ లో పెట్టి ఆన్ చేసాడు. సినిమా రాలేదు సరికదా! డివిడి కూడా ఆ ప్లేయర్ నుండి బయటకు రాలేదు.

అప్పటి వరకు రాసిన కాగితాలను తీసుకుని కవర్ కోసం గదిలోకి వెళ్ళాడు పండు. అక్కడ టేబుల్ మీదున్న 'ఊనో' కార్డ్స్ చూడగానే వాడికి అమ్మమ్మతో 'ఊనో' ఆడడం గుర్తొచ్చింది. అలా ఆడేప్పుడు ఆవిడెప్పుడూ పండు పక్షమే. వాడంటే ఆవిడకు చాలా ఇష్టం. "అచ్చం మా నాన్నలా ఉన్నావని" ఎప్పుడూ అంటుండేది. ఇంకా పండుకు బోలెడు కథలు చెప్పేది. రోజూ రాత్రి పూట ఇంగ్లీష్లో కథలు కూడా చదివి వినిపించేది. పండు ఆవిడకు వీడియో గేమ్ ఆడడం నేర్పించాడు. వైష్ణవి పిల్లల్ని చిన్న మాటన్నా, "ఎందుకమ్మా అలా కోప్పడతావు?" అంటూ వైష్ణవినే మందలించేవారావిడ.

అలాంటి అమ్మమ్మకు ఒంట్లో బాగాలేదని ఓ రోజు ఇండియా నుండి ఫోన్ రాగానే నలుగురూ ఇండియా వెళ్ళారు. పండు ఇల్లంతా వెతికాడు కాని అమ్మమ్మ ఎక్కడా కనిపించలేదు, దేముడి దగ్గరకు వెళ్ళిందని చెప్పారెవరో. మనం కూడా వెళ్దామని వాడడిగినప్పుడు "తప్పు నాన్నా, అలా అనకూడదని" చెప్పాడు వాళ్ళ తాతయ్య. ఎందుకు తప్పో వాడికి తెలియలేదు. ఆ తరువాత కూడా వాళ్ళమ్మమ్మెప్పుడూ వాడితో ఫోన్ లో కూడా మాట్లాడలేదు.

మొదటి శాంతా లిస్ట్ లో ఐదో అంకె దగ్గర 'న్యూ డాడ్' కొట్టేసిన చోట "అమ్మమ్మ" అని రాశాడు. అన్ని కాగితాలను జాగ్రత్తగా మడిచి కవర్లో పెట్టి, క్రిస్ మస్ ట్రీ కింద వాళ్ళక్క పెట్టిన కవర్ పక్కనే పెట్టాడు పండు.

●●●

## *సమాప్తం*